www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 355
సోమవారం | 2-3-2026
శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి తె. 5:56 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: ఆశ్లేష ఉ.7:52 తదుపరి మఖ, వర్జ్యం: రా.7:41-9:16, దుర్ముహూర్తం: మ.12:50-1:37, మ.3:11-3:57, అమృతఘడియలు: శేషం ఉ.7:52, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:37, సూర్యాస్తమయం: 6:18
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


అమరావతిలో ఆదివారం ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తుల నివాసాలు

భారత డీఎన్‌ఏలోనే మధ్యవర్తిత్వం!

- ఇది ప్రపంచవ్యాప్తంగా ఆమోదించిన ప్రక్రియ
- మధ్యవర్తిత్వానికి అమరావతి భూసమీకరణ పెద్ద ఉదాహరణ
- న్యాయవ్యవస్థ కూడా దానిని ప్రోత్సహించాలి
- మలేసియాలో బాగా వినియోగిస్తున్నారు
- ప్రతి సమస్యకూ కోర్టుకెళ్లడం పరిష్కారం కాదు
- విజయవాడలో మీడియేషన్ సదస్సులో సీజేఐ
- రాజధానిలోని జస్టిస్ సిటీలో జ్యుడీషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ వర్సిటీ
- వీటికి భూములివ్వడానికి సిద్ధం: ముఖ్యమంత్రి

నాడు భారతంలో శ్రీకృష్ణుడు మధ్యవర్తి: జస్టిస్ సూర్యకాంత్

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భారతదేశ డీఎన్‌ఏలోనే మధ్యవర్తిత్వం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టంచేశారు. మహాభారతంలో రెండు వర్గాల మధ్య సంధి కుదిర్చేందుకు శ్రీకృష్ణుడు మధ్యవర్తిగా వ్యవహరించాడని.. కానీ విఫలమయ్యాడని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా సంస్థ నేతృత్వంలో ఆదివారం విజయవాడలో మధ్యవర్తిత్వంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబు స్వాగతం పలికారు. కోర్టుల వల్ల కుటుంబ సమస్యలు, ఇతరత్రా సమస్యలు కొంత వేగంగా

మిగతా 2వ పేజీలో...

న్యాయం త్వరగా అందాలి!

ప్రజలకు కోర్టులు అందుబాటులో ఉండాలి: జస్టిస్ సూర్యకాంత్

- బార్, బెంచ్.. కోర్టుకు రెండు చేతులు.. పరస్పర సమన్వయంతో సాగాలి
- న్యాయస్థానాలకు మౌలిక వసతుల కల్పన ప్రధాన సమస్య
- 50 ఏళ్లు, వందేళ్ల అవసరాలకు సరిపడా సదుపాయాలు కల్పించాలి
- రాష్ట్రాలకు సీజేఐ వినతి.. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వ సహకారం భేష్
- 115 కోట్లతో తిరుపతిలో కోర్టు కాంప్లెక్స్‌కు శంకుస్థాపన
- అంతకుముందు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ప్రధాన న్యాయమూర్తి

2


అమరావతిలో న్యాయమూర్తుల నివాస గృహాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, పక్కన సీఎం చంద్రబాబు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

అమరావతిలో బిజీబిజీగా సీజేఐ పర్యటన


- జ్యుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన చేసిన జస్టిస్ సూర్యకాంత్
- హైకోర్టు అతిథిగృహ నిర్మాణానికి భూమిపూజ
- న్యాయమూర్తుల నివాస గృహాల సముదాయం ప్రారంభం
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు జడ్జీలు, హైకోర్టు సీజే


అమెరికా-ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్‌లో దట్టంగా అలుముకున్న పొగ

ఇరాన్ మధ్యంతర సుప్రీం లీడర్‌గా అయతుల్లా అలీరేజా అరాఫీ

- ముగ్గురు సభ్యుల గార్డియన్ కౌన్సిల్‌లో అరాఫీకి చోటు
- సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు కూడా

ఇరాన్‌లో అధికార మార్పిడి బాధ్యతలు తీసుకుంటున్నా: రెజా పహ్లవీ


అలీరేజా అరాఫీ

క్షిపణి దాడిలో ఖమేనీ మృతి

ఇరాన్ కకావికలం

రక్షణ, ఐఆర్‌జీసీ, ఎయిర్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్ కార్యాలయాలు ధ్వంసం



బిక్కుబిక్కుమంటున్న తెలుగువారు

- కువైత్, ఖతార్‌లో నెల్లూరు వాసుల ఆందోళన
- దుబాయ్‌లో అనంత వాసులు
- వచ్చే దారిలేక విమానాశ్రయంలోనే
- పరిస్థితిపై ఏపీ ప్రభుత్వం ఆరా
- అండగా ఉంటాం: కొండపల్లి

పరిస్థితి భయానకంగా ఉంది: పీవీ సింధు

భగ్గుమన్న పాక్!

- కరాచీలో అమెరికా కాన్సులేట్‌పై రాళ్ల దాడి
- కాల్పుల్లో పది మంది మృతి

జమ్ముకశ్మీర్‌లో నిరసన

- ఖమేనీ హత్యను ఖండిస్తూ రోడ్డెక్కిన ఆందోళనకారులు
- అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు

సమగ్ర కథనాలు 12, 13, 14

- 9 ఇరాన్ యుద్ధనౌకలు, నేవీ హెడ్‌క్వార్టర్‌పై దాడి
- టెహ్రాన్ సహా ఇరాన్ నగరాలపై ఇజ్రాయెల్ బాంబులు
- రక్షణ మంత్రి, రెవల్యూషనరీ గార్డ్స్ చీఫ్ మృతి
- వందల సంఖ్యలో సైనికులు, భద్రతా సిబ్బంది కూడా..
- పాఠశాలపై క్షిపణి దాడిలో 165కు చేరిన మృతులు
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లోని 27 అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడిన ఇరాన్
- ఇజ్రాయెల్‌లో 9 మంది.. గల్ఫ్ దేశాల్లో ఆరుగురి మృతి
- ముగ్గురు అమెరికా సైనికులూ.. ఐదుగురు విషమం
- టెహ్రాన్, ఇతర నగరాల్లో ఖమేనీకి వేలాది మంది నివాళి
- 40 రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన ఇరాన్
- ఇంకా వేలాది లక్ష్యాలపై దాడులు చేస్తాం: నెతన్యాహు
- హోర్ముజ్ జలసంధిలో 3 చమురు నౌకలపై క్షిపణులు
- ఒక నౌకలో 15 మంది భారతీయులు.. క్షేమం

దుబాయ్/వాషింగ్టన్/టెల్‌అవీవ్, మార్చి 1: ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడమే లక్ష్యమంటూ దాడులకు దిగిన అమెరికా, ఇజ్రాయెల్.. తొలిదాడినే అత్యంత కచ్చితత్వంతో పూర్తిచేశాయి. టెహ్రాన్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ప్రధాన కార్యాలయంపై 30కిపైగా బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడిలో అయతుల్లా ఖమేనీ (86) మరణించారు. ఆయనతోపాటు ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ నసీర్‌జాదే, ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్ మహమ్మద్ పాక్‌పౌర్, ఖమేనీ ప్రధాన సలహాదారు అలీ షంఖనీ, మరో నలుగురు మిలటరీ ఉన్నతాధికారులు, ఖమేనీ కుమార్తె, అల్లుడు, కోడలు, మనవడు కూడా శనివారం ఉదయం జరిగిన తొలి దాడుల్లోనే మృతిచెందారు. కానీ ఆదివారం ఉదయం వరకు వివరాలు బయటికి రాలేదు. ఖమేనీ మృతిని నిర్ధారించుకున్న తర్వాత ఆదివారం ఉదయం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. తర్వాత కాసేపటికి ఇరాన్ సుప్రీం లీడర్ అమరుడయ్యారని ఆ దేశ అధికారిక టీవీ చానల్ 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ (ఐఆర్ఐబీ)' వెల్లడించింది. ఖమేనీ తన కార్యాలయంలో ఉండగా జరిగిన దాడిలో

మిగతా 12వ పేజీలో...

ఇరాన్‌పై దాడులను స్వయంగా పర్యవేక్షించిన ట్రంప్

ఫొటోలు విడుదల చేసిన వైట్‌హౌస్



ఆపితే సరి.. లేకుంటే వినాశనమే

- ఒక్క దెబ్బతో 48 మంది ఇరాన్ నేతలను చంపేశాం
- ఇరాన్ కొత్త నాయకత్వం చర్చలు జరుపుదామంది
- అందుకు అంగీకరించా.. ఈ పని ముందే జరగాల్సింది
- పశ్చిమాసియాలో శాంతి నెలకొనేదాకా దాడులు: ట్రంప్

ఖొమేనీ ప్రభావంతో విప్లవ బాట..!

- ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎదిగిన ఖమేనీ
- దశాబ్దాల తరబడి దేశాన్ని పాలించిన నేత
- ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం

అరబ్ దేశాలు అతలాకుతలం

- ఇరాన్ క్షిపణి దాడులతో ప్రజల్లో తీవ్ర ఆందోళన
- అమెరికా దాడుల్ని సమర్థించిన ఆస్ట్రేలియా, కెనడా.. ఖండించిన రష్యా, చైనా

యూఏఈపై దాడులను ఖండిస్తున్నా

- కష్ట సమయంలో వెన్నంటే ఉంటాం
- యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌తో మాట్లాడా: మోదీ

కన్నీరు మున్నీరు

- బాణసంచా పేలుడులో 23కు చేరిన మృతులు
- కాకినాడ జీజీహెచ్‌లో మరో ఇద్దరి మృతి
- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- 8 మంది కార్మికులే పనిచేసేందుకు అనుమతి
- కానీ 40 మంది కూలీలతో పని
- ప్రమాద స్థలిని పరిశీలించిన మంత్రులు
- బాణసంచా కేంద్రంలో వైసీపీ కరపత్రాలు
- స్థానిక వైసీపీ ఎంపీపీ పాత్రపై విచారణ: అనిత
- కాకినాడ జిల్లాలో తాత్కాలికంగా బాణసంచా తయారీ కేంద్రాల మూసివేత

3

బంధువులకు మృతదేహాలు అప్పగింత

- ఆరు మృతదేహాలు ఒకేచోట ఖననం
- మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ


బాణసంచా పేలుడు జరిగిన ప్రాంతంలో మంత్రులు అనిత, నారాయణ తదితరులు


నాగ్‌పూర్ జిల్లా రావుల్‌గావ్‌లో పేలుడు జరిగిన ప్రాంతం

ఫ్యాక్టరీలో పేలుడు..

14

17 మంది సజీవ దహనం

- మహారాష్ట్రలోని రావుల్‌గావ్‌లో ఘటన
- గుర్తించలేనంతగా కాలిన మృతదేహాలు
- మరో 18 మందికి గాయాలు

సంజూ మాయ



సెమీఫైనల్‌కు ఇండియా

- కీలక పోరులో వెస్టిండీస్‌పై భారత్ విజయం
- బ్యాటింగ్‌లో చెలరేగిన శాంసన్
- 5న ఇంగ్లండ్‌తో సెమీస్

టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ చేరాలంటే చావోరేవో లాంటి మ్యాచ్.. క్వార్టర్ ఫైనల్ లాంటి పోరులో భారత్, వెస్టిండీస్ జట్లు తమ శాయశక్తులా పోరాడాయి. ఈడెన్‌గార్డెన్స్‌లో పరుగుల వరద పారించాయి. అభిమానులకు అసలు సిసలైన టీ20 మజాను అందించాయి. సెమీస్ బెర్త్ కోసం ఇరుజట్లు నువ్వానేనా అన్నట్టు తలపడినా.. ఓపెనింగ్ బ్యాటర్ సంజూ శాంసన్(97 నాటౌట్) బ్యాటింగ్ మాయతో డిఫెండింగ్ చాంపియన్ టీమిండియా టోర్నీలో ముందడుగు వేసింది. 196 పరుగుల భారీ ఛేజింగ్‌లో సహచర బ్యాటర్లు కీలక సమయంలో వికెట్లు పారేసుకున్నా.. ఏమాత్రం తడబడకుండా బ్యాట్‌తో మాయ చేసిన సంజూ.. తన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలిచే అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. చివరి వరకు క్రీజులోనే ఉండి టీమిండియాను సెమీఫైనల్‌కు చేర్చడమే కాక కరీబియన్లను టోర్నీ నుంచి సాగనంపాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 194 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం ఛేజింగ్‌లో 19.2 ఓవర్లు ఆడిన భారత్ 5 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసి గెలిచింది. గురువారం జరిగే సెమీస్‌లో ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

11

అమరావతిలో బిజీబిజీగా

సీజేఐ పర్యటన

- జ్యుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన చేసిన జస్టిస్ సూర్యకాంత్
- హైకోర్టు అతిథిగృహ నిర్మాణానికీ భూమిపూజ
- న్యాయమూర్తుల నివాస గృహాల సముదాయం ప్రారంభం
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు జడ్జీలు, హైకోర్టు సీజే

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాజధాని అమరావతిలో బిజీబిజీగా గడిపారు. రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు అతిథిగృహం నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే నూతనంగా నిర్మించిన హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయం(రెసిడెన్సియల్ ఎన్‌క్లేవ్)ను ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నం తిరుపతి నుంచి విజయవాడకు చేరుకున్న సీజేఐ విమానాశ్రయం నుంచి నేరుగా రాజధాని అమరావతికి చేరుకున్నారు. తుళ్లూరు మండలం, పిచ్చుకల పాలెం గ్రామంలో అధునాతన హంగులతో నిర్మించనున్న రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ భవనానికి శంకుస్థాపన చేశారు. భూమిపూజ నిర్వహించి, పునాది రాయి వేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీ బట్టి, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీజేఐ, ఇతర న్యాయమూర్తులకు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో పండితులు స్వాగతం పలికారు. అనంతరం సీజేఐ.. సీఎం చంద్రబాబు, ఇతర న్యాయమూర్తులతో కలిసి జ్యుడీషియల్ అకాడమీ, రాజధాని అమరావతి అభివృద్ధిపై రూపొందించిన డాక్యుమెంటరీని తిలకించారు. అనంతరం అక్కడి నుంచి నేలపాడులోని హైకోర్టు సమీపంలో కొత్తగా నిర్మించిన న్యాయమూర్తుల గృహ సముదాయం వద్దకు సీజేఐ చేరుకున్నారు. అక్కడ హైకోర్టు అతిథి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భూమిపూజ నిర్వహించి, పునాది రాయి వేశారు. అనంతరం అధునాతన హంగులతో నిర్మించిన న్యాయమూర్తుల నివాస సముదాయాన్ని సీజేఐ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, సాధారణ పరిపాలన, పురపాలకశాఖల ముఖ్యకార్యదర్శులు శ్యామలరావు, సురేష్‌కుమార్, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ పురుషోత్తమ్‌కుమార్, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) కనకమేడల రవీంద్ర కుమార్, హైకోర్టు రిజిస్ట్రార్‌లు, పలువురు న్యాయాధికారులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు సీజేకు గవర్నర్ తేనీటి విందు

- సీఎం, హైకోర్టు సీజే, డిప్యూటీ సీఎం, సుప్రీం న్యాయమూర్తుల హాజరు


లోక్‌భవన్‌లో జరిగిన తేనీటి విందులో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు పుషగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యటనకు వచ్చిన సుప్రీం జస్టిస్ సూర్యకాంత్ గౌరవార్థం ఆయనకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తేనీటి విందు ఇచ్చారు. ఆదివారం జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్రంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం గవర్నర్ ఆహ్వానం మేరకు విజయవాడలోని లోక్‌భవన్‌కు వెళ్లిన సీజేకు గవర్నర్ ప్రత్యేకంగా పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. తేనీటి విందులో గవర్నర్‌తో పాటు సీఎం చంద్రబాబు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులున్నారు. అలాగే, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ పమిడిఘంటం నరసింహ, జస్టిస్ పి.కె.మిశ్రా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, జస్టిస్ జోయ్ మాల్యాబాగ్చి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జ్యుడీషియల్ అకాడమీ ప్రత్యేకతలు ఇవీ..

రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీని 4.83 ఎకారాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. మొత్తం విస్తీర్ణంలో 31శాతం భవనాలకు, 69 శాతం పచ్చదనం కోసం కేటాయించారు. అకాడమీ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.165 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. అకడమిక్ బ్లాక్‌ను జీప్లస్-3, హాస్టల్ బ్లాక్‌ను జీప్లస్-8గా నిర్మించనున్నారు. మరో జీప్లస్-3 బ్లాక్‌లో ఇండోర్ స్పోర్ట్స్, అతిథులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. అకాడమీలో ఒకేసారి 120 మంది ట్రైనీ న్యాయమూర్తులకు శిక్షణ ఇవ్వగల సామర్థ్యంతో పాటు 60 మంది ఫ్యాకల్టీ, సిబ్బందికి వసతులు కల్పించేలా భవనాలను నిర్మిస్తున్నారు. హైకోర్టు నుంచి 5.7 కిలోమీటర్ల దూరంలో ఈ అకాడమీ నిర్మాణం చేస్తున్నారు. అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ బ్లాక్‌లో 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం, ప్రీ ఫంక్షన్ ఏరియా, 120సీట్లతో కూడిన సెమినార్ హాల్, 70 సీట్లతో రెండు క్లాస్‌రూమ్‌లు, 70సీట్లతో నమూనా కోర్టుహాలు, 50 సీట్లతో కంప్యూటర్ ల్యాబ్, 60 సీట్లతో ఫోరెన్సిక్ ల్యాబ్, 48 సీట్లతో లైబ్రరీ-రీడింగ్ రూమ్, డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, జడ్జీల లాంజ్, ఫ్యాకల్టీ రూమ్, కొలాబరేషన్ రూమ్, హెల్త్ యూనిట్, క్రెచీ సౌకర్యం ఉంటాయి. జీప్లస్-8 అంతస్తులతో కూడిన హాస్టల్ భవనంలో జ్యుడీషియల్ అధికారులు, ట్రైనీలకు వసతి, 98 సీట్లతో టిపికల్ హాస్టల్ యూనిట్, 5 సూట్ రూమ్‌లు, ప్రతి అంతస్తులో లాంజ్‌స్పేస్, ప్యాంట్రీ, యుటిలిటీ సౌకర్యాలు కల్పించబోతున్నారు. జీప్లస్-3 అంతస్తులతో కూడిన ఇండోర్ స్పోర్ట్స్, రిక్రియేషన్ బ్లాక్‌లో 108 సీట్ల డైనింగ్ హాల్, 100 సీట్ల వీఐపీ డైనింగ్ హాల్, పూర్తి సదుపాయాలతో కిచెన్, స్క్వాష్ కోర్టు, జిమ్, యోగా తదితర మల్టీపర్పస్ హాల్ నిర్మించనున్నారు.

న్యాయమూర్తుల నివాస గృహాల్లో అత్యాధునిక హంగులు

హైకోర్టు న్యాయమూర్తుల కోసం మొత్తం 36 నివాస గృహాలను అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని భవనాల నిర్మాణం పూర్తవడంతో ప్రారంభోత్సవం చేశారు. పంచదనం కోసం కేటాయించిన స్థలంతో కలిపి ఒక్కో బంగ్లా విస్తీర్ణం 18 వేల చదరపు అడుగులు ఉంది. జీప్లస్-1తో నిర్మించిన ఈ భవనంలో విశాలమైన 4 పడక గదులతో పాటు ఆఫీస్ రూమ్, డ్రాయింగ్ హాల్, డైనింగ్ ఏరియా, ఫ్యామిలీ లాంజ్, అధునాతన కిచెన్, ఆటోసెన్సార్ విద్యుత్ సౌకర్యం, జిమ్ రూమ్, మల్టీపర్పస్ హాల్, దేవుడి గది ఉన్నాయి. ప్రధాన భవనం వెలుపల సర్వెంట్ క్వార్టర్, సెక్యూరిటీ గది ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం అనంతరం న్యాయమూర్తుల గృహ సముదాయంలో కల్పించిన సౌకర్యాలను న్యాయమూర్తులు పరిశీలించారు. నిర్మాణ సంస్థ బీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు అక్కడ కల్పించిన అత్యాధునిక సౌకర్యాలను న్యాయమూర్తులకు వివరించారు. కాగా, హైకోర్టు నుంచి 1.2 కిలోమీటర్ల దూరంలో న్యాయమూర్తుల అతిథిగృహం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.69 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.


రాజధాని అమరావతిలో ఆదివారం ప్రారంభించిన న్యాయమూర్తుల బంగ్లాలో వసతులను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ గుణరంజన్, జస్టిస్ సుమతి, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ విజయ్


మధ్యవర్తిత్వంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, తదితరులు


తిరుపతి జిల్లా దామినేడులో కోర్టు కాంప్లెక్సుకు శంకుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్


అమరావతిలో హైకోర్టు గెస్ట్ హౌస్, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, పక్కన చంద్రబాబు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

న్యాయం త్వరగా అందాలి!

ప్రజలకు కోర్టులు అందుబాటులో ఉండాలి: జస్టిస్ సూర్యకాంత్

తిరుపతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యాయస్థానాలు అందుబాటులో ఉండాలని.. అదే సమయంలో న్యాయం త్వరగా అందాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆకాంక్షించారు. ఆదివారం తిరుపతిలోని దామినీడులో ప్రభుత్వం కేటాయించిన 14.5ఎకరాల్లో రూ.115కోట్ల అంచనా వ్యయంతో 16 కోర్టు కార్యాలయాలతో కూడిన ఆరంతస్తుల భవన సముదాయ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం తిరుపతి బార్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో న్యాయవాదులను ఉద్దేశించి ప్రసంగించారు. భవన సదుపాయాలు, ఇతర ఆధునిక మౌలిక వసతుల కల్పన అనేది దేశవ్యాప్తంగా న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటని చెప్పారు. అయితే అవన్నీ సమకూర్చుకున్నాక ప్రజలకు సులువుగా న్యాయం అందించడమనే రెండో సవాల్‌ను కూడా న్యాయవ్యవస్థ ఎదుర్కొంటోందన్నారు. 'తక్కువ ఖర్చుతో ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయించే పరిస్థితులు నెలకొనాలి. అదే సమయంలో వారికి సత్వర న్యాయం అందించాల్సిన అవసరం కూడా ఉంది. న్యాయస్థానాల్లో బార్ అసోసియేషన్లు, బెంచ్‌లు వేర్వేరు కాదు. న్యాయ వ్యవస్థకు అవి రెండు చేతులు. పరస్పర సమన్వయంతో, సహకారంతో పనిచేయాలి. ప్రజలకు న్యాయం అందించాల్సిన బాధ్యత కేవలం న్యాయమూర్తులదే అన్న అపోహ అందరిలో ఉంది. బలమైన న్యాయవాదులు ఉన్నప్పుడే ధర్మాసనం సైతం దానికి తగినట్లు జాగ్రత్తగా, లోతుగా ఆలోచించి తీర్పులు చెబుతుంది. దీనివల్ల తీర్పుల్లో నాణ్యత పెరుగుతుంది. ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం, గౌరవం పెంపొందుతాయి. న్యాయస్థానాలకు భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో భూమి ఎప్పుడూ పరిమితంగానే ఉంటుంది. రాబోయే కాలంలో భూముల కొరత మరింత ఎక్కువగా ఉంటుంది. దాన్ని దృష్టిలో ఉంచుకుని రాబోయే 50 ఏళ్లు, వందేళ్ల అవసరాలకు సరిపడే విధంగా భవనాలను, మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను కోరుతున్నాం' అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కోర్టులకు భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించడానికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు.

ఎక్కడి నుంచైనా న్యాయం అందించాలి: ఏపీ సీజే

జమ్మూకశ్మీరు న్యాయమూర్తులను స్ఫూర్తిగా తీసుకుని.. ఎక్కడి నుంచైనా ప్రజలకు న్యాయం అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ న్యాయాధికారులకు, న్యాయవాదులకు పిలుపిచ్చారు. బార్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014-15లో జమ్మూకశ్మీర్లో వరదలు సంభవించాయని, ఆ వరదల్లో శ్రీనగర్‌లోని హైకోర్టు భవనం మొదటి అంతస్తు సగం దాకా మునిగిపోయిందని.. రికార్డులు కూడా కొట్టుకుపోయాయని తెలిపారు. అయితే అప్పటి న్యాయమూర్తులు తమ నివాసాలనే కార్యాలయాలుగా మార్చుకుని పనిచేశారని గుర్తు చేసుకున్నారు. తమ నివాస బంగళాల ఆవరణలో టెంట్లు వేసి మరీ కోర్టు నడిపారన్నారు. వారి తరహాలోనే వసతుల కోసం, మౌలిక సదుపాయాల కోసం చూడకుండా ఏ పరిస్థితుల్లోనైనా ప్రజలకు న్యాయం అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కోర్టులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తే నిస్సందేహంగా న్యాయవ్యవస్థ సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు. 2023లో తాను రాష్ట్రానికి వచ్చాక వేసవి కాలంలో కోర్టుల్లో న్యాయమూర్తులు, అధికారులు ఇబ్బందులు పడడం గమనించానని.. అప్పుడే అన్ని జిల్లాల కోర్టు సముదాయాల్లో ఏసీ సదుపాయం కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ అహసదుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ డి.రమేశ్, జస్టిస్ కె.మహేశ్వరరావు, జస్టిస్ టీసీడీ శేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణా సారిక, తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టి గజేంద్ర, హైకోర్టు అధికారులు, జిల్లాలోని న్యాయాధికారులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయడు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో జస్టిస్ సూర్యకాంత్

తిరుమల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ సమయంలో మహద్వారం వద్దకు చేరుకున్న ఆయనకు.. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆలయ మర్యాదలతో ఇస్తికాఫాల్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన జస్టిస్ సూర్యకాంత్ ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. తర్వాత ఛైర్మన్, ఈవో, అదనపు ఈవోలు సీజేఐకు శ్రీవారి లడ్డూప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. తర్వాత క్షేత్రసంప్రదాయం ప్రకారం వరాహస్వామిని కూడా దర్శించుకున్నారు. పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఏపీ హైకోర్టు సీజే, జడ్జీలతోపాటు అలహాబాద్ హైకోర్టు సీజే జస్టిస్ అరుణ్ భన్సాలీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్ర, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చంద్రశేఖర్ శర్మ, జస్టిస్ బిపిన్ గుప్తా, జస్టిస్ యోగేంద్ర కుమార్ పురోహిత్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మంజూషా దేశ్‌పాండే, లోకాయుక్త బీఎస్ పాటిల్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

భారత డీఎన్ఏలోనే

మధ్యవర్తిత్వం!

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారం అవుతున్నప్పటికీ.. తెగని చాలా సమస్యలకు మధ్యవర్తిత్వం ఎంతో ఉపయుక్తంగా ఉందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ప్రతి సమస్యకూ కోర్టుకు వెళ్లడంతో పరిష్కారం కాదని, కుటుంబ తగాదాల వల్ల కోర్టుల్లో కేసులు ఎక్కువవుతున్నాయని తెలిపారు. మొదట ఇరుపక్షాలూ మధ్యవర్తిపై నమ్మకం ఉంచితేనే సత్ఫలితాలొస్తాయన్నారు. మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మధ్యవర్తిత్వం ప్రస్తుత కాలంలో ఆమోదించిన ప్రక్రియగా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ కూడా దీనిని ప్రోత్సహించాలన్నారు. తాను మలేసియా చీఫ్ జస్టిస్‌ను కలిసినప్పుడు వారు మధ్యవర్తిత్వాన్ని ఎంత బాగా వినియోగించుకుంటున్నారో అర్థమైందని చెప్పారు. ఏపీ ప్రభుత్వం భూసమీకరణ కోసం రైతులతో జరిపిన చర్చల ఫలితమే రాజధాని అమరావతి అని, మధ్యవర్తిత్వానికి ఇదో ఉదాహరణగా అభివర్ణించారు.

విశాఖ సదస్సుకు సీఎం సహకరించారు: సీజే

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. విశాఖలో జరిగిన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సదస్సుకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. జమ్మూకశ్మీర్లో తాను న్యాయమూర్తిగా ఉన్నప్పుడు.. అమెరికాలో స్థిరపడిన ఓ వ్యక్తి వారసత్వ ఆస్తి గురించి తనను ఓ న్యాయవాది సంప్రదించారని.. అప్పుడు వారి సోదరుడితో ఎందుకు మాట్లాడకూడదని అడిగానని.. ఆరు నెలల తర్వాత ఆయన కనిపించి తన కుటుంబం, సోదరుడి కుటుంబం కలిసిపోయాయని, దూరం చేసుకోలేదని చెప్పారని.. మధ్యవర్తిత్వానికి ఉన్న శక్తి అలాంటిదని అన్నారు. మధ్యవర్తిత్వం విజయవంతమైతే రూ.10వేలు, కాకపోతే రూ.3 వేలు ఇన్సెంటివ్‌గా చెల్లించేందుకు సీఎం అంగీకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



దేశంలోనే బెస్ట్ మోడల్‌గా: సీఎం

అమరావతిలో జాతీయ జ్యుడీషియల్ అకాడమీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి భారత ప్రధాన న్యాయమూర్తిని ఈ సందర్భంగా కోరారు. 'రాజధాని నిర్మాణంలో భాగంగా జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. జ్యుడీషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి వాటితో ఈ సిటీని నిర్మిస్తాం. వీటికి అవసరమైన భూములివ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అమరావతి జస్టిస్ సిటీని దేశంలోనే బెస్ట్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. దీనికి భారత ప్రధాన న్యాయమూర్తి సహకారం కావాలి' అని అన్నారు. తన చిన్నతనంలో తన తండ్రి తమ గ్రామంతో పాటు చుట్టుపక్కల 40 గ్రామాలకు సంబంధించి మధ్యవర్తిత్వం చేసేవారని, ఇది మన సంప్రదాయంలోనే ఉందని అన్నారు. 'ప్రపంచంలో అత్యంత ప్రధానమైన మధ్యవర్తిత్వ కార్యక్రమం అమరావతిలో 2014-19 మధ్య కాలంలో జరిగింది. 29 వేల మంది రైతులతో మధ్యవర్తిత్వం నెరపి.. 33 వేల ఎకరాలను భూసమీకరణ (ల్యాండ్‌పూలింగ్) ద్వారా సేకరించాం' అని వివరించారు. మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరిస్తే రూ.10 వేలు.. పరిష్కారం కానున్నా రూ.3వేలు ఇన్సెంటివ్‌గా ఇస్తామని హామీ ఇచ్చారు. కేసులు పరిష్కారమై సత్వర న్యాయం అందితే.. త్వరితగతిన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 'దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. బ్లూ-గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం. ప్రజల అవసరాలకు అనుగుణంగా, పర్యావరణహితంగా, ఆర్థికంగా బలమైన రాజధానిగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం' అని తెలిపారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, పలువురు న్యాయమూర్తులు, జిల్లా మేజిస్ట్రేట్‌లు, న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను, ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను సత్కరించి జ్ఞాపికలు అందించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కూడా అతిథులను సన్మానించింది.


సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎస్ సాయి ప్రసాద్

సీఎంను కలిసిన కొత్త సీఎస్ సాయిప్రసాద్

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన జి.సాయిప్రసాద్ ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయం సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లిన ఆయన సీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎస్‌తో పాటు సీఎంకు ఎక్స్ అఫిషియో స్పెషల్ సీఎస్‌గా నియమితులైన విజయానంద్ కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు.

హైకోర్టు చెబితే మాకేంటి..?

- సీసీఎల్ఏ ఆదేశం పాటించాలా?
- కాకినాడ రెవెన్యూ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- ప్రైవేటు భూముల్లో ప్రహరీ గోడ గేటుకు వేసిన సీల్ తీసేయాలన్న హైకోర్టు
- సీసీఎల్ఏ ఆదేశాలూ బేఖాతరు..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కాకినాడలో వైసీపీకి చెందిన ఒక నోటిదురుసు నేత.. అక్కడి సూర్యారావుపేటలోని 20 ఎకరాల ప్రైవేటు భూమిపై కన్నేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో తన పలుకుబడి ఉపయోగించి జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న ఆర్ఎస్ఆర్ ఫెయిర్ అడంగల్‌ను తారుమారు చేయించారు. సర్వే నంబర్ 175-1, 175-3లో మార్పులు చేసి విలువైన భూమిని తన అనుచరుల పేరిట రాయించుకున్నారు. రైతులు, పట్టాదారుల ఫిర్యాదుతో 2023 నవంబరులో నాటి సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ ఈ ఉదంతంపై విచారణకు ఆదేశించారు. అప్పటి కాకినాడ జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి కలెక్టరేట్‌లోని ఆర్ఎస్ఆర్‌ను తారుమారు చేసి హక్కుదారుల పేర్లు మార్చేశారని నిగ్గు తేల్చారు. చర్యలకు సిఫారసు చేశారు. కానీ చర్యలేవీ లేవు. కూటమి ప్రభుత్వం వచ్చాక హక్కుదారులు మరోసారి దాని దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై 'సరిదిద్దలేని దందా' అనే శీర్షికన కాకినాడలో సదరు వైసీపీ నేత భూదోపిడీపై 'ఆంధ్రజ్యోతి' గతేడాది జూలై 2న కథనం ప్రచురించింది. అక్రమార్కులకు ఉన్నతాధికారుల అండదండాలు ఉన్నాయని పేర్కొంటూ 'భూచోడికి దాసోహం' శీర్షికన మరో వార్త ప్రచురించింది. ఈ పరిణామాలపై స్పందించిన రెవెన్యూ శాఖ.. ఫోర్జరీకి గురయిన రికార్డును సరిదిద్ది, అసలైన హక్కులదారులకే భూములు దక్కేలా చూడాలని జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించింది. కానీ.. వైసీపీ నేత 9ఎకరాల భూమిపై తన అనుచరుడితో పిటిషన్ ఇప్పించారు. తారుమారైన రికార్డులో అసలైన హక్కుదారు పేరు తొలగించి, ఈయన పేరుమీద భూమి రాశారు. ఈయన ఫిర్యాదుతో హక్కుదారును ఆ భూమిలోకి వెళ్లనివ్వకుండా జిల్లా అధికారులు ప్రహరీగోడ గేటుకు సీల్ వేయించారు. ఇది చట్టవిరుద్ధమని హక్కుదారు హైకోర్టును ఆశ్రయించారు. వెంటనే హక్కుదారుకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలంటూ కోర్టు గత ఏడాది డిసెంబరు 10న ఆదేశాలిచ్చింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులను సీసీఎల్ఏ ఆదేశించారు. మూడు నెలలైనా ఉత్తర్వులు అమలు చేయకుండా జిల్లా అధికారులు తీవ్రనిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో హక్కుదారులు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాకినాడ కలెక్టర్, రెవెన్యూ స్పెషల్ సీఎస్, సీసీఎల్ఏను కూడా ప్రతివాదులుగా చేర్చారు. హైకోర్టు నుంచి సీసీఎల్ఏకు మరోసారి నోటీసులు వచ్చాయి. దరిమిలా.. ఇప్పటికైనా సత్వర చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ జయలక్ష్మి కార్యాలయం కాకినాడ కలెక్టర్‌కు మెయిల్ కూడా పంపించింది. అయినా చర్యలు తీసుకోలేదని తేలడంతో సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. 'ఒకవైపు కోర్టు ధిక్కార కేసులు పెరిగిపోతున్నాయి. సీఎస్, సహా ఇతర ఉన్నతాధికారులను తమ ముందు వ్యక్తిగతంగా హాజరవ్వాలని హైకోర్టు ఆదేశాలిస్తోంది. జిల్లా, క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం, జవాబుదారీలేని చర్యలతో మేం నోటీసులు ఎదుర్కొంటున్నాం' అని సీనియర్ అధికారి వాపోయారు.

> ఆ ప్రైవేటు భూమిలో ప్రభుత్వం వేలు పెట్టడానికి వీల్లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. అందులోని ప్రహరీ గోడ గేటుకువేసిన సీల్ తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఆ ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కూడా ఉత్తర్వులిచ్చారు. అయినా రెవెన్యూ అధికారులు సీల్ తొలగించలేదు. ఇప్పటికీ ఓ వైసీపీ నేతకు దాసోహమంటున్నారు.

ఈ వేసవి మరింత 'హాట్'!

- మార్చి నుంచి మే వరకూ ఎండల మంటలు

(విశాఖపట్నం/అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఈసారి వేసవిలో ఎండలు 'మంట' లు రేపనున్నాయి! దేశంలోని చాలా ప్రాంతాలతో పాటు రాష్ట్రంలో ప్రస్తుత వేసవిలో సాధారణం కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థలు వెల్లడించాయి. మార్చి నుంచి మే మధ్య ఉత్తరాంధ్ర తప్ప రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. మార్చి నెలలో ఉత్తర, మధ్య కోస్తా వరకు సాధారణంగా, దక్షిణ కోస్తా, రాయలసీమలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువగా ఎండలు ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. దక్షిణాంధ్రలో సాధారణం కన్నా ఎక్కువ రోజుల పాటు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు రాయలసీమ, ఉత్తరాంధ్రలోని కొన్ని జిల్లాల్లో సాధారణం కన్నా ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందని సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు.

దేశంలో పరిస్థితి ఇదీ..

మార్చి ప్రారంభం నుంచి దేశంలోని పలు ప్రాంతాల్లో ఎండలు పెరగనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. గుజరాత్, మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాలు, కోస్తాంధ్రలో మధ్యనున్న ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్, మే నెలల్లో దక్షిణ భారతంలోని తమిళనాడు నుంచి మధ్య, తూర్పు భారతంలో బిహార్, దానికి ఆనుకుని తూర్పు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా, గుజరాత్, మహారాష్ట్రల్లోని పలు ప్రాంతాల్లో అనేక రోజులు వడగాడ్పులు కొనసాగనున్నాయి. మార్చి నుంచి మే వరకు ఉత్తర కోస్తాంధ్ర, దానికి ఆనుకుని తెలంగాణ, తూర్పు రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

బలహీనమవుతున్న లానినా

ఇదిలా ఉండగా ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్య రేఖకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో బలహీనమైన లానినా కొనసాగుతోంది. దీని ప్రభావంతో పసిఫిక్ మహాసముద్రంలో తూర్పు, మధ్య ప్రాంతంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. అయితే రానున్న రోజుల్లో లానినా బలహీనపడుతుందని అంతర్జాతీయ వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్, మే నెలలో పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు ఏర్పడుతాయని, దీంతో దేశంలో ఎండలు క్రమేపీ పెరుగుతాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వేసవిలో ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

మావోయిస్టులపై 'విష' తూటాల ప్రయోగం ?

- తీవ్రమైన నొప్పి.. వాంతులు.. భరించలేని దాహం!
- ఎన్‌కౌంటర్‌లో భయంకర అనుభవాలు
- సంచలనం సృష్టిస్తున్న మావోయిస్టు అగ్రనేత ఫినిక్స్ కథనం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు ఆపరేషన్లలో పాల్గొంటున్న భద్రతా బలగాలు విషపూరిత తూటాలు వాడుతున్నాయా?.. అంతర్జాతీయంగా నిషేధించిన రసాయన ఆయుధాలతో తలపడుతున్నాయా ?.. జీవ రసాయన పదార్థాల వాడకం అంతర్గతంగా జరుగుతోందా? అంటే అవుననే అంటున్నాయి మావోయిస్టు వర్గాలు. ఛత్తీస్‌గఢ్ గరియాబంద్ జిల్లా కుల్హాదీఘాట్ అడవుల్లో గతేడాది జరిగిన ఎన్‌కౌంటర్ నుంచి బయటపడిన ఓ మావోయిస్టు అగ్రనేత 'ఫినిక్స్' పేరిట రాసిన రిపోర్టు ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. భద్రతా బలగాలు ప్రయోగించిన షెల్ ముక్కలు తగిలిన వారు కేవలం గాయాలతోనే కాకుండా.. నొప్పి, మంట, భరించలేని బాధతో విలవిలలాడుతూ తీవ్రమైన దాహంతో వాంతులు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఆ కథనంలో పేర్కొనారు.

నరకం చూపించిన విష షెల్లింగ్ !

గరియాబంద్ అడవుల్లో గతేడాది మావోయుస్టులు, భద్రతా బలగాలకు మధ్య భీకరమైన ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టుల కదలికలపై పక్కా సమాచారంతో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ)తో పాటు ఒడిశా స్పెషల్ ఆపరేషన్ గ్రూపు(ఎస్‌ఓజీ), సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కోబ్రా బెటాలియన్లకు చెందిన 400మంది భద్రతా బలగాలు ఈ సంయుక్త ఆపరేషన్‌ను పర్యవేక్షించాయి. దాదాపు 48 గంటల పాటు జరిగిన ఎదురు కాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి సహా 16మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్ నుంచి బయటపడి ప్రాణాలు కాపాడుకున్న ఒక మావోయిస్టు నేత సంఘటనా స్థలంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను వివరిస్తూ పార్టీకి పంపిన రిపోర్టులో.. బలగాలు తమపై తీవ్రమైన షెల్లింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. షెల్స్ తగిలిన సహచర మావోయిస్టులు వారు తీవ్రమైన నొప్పి, భరించలేని మంటతో హృదయ విదారకంగా అరిచారని తెలిపారు. దానికి తోడు విపరీతమైన దాహం, వాంతులతో నరకయాతన అనుభవించారని రిపోర్టులో వెల్లడించారు. గతంలో లొంగిపోయిన మావోయిస్టు నేత జంపన్న ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ద్వారా వెలుగులోకి తీసుకుని రావడంతో దీనిపై చర్చ మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా రసాయన ఆయుధాల వినియోగాన్ని నిషేధిస్తూ కెమికల్ వెపన్ కన్వెన్షన్ (సీడబ్లూసీ) ఒప్పందంపై సంతకం చేసిన భారత్ కూడా.. ఇలాంటి విషపు పూత పూసిన షెల్స్ వాడుతున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.


వేట్లపాలెంలో పేలుడు జరిగిన ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న హోంమంత్రి అనిత, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పూర్తిగా నేలమట్టమైన షెడ్లు

కన్నీరు మున్నీరు

బాణసంచా ప్రమాద ఘటనలో 23కు చేరిన మృతులు

- కాకినాడ జీజీహెచ్‌లో మరో ఇద్దరి మృతి


బాధిత కుటుంబీకులకు చెక్కులు అందజేస్తున్న మంత్రులు అనిత, నారాయణ, సుభాష్, ఎంపీ సానా సతీశ్

కాకినాడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 23కు చేరింది. ఆదివారం మరో ఇద్దరు క్షతగాత్రులు మరణించారు. ప్రమాదం జరిగిన రోజు శనివారం 21 మంది మరణించగా, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దర్శిపాటి లోవరాజు(40), దర్శిపాటి రాజు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురు క్షతగాత్రుల పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. పేలుడు ఘటనలో చనిపోయిన 20 మంది మృతదేహాలకు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారుజామున పోస్టుమార్టం పూర్తయింది. మృతదేహాలను ఆయా కుటుంబాలకు అందించారు. అంత్యక్రియల ఖర్చుల కింద రూ.25 వేల సాయం అందించారు. మృతదేహాలను కుటుంబీకులు స్వగ్రామాలకు తరలించారు. ఈ సందర్భంగా విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. వేట్లపాలెం గ్రామానికి చెందిన ఆరు మృతదేహాలను ఒకేచోట ఖననం చేశారు. ఆ సమయంలో కుటుంబీకులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. కూలి పనికి వెళ్లి మృతదేహాలై తిరిగి వచ్చారంటూ విలపించారు. కాగా ప్రమాద స్థలాన్ని హోంమంత్రి అనిత ఆదివారం ఉదయం పరిశీలించారు. పేలుడు ఘటన జరిగిన ప్రదేశంలో పెద్దఎత్తున వైసీపీ అధినేత జగన్ ఫొటోలతో కూడిన కరపత్రాలు కాలిపోయి ఉండడాన్ని పరిశీలించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ఉన్న కరపత్రాలు బాణసంచా తయారీ కేంద్రంలో ఉండడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన వెనుక స్థానిక వైసీపీ ఎంపీపీ పాత్ర ఉందని ఆరోపణలు వస్తుండడంతో విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రానికి అంత మందుగుండు ముడిసరుకు ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై కూడా ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు. పేలుడు జరిగిన ప్రదేశంలో ఆదివారం ఉదయం క్లూస్ టీం బృందాలు పరిశీలించాయి. పేలుడు జరిగిన చోట మందుగుండు కాలిన ఆనవాళ్ల నమూనాలు సేకరించారు.

అనుమతి ఎనిమిది మందికే..

పేలుడు చోటు చేసుకున్న శ్రీసూర్య ఫైర్ వర్క్ కంపెనీకి రోజూవారీ 15 కిలోల బాణసంచా తయారీకే అనుమతి ఉంది. కానీ జాతర కోసం భారీగా బాణసంచా ఆర్డర్లు రావడంతో 800 కిలోలకుపైగా అక్కడ నిల్వ చేశారు. దీంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ఈ కంపెనీలో నిబంధనల ప్రకారం కేవలం 8 మంది కార్మికులతోనే పని చేయించుకోవడానికి అనుమతి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా 40 మందితో పనిచేయించినట్లు గుర్తించారు. ప్రమాదం తర్వాత వీరంతా తప్పించుకోవడానికి వీల్లేక మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యారు. ఇదే విషయాన్ని కార్మిక శాఖ మంత్రి సుభాష్ ధ్రువీకరించారు. 15 కిలోల బాణసంచా తయారీకి అనుమతి పొంది, కాసుల కక్కుర్తితో భారీగా నిల్వ చేయడంతోనే భారీ ప్రమాదం జరిగిందన్నారు. పేలుడు దుర్ఘటనను సీఎం చంద్రబాబు తీవ్రంగా పరిగణిస్తున్నారని, అధికారులను సస్పెండ్ చేశారని అన్నారు. బాణసంచా తయారీ కేంద్రం నిర్వాహకుల ఆస్తులు జప్తు చేస్తామని సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారని తెలిపారు.

బాణసంచా తయారీ సంస్థల ఎన్‌వోసీలు రద్దు చేస్తాం: అనిత

సామర్లకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ సంస్థల నిర్వహణకు ఇప్పటి వరకూ అధికారులు జారీ చేసిన ఎన్‌వోసీలను రద్దు చేస్తామని హోం మంత్రి అనిత ప్రకటించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మరో మంత్రి నారాయణతో కలిసి అనిత ఆదివారం వేట్లపాలెం వెళ్లారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలిని పరిశీలించారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు అనిత చెప్పారు. వైసీపీ ఎంపీపీ కెనాల్ రోడ్డులో నిర్వహించిన మరో బాణసంచా తయారీ సంస్థలో గతంలో విస్ఫోటం జరిగి ఐదుగురు వ్యక్తులు మృతి చెందారన్నారు. కారకులపై కేసులు నమోదు కావడం, అరెస్టులు చేయడం వంటి అంశాలను దర్యాప్తు బృందం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. తాజాగా ఎన్‌వోసీలు ఇచ్చేవరకూ బాణసంచా తయారీ పనులను నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. కాగా కాకినాడ జిల్లాలో ఎన్‌వోసీలు పొందిన అన్ని తయారీ కేంద్రాలను తక్షణం తాత్కాలికంగా మూసివేయాలంటూ జిల్లా ఫైర్ ఆఫీసర్ పీవీఎస్ రాజేశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

యజమానులు అరెస్ట్

బాణసంచా తయారీ కేంద్రం యజమాని అడబాల అర్జున్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఆయన సోదరుడు అడబాల వీరబాబు పరారీలో ఉండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరిపై సామర్లకోట పోలీసులు ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ 1884 కింద క్రైం నంబరు 114/2026తో కేసు నమోదు చేశారు. సెక్షన్లు 223,288,125(ఏ), 125 (బీ), 105 కింద కేసులు నమోదు చేశారు. కాగా సదరు యజమాని తక్కువ వేతనాలతో కూలీలను నియమించడం, నిబంధనలను అతిక్రమించి బాణసంచా విక్రయాలు చేసి గడచిన మూడేళ్లలో రూ.15 కోట్ల వరకు సంపాదించాడు.

రాత్రికి రాత్రే చెక్కులు సిద్ధం

మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున సీఎం చంద్రబాబు ఆర్థికసాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. శనివారం రాత్రి 9గంటల సమయంలో సీఎం చంద్రబాబు సాయం ప్రకటించగా, ఆదివారం ఉదయం 10 గంటలకే అధికారులు మృతుల కుటుంబాలకు చెక్కులు సిద్ధం చేశారు. మంత్రులు అనిత, నారాయణ, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు సానా సతీశ్, ఉదయ శ్రీనివాస్, హరీశ్ మాధుర్ మధ్యాహ్నం 12 గంటల లోపే బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందించారు.

14 మంది ప్రాణాలు కాపాడిన 'పింఛన్'

- 28వ తేదీన వేట్లపాలెం బాణసంచా కేంద్రానికి పనులకు వెళ్లకుండా ఆగిపోయిన కూలీలు
- అదే రోజు బాణసంచా కేంద్రంలో ప్రమాదం

సామర్లకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాద ఘటన నుంచి 14 మంది కూలీలు 'పింఛన్' కారణంగా ప్రాణాలు కాపాడుకున్నారు. ఇతర కూలీల మాదిరే వీరు కూడా శనివారం బాణసంచా తయారీ కేంద్రానికి పనికి వెళ్లాల్సివుంది. అయితే ఆ రోజు సామాజిక పింఛన్ల పంపిణీ చేయడంతో లబ్ధిదారులైన ఈ 14 మంది పనికి వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్న తెలిసిందే. మార్చి 1వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో ఫిబ్రవరి 28వ తేదీ(శనివారం)నే పింఛన్లు అందజేశారు. వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తున్నవారిలో 14 మంది కూలీలు పింఛన్లు తీసుకోవడం కోసం శనివారం పనికి వెళ్లలేదు. పింఛన్లు తీసుకుని ఇళ్ల దగ్గరే ఉండిపోయారు. అదేరోజు బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన విస్ఫోటంలో 23 మంది కూలీలు మరణించారు. ఆ రోజు కూలి పనులకు ఈ 14 మంది వెళ్లకపోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

విశాఖలో ఇన్ఫోసిస్ శాశ్వత క్యాంపస్

- ఎండాడ కొండపై 20 ఎకరాలు గుర్తింపు

విశాఖపట్నం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ విశాఖ నగరంలోని ఎండాడ కొండపై శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి ఆ కంపెనీ ప్రతినిధులు, జిల్లా అధికారులు కలిసి కొండపై భూమిని పరిశీలించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఎండాడ కొండవాలులో దిశా పోలీస్‌స్టేషన్, వీఎంఆర్డీఏ కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఇదే కొండపై పడమర భాగంలో కాపు కల్యాణ మండపం, ప్రైవేటు ఆస్పత్రికి కొంత స్థలం కేటాయించారు. ఈ కొండపైనే ఇన్ఫోసిస్ కోసం 20 ఎకరాలను జిల్లా అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు ఇన్ఫోసిస్ ప్రతినిధులకు సూచనప్రాయంగా వెల్లడించారు. అయితే ఇన్ఫోసిస్‌కు భూమి కేటాయింపుపై ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది. ఇంకా మౌలిక సదుపాయాలు, రాయితీలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే 20 ఎకరాలను నేరుగా కంపెనీకి బదలాయిస్తారా..? లేకపోతే ఏపీఐఐసీ కేటాయించి, మౌలిక వసతులు కల్పించిన తర్వాత బదలాయిస్తారా..? అన్నది ఖరారు కాలేదు. కాగా.. ప్రస్తుతం ఇన్ఫోసిస్ మధురవాడ ఐటీ హిల్స్‌లోని ప్రైవేటు భవనంలో కార్యకలాపాలు సాగిస్తోంది.

ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లు రూ.3,061 కోట్లు

- గత ఏడాది కంటే 5.45% ఎక్కువ: చీఫ్ కమిషనర్

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఫిబ్రవరిలో నికర జీఎస్టీ వసూళ్లు రూ.3,061 కోట్లకు చేరుకున్నట్లు రాష్ట్ర పన్నుల విభాగం చీఫ్ కమిషనర్ బాబు.ఏ వెల్లడించారు. గత ఏడాది ఫిబ్రవరిలో వసూలైన నికర జీఎస్టీ కంటే ఇది 5.45 శాతం అధికమని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 11 నెలల పాటు ఏపీలో నికర జీఎస్టీ వసూళ్లు 5.86% పెరుగగా.. కర్ణాటకలో 5.7 %, తమిళనాడు-3.1 %, తెలంగాణ-4.57 శాతం, కేరళ-2.95 శాతం ఎక్కువగా వసూలయ్యాయి. ఒడిసాలో మాత్రం 8.18 % తగ్గాయి. కాగా.. ఈ ఫిబ్రవరిలో ఏపీలో స్థూల జీఎస్టీ రూ.3,562 కోట్లు వసూలైంది.

ఉగాది ఉత్సవాల్లో మల్లన్న స్పర్శ దర్శనాలు రద్దు

శ్రీశైలం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉగాది ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు శ్రీశైల మల్లన్న స్పర్శ దర్శనాలు పూర్తిగా రద్దు చేసి, అందరికీ అలంకార దర్శనం మాత్రమే అందుబాటులో ఉంచుతున్నట్టు పాలకమండలి చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, ఈఓ శ్రీనివాసరావు సంయుక్తంగా వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన 63 భక్త బృందాలు, స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులతో ఆదివారం పరిపాల నా భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి 6 నుంచి 15వ తేదీ వరకు రోజుకు నాలుగు విడతలుగా ప్రతి స్లాటుకు 1,500 టిక్కెట్లు కరెంట్ బుకింగ్, ఆన్‌లైన్‌లో 500 టిక్కెట్లు భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు.



అది మార్ఫింగ్ వీడియో

30 ఏళ్లుగా ఆ కుటుంబంతో స్నేహం ఉంది... నన్ను అప్రతిష్ఠపాలు చేసేందుకు భూమన కుట్ర

- అక్రమాలను వెలికి తీస్తున్నందుకే దుష్ప్రచారం
- కుంభకోణాలు బయటకు తీయవద్దని నన్ను కలిసేందుకు కరుణాకర్‌రెడ్డి ప్రయత్నించారు
- ఆయన దుర్మార్గాలు బయటకు వస్తాయనే నేను రాజీనామా చేయాలంటున్నారు
- ప్రతి దాంట్లో అవినీతి చేశారు: టీటీడీ చైర్మన్

తిరుపతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తనపై వీడియోను మార్ఫింగ్ చేశారని, దుష్ప్రచారం చేసి అప్రతిష్ఠపాలు చేసేందుకు భూమన కరుణాకర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తనకు సంబంధించిన ఒక వీడియోను వైరల్ కావడం, దీనిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపణలు చేయడంపై బీఆర్ నాయుడు ఆదివారం తిరుపతిలో స్పందించారు. 20 ఏళ్ల కిందటి ఫొటోలూ మిక్స్ చేసి సోషల్ మీడియాలో పెట్టారని, ఆ మహిళ కుటుంబంతో 30 ఏళ్లుగా పరిచయం ఉందని స్పష్టం చేశారు. ఆ వీడియోలో అసభ్యకరమైనది, అశ్లీలత ఏమీ లేదని, కొన్నిచోట్ల మార్ఫింగ్ చేశారని వెల్లడించారు. తనపై బురదజల్లితే భయపడేవాడిని కానని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లి వీళ్ల సంగతి తేలుస్తానని హెచ్చరించారు. "శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చేప్పుడు సతీసమేతంగా ఎందుకు రావట్లేదని జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించాను. గతంలో రాజశేఖరరెడ్డి రాలేదు. తర్వాత జగన్ రాలేదు. భారతి పేరు ఎత్తానని వాళ్లకు కోపం. రోజుకో కుంభకోణం బయటకు వస్తోందనే ఉద్దేశంతో నాపై బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారు. నన్ను కలవాలని, నాతో మాట్లాడాలని, కుంభకోణాలు బయటకు తీయవద్దని చాలా విధాలుగా కరుణాకర్‌రెడ్డి ప్రయత్నించాడు. చంద్రబాబు నాకు పదవి ఇచ్చారు. ఆయన చెబితే ఒక్క నిమిషంలో రాజీనామా చేస్తాను. భూమన చేసిన దుర్మార్గాలు ఒకటి, రెండు కాదు.. వంద బయటకు వస్తున్నాయి. అవన్నీ బయటకు వస్తే తిరుపతి ప్రజలు ఆయన్ను తరిమితరిమి కొడతారు. ఐదేళ్లలో వేల టికెట్లు అమ్ముకున్నారనే రికార్డులు నా వద్ద ఉన్నాయి. నేనూ మీడియాలో ఉన్నాను. నీకు (భూమన), సుబ్బారెడ్డికి చుక్కలు చూపిస్తాను. కరుణాకర్‌రెడ్డి.. నువ్వు మద్రాసుకు వెళ్లి ఏమేం చేశావో నాకు తెలుసు. వైవీ సుబ్బారెడ్డి ఏం చేశాడో నాకు తెలుసు. కరుణాకర్‌రెడ్డి హయాంలో భగవద్గీతను ఐదు భాషల్లో రూ.50 కోట్లు ఖర్చు చేసి కోటి పుస్తకాలు ప్రచురించారు. 32 లక్షల పుస్తకాలు గోడౌన్‌లో పడి ఉన్నాయి. అందులో ఏమీ లేదు. ఈ కుంభకోణంలో కరుణాకర్‌రెడ్డి కొడుకు ఉన్నాడు. ఏ ఫైల్ తీసుకున్నా అన్నీ దొంగ లెక్కలే. ఏకసభ్య కమిషన్ నుంచి దృష్టి మరల్చేందుకే నాపై దుష్ప్రచారం మొదలుపెట్టారు. నేను ఈ రోజు కొత్తగా కరుణాకర్‌రెడ్డి గురించి ఆరోపణలు చేయాల్సిన అవసరం లేదు. కరుణాకర్‌రెడ్డి దొంగ, జగన్ గజదొంగ అని ప్రపంచమంతా తెలుసు. నేను మొదటి బోర్డు సమావేశంలోనే హిందూయేతరులు వెళ్లిపోవాలన్నందుకే నాపై దాడి మొదలుపెట్టారు" అని బీఆర్ నాయుడు అన్నారు.

బీఆర్ నాయుడుతో రాజీనామా చేయించాలి

- టీటీడీ చైర్మన్ పదవికి అనర్హుడు: భూమన

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెంకటేశ్వరస్వామి మీద దైవభక్తి నిజమైతే అశ్లీల వీడియోతో దొరికిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును తక్షణమే రాజీనామా చేయించాలని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పవిత్రమైన టీటీడీ చైర్మన్ పదవికి అనర్హుడని అన్నారు. ఆదివారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సానుకూల మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పవనానంద స్వాములూ అని సంబోధిస్తూ.. బీఆర్‌ను ఎలా సమర్థిస్తారని సమాజం ప్రశ్నిస్తోందన్నారు. బీఆర్ నాయుడును ముఖ్యమంత్రి ఎలా క్షమిస్తారని ప్రశ్నించారు. బీఆర్ అనైతిక చర్యల గురించి వైసీపీ మొదటి నుంచి హెచ్చరిస్తోందని అన్నారు. ఏడాదిన్నరగా ఆధారాలు చూపిస్తున్నా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. డీప్‌ఫేక్ వీడియోలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారని, బీఆర్‌ను కాపాడాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ తప్పునకు భవిష్యత్తులో చంద్రబాబే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దేవుడికి సేవచేసే అవకాశం వస్తే ఆలయంలో బీఆర్ నాయుడు రాజకీయాలు చేశారని ఆరోపించారు. వైఎస్ జగన్, ఆయన సతీమణిపై వేసిన నిందకు బీఆర్ నాయుడుకు దేవుడు వేసిన శిక్ష ఇది అని భూమన అన్నారు.

చిట్టీల పేరుతో రూ.4కోట్లకు కుచ్చుటోపీ

- సభ్యులను నిలువునా ముంచి నిర్వాహకుడి పరార్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- విజయవాడలో ఘటన

విజయవాడ/చిట్టినగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అవసరాలకు అండగా ఉంటుందని చిట్టీలు వేసిన వారిని నిర్వాహకుడు నిలువునా ముంచేశాడు. రూ.4 కోట్లు వసూలు చేసి కుటుంబంతో సహా పరారయ్యాడు. ఈ ఘటన విజయవాడలోని చిట్టినగర్‌లో ఆదివారం వెలుగులోకి వచ్చింది. తుమ్మల ముత్యాలరావు వీధిలో నివాసం ఉంటున్న ఎం.శ్రీనివాసరావు 20 ఏళ్లుగా చిట్టీలు నిర్వహిస్తున్నాడు. అతడు ఇక్కడే పుట్టి పెరగడంతో స్థానికులందరికీ సుపరిచితుడు. చిట్టీల వ్యాపారం మొదలుపెట్టాక స్థానికంగా ఉండే కూలీలు, కార్మికులను ఇందులో సభ్యులుగా చేర్పించాడు. తొలుత రూ.లక్ష నుంచి వేయడం ప్రారంభించాడు. తర్వాత వాటిని క్రమంగా పెంచుకుంటూ రూ.5 లక్షలు, రూ.10 లక్షల వరకు నిర్వహించాడు. కాలపరిమితి పూర్తయ్యాక చెల్లింపులు సక్రమంగా చెల్లించాడు. మరోపక్క వడ్డీలకు అప్పులు ఇస్తుండేవాడు. కేదారేశ్వరపేటలోని లోటస్ ల్యాండ్ మార్క్‌లో ఖరీదైన ఫ్లాట్ కొని, రెండేళ్ల క్రితం కుటుంబాన్ని అక్కడికి మార్చేశాడు. అప్పటి నుంచి చిట్టినగర్‌లో ఉంటున్న ఇంటికి వచ్చి చిట్టీ పాటలు నిర్వహించేవాడు. కాగా, చిట్టీలు పాడుకున్న వారికి తొలుత సక్రమంగా చెల్లింపులు చేసిన శ్రీనివాసరావు ఏడాదిగా వాయిదాలు వేయడం మొదలుపెట్టాడు. నెలల తరబడి ఇంటి చుట్టూ తిప్పించుకున్నాడు. ఎంతకీ డబ్బు ఇవ్వకపోవడంతో చిట్టీలు వేసిన వారంతా లోటస్‌లోని ఇంటికి వెళ్లి చూశారు. ఇంటిని ఖాళీ చేసి రెండు రోజుల క్రితం శ్రీనివాసరావు కుటుంబం ఊరు దాటినట్టు స్థానికులు తెలిపారు. దీంతో బాధితులు కొత్తపేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ప్రాథమిక విద్యే జీవితానికి పునాది

- బాలమేళాలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్


జస్టిస్ బట్టు దేవానంద్

విజయవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ప్రాథమిక విద్య ఎంతో ముఖ్యమైందని, వ్యక్తుల ఎదుగుదలకు అదే పునాదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థితికి చేరుకున్నాక సమాజానికి తమ వంతు సేవ చేయాలన్నారు. సేవాభారతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో బాలమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ.. 1990 నుంచి 36 ఏళ్లుగా ఒక సేవాసంస్థ నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. విద్యకు ఆర్థికస్థితి అడ్డు కాదని అబ్దుల్ కలాం, నరేంద్రమోదీ వంటివారు చాటి చెప్పారని, ఇరువురూ కిందిస్థాయి నుంచి వచ్చి దేశ ప్రతిష్ఠను ప్రపంచానికి ఎలా చాటిచెప్పారో గమనించాలని సూచించారు. నేటితరం సినిమాల్లో గురువులను తక్కువ చేసి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను తమ కెరీర్ అభివృద్ధికి, మంచికి ఉపయోగించుకోవాలని సూచించారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ దేశంలో 50-60 శాతం మంది అసంఘటిత కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. అలాంటి వారి పిల్లలకు రోజూ విద్యాబోధన చేయడం గొప్ప విషయమంటూ సేవాభారతి సేవలను కొనియాడారు.

పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్చండి

- తల్లిదండ్రులకు యూటీఎఫ్ పిలుపు


అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన పౌరులను తయారుచేసే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) తల్లిదండ్రులకు కోరింది. యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరిగిన యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దీనిపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. జయాపజయాలను ఒకేలా చూసే దృఢ సంకల్పాన్ని నేర్పించేది ప్రభుత్వ పాఠశాలలేనన్నారు.

తాను మరణిస్తూ.. ఐదుగురికి కొత్త జీవితం

- రోడ్డు ప్రమాదంతో యువకుడి బ్రెయిన్ డెడ్
- అవయవదానంతో ఐదుగురి జీవితాల్లో వెలుగులు


నల్లపనేని చైతన్య

గుంటూరు మెడికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఆ యువకుడు. అవయవ దానంతో ఇతరుల రూపంలో మరోసారి జీవించాడు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నల్లపనేని వెంకట శివ, ఆదిలక్ష్మి దంపతులకు చైతన్య(25), మానస కుమార్ ఇద్దరు కుమారులు. చైతన్య స్థానికంగా ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 27న అతడు తాతపూడి గ్రామం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో చేర్పించారు. వైద్యనిపుణుల బృందం తమ వంతు ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. చైతన్య బ్రెయిన్ డెడ్ అయినట్టు శనివారం వైద్యులు ప్రకటించారు. సమాచారం అందుకున్న జీవన్‌దాన్ ట్రస్ట్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేషన్ బృందం బాధిత కుటుంబ సభ్యులను కలసి కౌన్సెలింగ్ చేశారు. దీంతో తండ్రి వెంకట శివ, తల్లి ఆదిలక్ష్మి స్పందించి ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు కుమారుడి అవయవాలను దానం చేసేందుకు ఆమోదం తెలిపారు. వైద్య బృందం చైతన్య పార్థివ దేహం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, రెండు నేత్రాలను సేకరించారు. కాలేయం, ఒక మూత్రపిండం గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు, మరొక మూత్రపిండాన్ని విజయవాడలోని అమెరికన్ కిడ్నీ హాస్పిటల్‌కు, రెండు కార్నియాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు పంపినట్టు జీవన్‌దాన్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చైతన్య తల్లిదండ్రులు మంచి నిర్ణయం తీసుకొని ఐదుగురు జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు కృషి చేశారని అభినందించారు.



ఏది ఉత్తమ రచన?

ఒక రచన ఉత్తమమైనది లేదా ప్రశస్తమైనది అనిపించుకోవాలంటే అందులో సాహితీ విలువలు, ఈస్తటిక్ ప్రమాణం ఉన్నత స్థాయిలో వుండాలని మనం నిర్ద్వందంగా అంగీకరిస్తాం. ఈ విలువలు, ప్రమాణాలను ఆబ్జెక్టివ్ కోణంలోంచి అంచనా వేయడానికి రచనని ఎలా పరిశీలించాలి అన్నప్పుడు, ముఖ్యంగా ఏడు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రసిద్ధ విమర్శకులన్నారు. అవి: 1) కళాత్మకత. పాఠకుని భావోద్వేగ అనుభవాన్ని గాఢతరం చేసే విధంగా రచయిత/ కవి భాషను వినూత్నంగా లేక కవితాత్మకంగా వాడాడా – అంటే, ఇమేజరీ, మెటాఫర్లు, రిథం వంటివి వినియోగించాడా? 2) శైలి. భావాల వ్యక్తీకరణలో, రచనా పద్ధతిలో వినియోగించిన డిక్షన్ విలక్షణంగా ఉన్నదా? శక్తివంతమైన శైలి రచయిత ప్రత్యేక 'వాయిస్'ని సూచిస్తుంది, రచనని గుర్తుండిపోయేలా చేస్తుంది. 3) మేధోపరమైన విలువ. జీవిత మౌలిక సత్యాల గురించి రచన పాఠకునిలో ఆలోచనలను రేకెత్తిస్తున్నదా? పాత భావాలను సవాలు చేసి, చుట్టూ సమాజం పట్ల, మానవ స్వభావం పట్ల ఒక కొత్త దృక్పథాన్ని కల్పించేదిగా రచన వుండాలి. 4) సూచ్యార్థ గాఢత. వాచ్యార్థాన్ని మించి లోతైన అర్థాలు స్ఫురింప జేసే విధంగా రచన ఉన్నదా? నిర్దిష్ట అనుభూతులను రేకెత్తించి, జ్ఞాపకాలను తట్టి లేపి, పాఠకుడిని ఒక మూడ్‌లోకి తీసుకెళ్లే విధంగా ప్రతీకలు, మెటాఫర్లు ఉన్న భాష ఈస్తెటిక్‌గా గొప్ప ప్రభావాన్ని కలగజేస్తుంది. 5) విశ్వజనీనత. గేథే నియమం 'The particular is ever subordinate to the universal, and the universal must ever adapt to the particular' ప్రకారం రచన ఎప్పటికీ ప్రాసంగికంగా నిలిచేదేనా, సార్వకాలిక మానవ సమస్యలకు (ప్రేమ, మరణం, సంఘర్షణ... మొదలైనవాటికి) సంబంధించినదేనా? వస్తువు వివిధ కాలాలకు, సంస్కృతులకు, జాతులకు, జెండర్ లకు వర్తించేదిగా ఉన్నదా? 6) ప్రేరణాత్మక విలువ. పాఠకుడి ఉన్నతీకరణకు, పరివర్తనకు దోహదపడగల నైతిక, ఆధ్యాత్మిక, లేదా మనోవైజ్ఞానిక లోచూపు రచనలో వున్నదా? స్ఫూర్తివంతమైన రచన గొప్ప ఆలోచనలు రేకెత్తించి జీవిత లక్ష్యానికి స్పష్టతనిస్తుంది. 7) పునఃపఠనీయత. మళ్ళీ మళ్ళీ చదివించే గుణం రచనలో వుందా? వస్తురూపాల విలక్షణత, సాహిత్యవిలువల కారణంగా కొన్ని రచనలు దశాబ్దాలు గడిచినా గుర్తుండిపోతాయి, మళ్ళా చదవాలనిపిస్తాయి.

కవిత్వంలో 'ఆబ్స్క్యూరిటీ' ఉండొచ్చునని చెబుతూ తిలక్ ఇలా అన్నాడు: "పాఠకుడికి నీ అనుభూతి ఆకారం అందాలి, హత్తుకోవాలి. అది ట్రాన్స్‌పరెంట్ చీకటై వుండాలి, నిన్ను పలకరించాలి. కవిత కొత్త అనుభవాల కాంతి పేటికను తెరవాలి, కదిలించాలి." ఇది రష్యన్ ఫార్మలిస్ట్ విక్టర్ ష్క్లోవ్‌స్కీ చెప్పిన 'అపరిచితీకరణ'కు (defamiliarization) మరో నిర్వచనం. కె. శివారెడ్డి 'ట్రాఫిక్' అనే కవితలో, బయటి ట్రాఫిక్‌ను కవి చూస్తోన్న తీరును "...ఇరానీ హోటల్ నుంచి/ కదలని నీటిమట్టం ట్రాఫిక్ మీద/ చచ్చిన పాము మీద రాళ్ళు విసిరే పిల్లాడిలా/ చూపుల ముక్కల్ని విసురుతూ" అని వివరిస్తారు. ఎన్. గోపి 'సెల్ఫ్ పిటీ' కవితలో, చేదుజ్ఞాపకాలను మరిచిపోలేనితనాన్ని "చిన్నతనంలో/ సామాజిక సంక్లిష్టతలో తడిసిన రెక్కలు/ ఇప్పటికీ ఆర్ద్రంగానే వున్నాయి" అని వ్యక్తీకరిస్తారు. మరాఠీ–ఆంగ్లకవి అరుణ్ కొలాట్కర్ దీర్ఘ కవిత 'The Boat Ride' నిండా ఒక హిప్నాటిక్ నిశ్చలత పరచుకొని ఉంటుంది; విరామచిహ్నాలు లేని ఈ పద్యం ఊహ, వాస్తవికత కలగలసిపోయిన, స్థలకాలాలకు సంబంధించి సాధారణ భావనలు పని చేయడం ఆగిపోయిన, ఒక అధివాస్తవిక ప్రపంచాన్ని మన కళ్ళ ముందు ఉంచుతుంది. ఈయనదే మరో కవిత 'Jejuri' లోని ఒక ఖండిక 'The Blue Horse'లో వినసొంపుగా లేని ఒక బిచ్చగత్తె బొంగురు గాత్రం గురించి ఇలా చెబుతాడు: "The toothless singer/ opens her mouth./ Shorts the circuits/ in her haywire throat./ A shower of sparks/ flies off her half-burnt tongue." (పళ్ళు లేని పాటగత్తె/ నోరు తెరుస్తుంది/ తన గడ్డివాము గొంతుకలో/ షార్ట్ సర్క్యూట్ అయి/ నిప్పురవ్వల జల్లు ఒకటి/ ఆమె సగం కాలిన నాలుక మీదుగా ఎగిరివస్తుంది.) జర్మన్ కవి పాల్ సెలాన్ 'Fugue of Death' కవితలో హోలోకాస్ట్ బాధితులు అనుభవించిన క్రూరహింసను, అమానుష దురంతాలను వివరించే క్రమంలో పలు ఆక్సిమోరానిక్ మెటాఫర్లు, ప్రతీకలు వాడతాడు. కొన్ని పాదాలను తెలుగులో ఇలా అనువదించవచ్చు: "ఉదయపు నల్లని పాలను మేము తాగుతాం, సాయంత్రం కూడా/ చలిగాలుల్లో ఒక గొయ్యి తవ్వుతాం, అందులో ఒకడు ఏ అచ్చాదనా లేకుండా పడి ఉంటాడు/ .../ ఆ ఇంటిలో ఒక మనిషి ఉంటాడు, అతడు పాములతో ఆడతాడు...".

ఒక కోవకి చెందిన కథలు మానవ సంబంధాలను, ప్రత్యేకించి స్త్రీ పురుష సంబంధాలను, మనస్తాత్విక కోణంలో ఆవిష్కరించి, పాఠకుడికి మేధాపరమైన పని కల్పిస్తాయి. 'గాలివాన', 'పడవప్రయాణం' (పాలగుమ్మి పద్మరాజు), 'వేలుపిళ్ళై' (సి. రామచంద్రరావు), 'మధుర మీనాక్షి' (ఆర్ఎస్ సుదర్శనం)... తదితర తెలుగు కథలు ఇలాంటివే. కథావస్తువు కొట్టొచ్చినట్టుగా కనపడక కథలోనే సంలీనమైన శిల్పానికి మంచి ఉదాహరణ 'చెడిపోయిన మనిషి' (కొడవటిగంటి కుటుంబరావు). ఈ కథ తరాన్ని బట్టి ఆలోచనలను మార్చుకోవాల్సిన ఆవశ్యకతను చెప్తుంది. 'యజ్ఞం', 'ఫౌల్ ఫౌల్', 'చీకటి', 'మనిషి లోపలి విధ్వంసం', 'పిపీలికం'... వంటి కథలు మరో రకం వాస్తవికతను, వైరుధ్యాలను కళ్ళ ముందు నిలబెట్టి మనల్ని అశాంతికి గురి చేస్తాయి. అమెరికన్ రచయితలలో రేమండ్ కార్వర్ మినిమలిస్ట్ శైలికి ప్రసిద్ధుడు. నిజమైన అంధత్వం కళ్ళు లేకపోవడం కాదు, మనుషులతో కనెక్ట్ కాలేక, సహానుభూతి చెందక, ఈర్ష్యాసూయలతో ముడుచుకుపోవడమే అనే అంతర్లీన సందేశం ఉన్న ఆయన కథ 'Cathedral' మూడు పాత్రల చుట్టూ నడుస్తుంది. అంధుడైన అతిథి సాయంతో కాథేడ్రల్ బొమ్మ గీసిన కథకుడు, "మనుషులు లేకుండా కాథేడ్రల్ ఎలా పూర్తవుతుంది" అన్న అతిథి ప్రశ్నతో తన తప్పు తెలుసుకుంటాడు. రిచర్డ్ కానెల్ కథ 'The Most Dangerous Game'లో జార్ వంశీకుడైన జెనరల్ జెరాఫ్, తనకు జంతువుల్ని కాదు– మనుషుల్ని వేటాడి చంపడమే నిజమైన సరదా అని తన స్థావరానికి దారి తప్పి వచ్చిన వృత్తి వేటగాడికి చెప్పి, రెచ్చగొట్టి, మరోమార్గం లేకుండా చేసి, అతణ్ణి వేటజంతువు లాగా అడవిలో పరుగు పెట్టిస్తాడు. ఉత్కంఠ భరితమైన ప్లాట్‌తో సాగిన ఈ కథ చదివాక – సాటి మనుషులతో సంబంధం మరిచిపోయిన వ్యక్తిలో ఇంతటి రాక్షస ప్రవృత్తి గూడు కట్టుకొని ఉంటుందా అని ఆశ్చర్యపోతాం. వియత్నాం యుద్ధ సమయంలో ఒక అమెరికన్ ప్లాటూన్ లోని సైనికుల ప్రవర్తన, వారి అస్థిర మనస్తాత్విక వైఖరిని చిత్రించిన టిమ్ ఒబ్రియన్ కథ 'The Things They Carried'లో సైనికులు మోసుకెళ్ళే ఆయుధ, తిండి సామాగ్రితో పాటు, హింస, మరణాల పట్ల వారి మనస్సుల లోని బాధ; దయకు, నైతికతకు, మానవత్వానికి చోటులేని యుద్ధచర్యల పట్ల అపరాధ భావన మనకు సూచ్యంగా తెలియవస్తాయి.

ఏ భాషలోనైనా రాజకీయ, ఆర్థిక మార్పులు ప్రేరేపించిన సామాజిక ఉద్యమాలను ఇతివృత్తంగా తీసుకుని సంక్షుభిత కాలాలనాటి జనజీవనాన్ని చిత్రించిన నవలలు ఉత్తమమైనవిగా నిలబడ్డాయి. ఎందుకంటే చారిత్రిక సంధి దశల కల్లోల పరిస్థితులు మనుషుల భావోద్వేగాల సమస్తాన్ని బహిర్గత పరుస్తాయి. సమర్థుడైన రచయిత వాటి నుంచి తన నవల కాన్వాసుకి కావాల్సిన దినుసులు అందుకుంటాడు. తెలుగులో 'మాలపల్లి' (ఉన్నవ లక్ష్మీనారాయణ) నుంచి నేటి వరకు వచ్చిన వేలాది నవలల్లో సాహితీవిలువల కోణంలో చూసినప్పుడు నిలబడేవి బహుశ 30–40 ఉంటాయి. నైజాం పాలన నాటి ఫ్యూడల్ వ్యవస్థలోని తెలంగాణ జన జీవితాన్ని వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి', దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు' నవలలు చిత్రించాయి. సాయుధ పోరాటం తర్వాతి తెలంగాణ చారిత్రిక, సామాజిక పరిణామాలను అంపశయ్య నవీన్ 'కాలరేఖలు' నవల చిత్రించింది. తెలుగు నాట స్వాతంత్ర్యోద్యమ ప్రభావాన్ని, కమ్యూనిస్ట్ భావజాల విస్తరణను మహీధర రామమోహనరావు 'కొల్లాయి గట్టితేనేమి', 'రథచక్రాలు' నవలలు; స్వాతంత్ర్యపూర్వ, స్వాతంత్ర్యానంతర కాలాల్లో తెలుగు వారి జీవితాన్ని, ఆలోచనా ధోరణిని మూడుతరాలకు చెందిన పలు పాత్రల దృక్కోణంలో ఉప్పల లక్ష్మణరావు 'అతడు–ఆమె' నవల చిత్రించాయి.

కథ, కవిత్వం, నవల, నాటకం... ఏ ప్రక్రియ ఐనా కావొచ్చు– పాఠకుడిని భావోద్వేగపరంగా, మేధోపరంగా కదిలించి, జీవితం గురించి, మానవ అస్తిత్వం గురించి అతని అవగాహనను విస్తారం చేయగల గుణం ఆ రచనకున్న 'సాహితీ విలువ'.

కొన్ని ప్రత్యేకతల కారణంగా ఆల్ టైమ్ క్లాసిక్స్ అనదగ్గ నవలలు ప్రపంచ సాహిత్యంలో చాలా వున్నాయి. 'Les Miserables' (విక్టర్ హ్యూగో) 19వ శతాబ్దపు పూర్వార్థ భాగంలో మొదటి లూయి ఫిలిప్ పాలనలో ఫ్రాన్స్ పేదవర్గాల జీవితాన్నీ, జూన్ 1832 రాచరిక వ్యతిరేక తిరుగుబాటు ఘటనలను విపులంగా చిత్రిస్తుంది. ఈ బృహత్ నవలలో పూర్వాశ్రమంలో పరిస్థితుల ప్రభావంతో దొంగ అయిన ముఖ్యపాత్ర జీన్ వాల్జీన్, అనేక పరిణామాల అనంతరం మంచి మనిషిగా మారి అందరి మనస్సుల్లో త్యాగమూర్తిగా నిలుస్తాడు. లోకంలోని మంచీ చెడులను, ప్రేమ పగలను, రాగద్వేషాలను ప్రతిబింబించిన ఈ నవలలోని పాత్రలు సహజంగా గోచరిస్తాయి. అక్టోబర్ విప్లవం, ప్రొవిన్షియల్ ప్రభుత్వం, అంతర్యుద్ధం నేపథ్యంలో కల్లోలభరిత సామాజిక, రాజకీయ పరిస్థితులు వ్యక్తుల ప్రమేయం లేకుండానే వాళ్ళ జీవితాలను చిందరవందర చేసినప్పుడు– బతుకు మీద ప్రేమ ఉన్న వ్యక్తులు వైయక్తిక, సామాజిక విలువల నడుమ సమన్వయం సాధించాల్సిన ఆవశ్యకతను రొమాంటిక్‌గా కాకుండా వాస్తవికంగా విడమర్చి చెప్పిన రష్యన్ నవల 'Dr. Zhivago' (బోరిస్ పాస్టర్నాక్). ఈ నవల అనేక ఆరాటాల, పోరాటాల మేళవింపుగా సాగి ఆకట్టుకుంటుంది. ఆరు తరాల ఒక కుటుంబ గాథని చెప్పే క్రమంలో కొలంబియా చారిత్రిక, రాజకీయ పరిణామాలు, అక్కడి రాజ్యహింస, సాయుధ తిరుగుబాటులను సమాంతరంగా వివరించిన నవల 'One Hundred Years of Solitude' (మార్క్వెజ్). సమకాలీన వాస్తవాలు, ఫాంటసీ కలగలిసిన మ్యాజికల్ రియలిస్ట్ పద్ధతిలో ఈ నవల సాగుతుంది. ఇందులోని వినూత్న రచనా సంవిధానం సాహితీలోకాన్ని ఆకర్షించి, 46 భాషల్లోకి అనువాదమై 50 మిలియన్ కాపీలు అమ్మి 'గ్రేట్ లాటిన్ అమెరికన్ నవల'గా ఖ్యాతి గడించింది.

ఆలోచనలను, అనుభవాలను, భావాలను అక్షరరూపంలో సృజనాత్మకంగా వ్యక్తీకరించే కళారూపమే సాహిత్యం. కథ, కవిత్వం, నవల, నాటకం... ఏ ప్రక్రియ ఐనా కావొచ్చు– పాఠకుడిని భావోద్వేగపరంగా, మేధోపరంగా కదిలించి, జీవితం గురించి, మానవ అస్తిత్వం గురించి అతని అవగాహనను విస్తారం చేయగల గుణం ఆ రచనకున్న 'సాహితీ విలువ'. Whole gamut of human emotionsనీ, predicamentsనీ... కొత్త కోణంలో, ఆలోచనస్ఫోరకంగా చిత్రించిన ఏ రచన ఐనా నిలబడుతుంది, గుర్తుండిపోతుంది. అదే ఉత్తమ రచన లక్షణం.

■ ఆడెపు లక్ష్మీపతి
© 97012 27207

సోమవారం 2 మార్చి 2026

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'మహిమాలయం' ఆవిష్కరణ

పూనాటి రవీంద్రబాబు రచన 'మహిమాలయం' ఆవిష్కరణ మార్చి 7 సా.4గంటల నుంచి పెన్షనర్స్ హాల్, 6వ లేన్, బ్రాడీపేట, గుంటూరులో జరుగుతుంది. రఘుబాబు (సినీ నటుడు), గంటేడ గౌరునాయుడు, భూసురపల్లి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి నవీన్, భాస్కరభట్ల, చందనపల్లి గోపాలరావు, పక్కి రవీంద్ర నాథ్ తదితరులు పాల్గొంటారు.

గన్నవరపు ముత్యం

'సాహిత్యతులాభారం'

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చాగంటి తులసి సాహిత్య సమాలోచన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మార్చి 8న ఉ.6గంటల నుంచి విజయనగరంలో ఆమె ఇంట్లో జరుగుతుంది. ఆమె రచనలను అభిమానించే సాహితీ మిత్రులు ఏ రచన గురించైనా మాట్లాడవచ్చు. ఆసక్తి కలిగినవారు 83094 68318 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలి.

పాయల మురళీకృష్ణ

నాగభైరవ పురస్కారం

నాగభైరవ సాహిత్య పురస్కారానికి బాల సాహిత్య కథా సంపుటాలను, గేయ సంపుటాలను, నవలలను ఆహ్వానిస్తున్నాం. మొదటి, రెండవ బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు. 2020–2025 మధ్య ప్రచురించిన పుస్తకాలు నాలుగు ప్రతులను మార్చి 31 లోపు చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202 – శ్రీవెంకట సాయి రెసిడెన్సీ, 2వ లైన్, రామయ్యనగర్, ఒంగోలు – 523002, ప్రకాశం జిల్లా, ఏపీకి పంపాలి. వివరాలకు: 98497 99711.

నాగభైరవ ఆదినారాయణ

'కవి సంధ్య – కవి సుధామ' కవితల పోటీ ఫలితాలు


ఈ పోటీలో మొదటి, రెండవ, మూడవ బహుమతులకు వరుసగా లేదాళ్ల రాజేశ్వరరావు, పొనుగుమట్ల అశోక్ కుమార్, ఎన్. లహరి కవితలు ఎంపికయ్యాయి. కన్సోలేషన్ బహుమతులకు: పిన్నంశెట్టి కిషన్, బందారి రాజ్‌కుమార్, దోమల యాకస్వామి, ఇంద్రగంటి మధుసూదనరావు, మిరప మహేష్ ఎంపికయ్యారు. మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా జరిగే సభలో బహుమతి ప్రదానం ఉంటుంది. వివరాలకు: 94401 05987.

దాట్ల దేవదానం రాజు

తొలి తెలంగాణా కవి పంపన

రెండవ అరికేసరి ఆస్థానకవిగా, వేములవాడ ప్రాంతంలో జన్మించి కన్నడ ప్రాంతానికి వలస వెళ్ళి, పాండిత్యాన్ని సాధించి కన్నడ భాషకి సాహిత్య ప్రతిపత్తి ఇవ్వడానికి ఆదికవిగా రచనలు చేసిన తెలంగాణ కవి పంపన! అలాంటి పంపన రాసిన పద్యాలు తెలుగులో కూడా లభిస్తున్నప్పటికీ ఆయన రాసిన కావ్యాలు అలభ్యంగా ఉండటం తెలుగు సాహిత్యానికి తీరని లోటు. శాలివాహన శకం 9వ శతాబ్దం లోనే తెలుగు భాషలో అత్యంత అద్భుతమైన పాండిత్యాన్ని గడించి దానికి కావ్యగౌరవం ఇచ్చే లాగా కావ్యాలెన్నో రాసి, గ్రంథస్థం చేసి, శాసనాలలో తన పాండితీ ప్రకర్షని ప్రదర్శించి బొమ్మలమ్మ గుట్ట, కురక్యాల శాసనంలోని తొలి తెలుగు కందపద్యాలలో తన రచన "విక్రమార్జున విజయం" గురించి ప్రస్తావన సాధించిన పంప మహాకవి తెలుగు సాహిత్యపు తొలి కవి అని చెప్పవచ్చు. ఆయన రాసిన 'పంప భారతం' 1100 ఏళ్ళ తర్వాత పూర్తి అర్థ తాత్పర్య సహితంగా దాదాపు 1700 పేజీలతో పూర్తి తెలుగు అనువాదంగా ఇటీవల శాంత వసంత ట్రస్ట్ వరప్రసాద్ రెడ్డి ప్రచురించారు. అక్షరయాన్ రచయిత్రుల వేదిక స్థాపకురాలు, కవయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి పూనికతో, భాషావేత్త డాక్టర్ జోస్యుల సదానంద శాస్త్రి ఇతర నిపుణులతో కలిసి దాదాపు నాలుగేళ్ళ పాటు శ్రమించి అనువదించగా, నాళేశ్వరం శంకరం, మామిడి హరికృష్ణ, పొన్నం రవిచంద్ర సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఇప్పుడు పంపన, విక్రమార్జున విజయం గ్రంథ విశేషాలు మళ్ళీ చర్చకు వచ్చాయి.

శాలివాహన శకం 9వ శతాబ్దం లోనే తెలుగు భాషలో అత్యంత అద్భుతమైన పాండిత్యాన్ని గడించి దానికి కావ్య గౌరవం ఇచ్చే లాగా కావ్యాలెన్నో రాసి, గ్రంథస్థం చేసి, శాసనాలలో తన పాండితీ ప్రకర్షని ప్రదర్శించి బొమ్మలమ్మ గుట్ట, కురక్యాల శాసనంలోని తొలి తెలుగు కందపద్యాలలో తన రచన 'విక్రమార్జున విజయం' గురించి ప్రస్తావన సాధించిన పంప మహాకవి తెలుగు సాహిత్యపు తొలి కవి అని చెప్పవచ్చు.



మహాకవి పంపన వంశానికి సంబంధించిన చారిత్రక, శాసనపరమైన, గ్రంథ పరమైన ఆధారాలను అనుసరించి చూస్తే చాలా విషయాలు వెల్లడవుతాయి. మల్లియ రేచన రాసిన 'కవిజనాశ్రయం', పంపన రాసిన 'ఆదిపురాణం', 'విక్రమార్జున విజయం' కావ్యాలలో ప్రస్తావించిన పద్యాలను అనుసరించి పంపన వంశక్రమం గురించి ఈ విధంగా చెప్పవచ్చు:

యజ్ఞయాగాది క్రతువులలో నిపుణుడైన మాధవ సోమయాజి పంపన వంశానికి సంబంధించి మనకు లభిస్తున్న తొలి ప్రధాన వ్యక్తిగా గమనించవచ్చు. ఆయన కుమారుడు అభిమాన చంద్రుడు, ఆయన కుమారుడు కొమురయ్య వేదవేదాంగ పారంగతుడిగా ప్రసిద్ధి గాంచిన వ్యక్తి. ఆయన కుమారుడు 'భీమపయ్య'. ఆయన సతీమణి 'అబ్బణబ్బె'. వారి కుమారుడు పంపన.

కాగా పంపన పూర్వీకుల గురించిన విషయానికొస్తే వారు మొదట 'వెంగిపళు' అనే ప్రాంతం నుండి నేటి తెలంగాణ ప్రాంతం (అప్పట్లో సబ్బినాడు)కు వలస వచ్చారని తెలుస్తోంది.

అలాగే 'ఆదిపురాణం' ప్రథమాశ్వాసంలో 28, 29, 32 వ పద్యాలలో పంపన తనే స్వయంగా తన రూపు రేఖలు, గుణాల గురించి చెప్పుకోవడం విశేషం. ఈ పద్యాలలోని విషయాలను అనుసరించి పంపన శ్రీవత్స గోత్రీకుడని, దుందుభి నామ సంవత్సరంలో జన్మించాడని, వంకర తిరిగిన శిరోజాలతో, పద్మం లాంటి ముఖంతో సుందరంగా ఉండేవాడని చెప్పుకున్నాడు. ఈ దుందుభి నామ సంవత్సరం శాలివాహన శకం 902 తో సరిపోతుంది. కనుక ఈ ఆధారాలను అనుసరించి పంపన 902 వ సంవత్సరంలో జన్మించాడని నిర్ధారణ అవుతుంది.

అలాగే పంపన సోదరుడు గురించిన విషయాలు కూడా కురిక్యాల శాసనం ద్వారా వెల్లడవుతున్నాయి. జినవల్లభుడు ఆయన సోదరుడుగా కురిక్యాల శాసనంలోని కందపద్యం స్పష్టం చేస్తుండగా, ఈ విషయాలన్నీ జినవల్లభుడి 'కురిక్యాల శాసనం'లో ప్రస్తావిస్తూ, మరొక వైపున 'భీమ తనుజం సమ్యక్త్వ రత్నాకరం పంపర్యానుజుడు' అని జినవల్లభుడి గురించి, జినవల్లభుడికి పంపనకి ఉన్న సోదరత్వాన్ని గురించి ఈ శాసనంలో ప్రస్తుతించడం జరిగింది. అలాగే 'కవిజనాశ్రయం'లో భీమన/ భీమపయ్య ప్రసక్తి ఉంది. "ఆ భీమనాగ్రసుతుడే పంపన" అని పివీ పరబ్రహ్మశాస్త్రి లాంటి చరిత్రకారుడు కూడా తమ పరిశోధనలో నిర్ధారించారు.

ఈ విషయాలకి సంబంధించి 'కవిజనాశ్రయం'లో ఒక చోట:

"పరిగిన విమలయశోభా
సుర చరితుడు భీమనాగ్ర సుతుడఖిల కళా
పరిణతుడయ్యును భూసుర
వర ప్రసాదోదిత ధ్రువ శ్రీయుతుడై" అని ప్రస్తావించారు.

దీంట్లో 'భీమనాగ్ర సుతుడు' అంటే పంపన అని అర్థమవుతుంది. ఆనాటి చాళుక్యరాజు అరికేసరి ప్రభువుకి అనుంగు సహచరుడిగా పంపన గురించి తెలుస్తోంది.

ఇక ఆనాటి కాలంలో సాధారణంగా కవులు, సాహితీవేత్తలు జైన మతావలంబకులుగా ఉంటే, ప్రభువులు వైదిక మతాన్ని ప్రోత్సహించిన వారిగా ఉండటం విశేషం. అలాగే కవి కాలాదులను నిర్ధారించడానికి ఆయా రాజులు, చక్రవర్తులు, వారి పరిపాలన కాలాన్ని తీసుకోవడం సాధారణంగా చరిత్రకారుల కొలమానంలో కనిపిస్తుంది. ఆ లెక్కన చక్రవర్తి అరికేసరి వంశ వివరాలను పరిశీలిస్తే, దానికి మూడు ఆధారాలు మనకు లభిస్తున్నాయి. అవి:

(1) 'విక్రమార్జున విజయం' లోని విషయాలు.
(2) వేములవాడ శాసనంలో నిక్షిప్తమైన అంశాలు.
(3) పరబణి తామ్ర శాసనంలో లిఖించిన అంశాలు.

వీటి ఆధారంగా చాళుక్య వంశంలో మొదటి రాజు, యుద్ధమల్ల అనీ, ఎనిమిదవ రాజు రెండవ అరికేసరి అని మనకు స్పష్టంగా తెలుస్తోంది. ఆ లెక్కన రెండవ అరికేసరికి సమకాలికులుగా జినవల్లభుడు, ఆయన సోదరుడు పంపన ఉన్నారని కూడా వెల్లడి అవుతోంది.

మరొకవైపున పంపన జైన మతాన్ని స్వీకరించిన వ్యక్తిగా ఆధినాథుని కథతో 'ఆదిపురాణం' రాసాడని, చక్రవర్తి రెండవ అరికేసరితో తనకు ఉండే ఆత్మీయబంధానికి సాహిత్య రూపంగా 'విక్రమార్జున విజయం' కూడా రాసాడని తెలుస్తోంది.

పంపనకు, బోధన్‌కు ఉన్న అనుబంధం గొప్పది. 'విక్రమార్జున విజయం' లోని (3.22) తృతీయాశ్వాసం లోని అంశాలను గమనిస్తే ఇది స్పష్టంగా తెలుస్తుంది. ఈ ఆశ్వాసంలో పంపన ఏకచక్రపురం నగరాన్ని వర్ణిస్తాడు. ఆ వర్ణనలోని విశేషాలను బట్టి ఈ నగరానికి పూర్వం బహుధాన్య పురి, పోదన పురి, బోధన పురి, భక్తి పురం, చక్ర పురం అనే పేర్లు ఉండేవనీ మహాభారతంలోని 'బకాసుర వధ' ఘట్టం ఇక్కడే జరిగిందని ఈ రచన వల్ల తేటతెల్లమవుతోంది. కాగా ఈ నగరంలో పంపన చాలా కాలం నివాసం ఉన్నట్లు తృతీయాశ్వాసం లోని పద్యాలలో తన వ్యక్తిగత అనుభవాన్ని కూడా తెలియజేస్తాడు.

పంపనకు ఎన్నో బిరుదులు ఉన్నాయి. అందులో ఒక బిరుదు 'కవిత గుణార్ణవ'. అయితే అప్పట్లో వ్యక్తులు బతికున్న, చనిపోయినవారి పేరిట దేవాలయాలను, చెరువులను నిర్మించే సంప్రదాయం ఉండేది. పోదన పురి లోని తామ్ర శాసనంలో పంపన గురించి, అక్కడ నిర్మించిన తటాకం గురించి 'కవితా గుణార్ణవ తటాకం' అనే పేరుతో ప్రస్తావించడం జరిగింది. అంటే పంపన మరణానంతరం పోదన పురిలో ఆయన పేరిట చెరువు నిర్మాణం జరిగిందని భావించవచ్చు అని చరిత్రకారుల అభిప్రాయం. దీన్నిబట్టి పంపనకు బోధన్‌తో చెరపలేని అనుబంధం ఉన్నదని నిరూపణ అవుతున్నది.

పై పరిశీలనల ఆధారంగా తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ కన్నా శతాబ్ద కాలం ముందే తెలంగాణా సాహిత్య చరిత్ర మొగ్గ తొడిగిందని, తెలంగాణ తొలి కవిగా పంపన నిలుస్తున్నాడని చెప్పవచ్చు.

■ మామిడి హరికృష్ణ
© 80080 05231



మాట్లాడు

మాట్లాడు... ఏదో ఒకటి మాట్లాడు
నీలోపల లోలోన ఓసారి తొంగిచూడు
నీ చుట్టూ అల్లుకున్న చీకట్లను భయాలను పక్కకునెట్టి
కనీసం నీతో నువ్వయినా మాట్లాడు
మాట్లాడకపోతే
నీలోని ఆ దివ్యోదాత్తుడైన మానవునితో
సంభాషించే సదవకాశాన్ని కోల్పోతావు
లేదా... నిన్ను నీవే కోల్పోతావు!

లే! అత్తిపత్తిలా అలా వాలిపోతావేం?
నీలో నువ్వు ముడుచుకుపోతావేం?
వికసించు.. పూవులా విప్పారు
ఓ జలపాతమై నేను నుంచి మనంలోకి
మనం నుంచి జనంలోకి జాతరలా ప్రవహించు
రెక్క విప్పి నింగినదిలో స్వేచ్ఛగా ఈదులాడు!

యిప్పటికే నిన్ను బరువంటోంది భూమి
కసురుకుంటోంది కాలం... యింకెంత కాలమీ స్తబ్ధత?
పోటెత్తనీ నీలోని సముద్రాలు
బద్దలవనీ అగ్నిపర్వతాలు
మాట్లాడు ఏదో ఒకటి మాట్లాడు!

ఈ రోజుటి కొత్త గాయాల గురించో
గాయాలను పొడుచుకు తింటున్న రాంపోతుల గురించో
కూలగొట్టబడ్డ నీ యింటి గురించో
పగిలిపోయిన పూలకుండీల గురించో
రాలిపోయిన మొగ్గల గురించో
పసరుటాకుల కన్నీటిపాట గురించో... ఏదో ఒకటి మాట్లాడు!

నిత్య నిర్బంధాల రాజ్యంలో
ఏ పెనుగాలికి ఏ చెట్లు కూలిపోయాయో
ఏ పూలు ఎక్కడ రాలిపోయాయో
ఏ గూళ్లు ఎలా తగలబడిపోయాయో
ఏ పిట్టపిల్లలు నేలరాలి నెత్తురోడుతున్నాయో
మాట్లాడు.. మాట్లాడు.. ఏదో ఒకటి మాట్లాడు
సమస్తం ధ్వంసమైపోతున్న తరుణంలో
నేనింకా బతికే ఉన్నాననీ మాట్లాడుతున్నాననీ
ఎలుగెత్తి భూనభోంతరాలు దద్దరిల్లేలా బిగ్గరగా మాట్లాడు
మాట్లాడు.. మాట్లాడు! మాట్లాడితే మంటలు పుట్టాల
మాట్లాడితే చురకత్తులు జూలు విదిల్చాల
మాట.. జయగీతమే కాదు జనగీతం గావాల!

ఒరే నాయనా!
మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడకపోతే
నువ్వు మరణించినట్టు లెఖ్ఖ
మాట్లాడితే కేవలం ధిక్కారివే
మాట్లాడకపోతే నువ్వు... కట్టు బానిసవు!

■ సిరికి స్వామినాయుడు
© 94940 10330


అద్దంలో పక్షి
గాఢనిద్రలో కూరుకుపోయేవరకూ
గాయంలా జీవితం
తెలియకుండానే ఉంది

దారి కనిపించని చీకటిలో
వెలుగెప్పుడొస్తుందో

2
నన్నే కాదు
నా శరీరం నీడల్ని సైతం
ఈ భూమిమీద నడిపించిన వెలుగు
నన్ను చూసిన మొదటి వేకువ
నన్ను మడతపెట్టే చివరి రాత్రి
నాకు నీడనిచ్చిన చెట్లు
నా ఆకాశం మీద ఎగిరే పక్షులు
నన్ను గుర్తుంచుకున్నా లేకపోయినా
నన్ను తట్టిలేపే
నా పదాలకు
ఆ శ్రమ తప్పినపుడు
నేను లేని క్షణాల్ని
సమయం తప్పకుండా గమనిస్తుంది

ఏదో ఒక రోజు
నా నిశ్శబ్దాన్ని
ఎవరో ఒకరు
తప్పకుండా అనువాదం చేస్తారు

■ ముకుంద రామారావు
© 99083 47273





తెనాలి మున్సిపల్ కార్యాలయం

పుర పోరు.. వాయిదా

- మున్సిపల్ ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే
- ఓటర్ల జాబితా ప్రక్రియ నిలిపేసిన ఎస్ఈసీ

● 17తో ముగియనున్న కౌన్సిళ్ల గడువు.. ప్రత్యేక పాలనకు ఏర్పాట్లు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో ఓటర్ల జాబితా ప్రక్రియ నిలిచిపోయింది.. ఈ నెల 17వ తేదీతో కౌన్సిళ్ల గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రత్యేక పాలనకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పరిణామాలు చూస్తే ఇప్పట్లో పురపాలక సంఘాల్లో ఎన్నికల పోరు లేనట్లేనని తెలుస్తోంది. ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియను వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను అధికారులు నిలిపేశారు. ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడటంతో రాజకీయ పార్టీల నేతలు నిరుత్సాహ పడ్డారు. ఈ పరిణామాలతో ఈ సారి సకాలంలో మున్సిపల్ ఎన్నికలు జరిగే పరిస్థితులు కానరావడం లేదు. ఈ నెల 17న కౌన్సిల్ పదవీ కాలం ముగియనుంది. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు రూపొందించే ప్రక్రియ నిలిచిపోవడంతో ఎన్నికలు నిర్వహణలో తీవ్ర జాప్యం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పురాల్లో 17 నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి రానున్నది. పల్నాడు జిల్లా నరసరావుపేట, బాపట్ల జిల్లా బాపట్ల, గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు మున్సిపాల్టీల్లో పంచాయతీల విలీనంపై కోర్టుల్లో దాఖలైన పిటిషన్ల నేపథ్యంలో గతంలో ఎన్నికలు నిలిపివేసిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ వినతి మేరకు..

మున్సిపాల్టీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ఈ నెల 9న ప్రకటించాలని తొలుత ఎన్నికల కమిషన్ నిర్ణయించిన విషయం తెలిసిందే. వార్డుల సంఖ్య పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. వార్డుల వారీగా ఓటర్ల జాబితాల రూపకల్పనను తాత్కాలికంగా వాయిదా వేయాలని ప్రభుత్వం కోరినట్లు.. ఈ క్రమంలో ఆ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు కమిషన్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

పల్లె పోరుకు కసరత్తు..

అయితే పల్లె పోరుకు మాత్రం కసరత్తు జరుగుతోంది. పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్నారు. అలానే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ సమాయత్తమవుతోంది. ఓటర్ల జాబితాలు తయారు చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ నెల 9న ఓటర్ల జాబితాలను ప్రకటించేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ టీకా
● ప్రారంభమైన వ్యాక్సినేషన్ కార్యక్రమం
8
ఆలోచింపజేసిన అమ్మ చెక్కిన బొమ్మ
● ముగిసిన రంగస్థలి నాటిక పోటీలు

అమరావతిలో సీజేఐ

● రాజధానిలో పండుగ వాతావరణం ● ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన ● న్యాయమూర్తుల గృహసముదాయం ప్రారంభోత్సవం ● ముఖ్యమంత్రి చంద్రబాబు సహా సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల హాజరు



మొక్క నాటి నీరు పోస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, చిత్రంలో సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీలు, సీఎం చంద్రబాబు




సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన హైకోర్టు జడ్జిల బంగ్లాలు

సీఆర్డీఏ ఆధ్వర్యంలో నేలపాడులో రూ.210 కోట్ల వ్యయంతో 33.20 ఎకరాల విస్తీర్ణంలో 36 మంది హైకోర్టు న్యాయమూర్తుల కోసం ఆధునిక సౌకర్యాలతో నివాస గృహాలను నిర్మించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో 13 బంగ్లాలను నిర్మించేందుకు తగిన స్థలాన్ని కూడా కేటాయించారు. 7,841 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ ఒన్ నమూనాతో ఒక్కో బంగ్లాను నిర్మించారు. హైకోర్టు న్యాయమూర్తుల అవసరాలకు అనుగుణంగా ఆఫీసు గది, వెయిటింగ్ హాల్ తదితర వసతులతో ఈ గృహాలను సమగ్రంగా రూపొందించారు.

36 మంది జడ్జిలకు బంగ్లాలు

తుళ్లూరు, గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఆదివారం మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాజధానిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.40 వరకు రాజధాని అమరావతిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటన జరిగింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాకతో అమరావతిలో పండుగ వాతావరణం నెలకొంది. అమరావతిలోని హైకోర్టుకి సమీపంలో పిచ్చుకలపాలెం వద్ద జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన అట్టహాసంగా జరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నవ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. హైకోర్టు అతిథి గృహ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నేలపాడులో నిర్మించిన హైకోర్టు న్యాయమూర్తుల గృహసముదాయాన్ని కూడా ప్రారంభించారు. జడ్జిల బంగ్లాల ఆవరణలో సీజేఐ మొక్కలు నాటారు. అనంతరం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర న్యాయమూర్తులతో కలిసి ఓ గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయ అకాడమీ, అమరావతి రాజధాని అభివృద్ధి పనులపై రూపొందించిన ఆడియో, వీడియో డాక్యుమెంట్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు తిలకించారు. ఆయా కార్యక్రమాల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జే.కే.మహేశ్వరి, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ పీ.ఎస్.నరసింహ, జస్టిస్ ఎస్.వీ.ఎస్.భట్టి, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ (మిగతా 8లో)

రివర్‌ఫ్రంట్‌కు తొలిఅడుగు



మాస్టర్‌ప్లాన్‌కు ప్రతిపాదనలు

కన్సల్‌టెంట్ల ఎంపికకు ఆహ్వానం

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రవహించే కృష్ణానదిని కేవలం ఒక సరిహద్దుగా కాకుండా రాష్ట్ర రాజధాని అమరావతి నగర రూపకల్పనకు ప్రధాన పర్యావరణ వ్యవస్థగా ఏజీఐసీఎల్ పరిగణిస్తోన్నది. ఈ క్రమంలో నదీ తీరంలో రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్ కోసం ప్రాజెక్టు డిజైన్, మేనేజ్‌మెంట్ కన్సల్ టెంట్ ఎంపిక చేసేందుకు అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌పీ) ప్రతిపాదనలను ఆహ్వానించింది. ఈ ప్రాజెక్టు నిమిత్తం సమీకృత మాస్టర్‌ప్లాన్, మౌలిక సదుపాయాలు, వివరణాత్మక భూ సమీకరణ ప్రాంత ప్రణాళిక తయారీకి కన్సల్‌టెంట్‌ని ఎంపిక చేయనుంది. టెండర్ నోటిఫికేషన్‌ని ఇప్పటికే ఆన్‌లైన్‌లో అప్‌లోడింగ్ చేసిన ఏజీఐసీఎల్ మార్చి 13 మధ్యాహ్నం 3 గంటల వరకు బిడ్‌లను స్వీకరిస్తుంది. కాగా సోమవారం ఉదయం ఏపీసీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ప్రీబిడ్ మీటింగ్ నిర్వహించనున్నది.

27 కిలోమీటర్ల పొడవునా..

రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుని అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ఒక బహిరంగ ప్రదేశంగా అభివృద్ధి చేయనున్నారు. కృష్ణానది తీరాన ఉండవల్లి నుంచి వైకుంఠపురం వరకు 27 కిలోమీటర్ల పొడవు, దక్షిణ నదీ తీరం, లంక గ్రామాలతో కలిపి ఈ ప్రాజెక్టుని అభివృద్ధి చేయనున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు, చిత్తడి నేలలను రక్షించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. పర్యాటక, ఆర్థికాభివృద్ధితో పాటు స్థానికుల జీవనోపాధిని పరిరక్షించడం కూడా ప్రాజెక్టు లక్ష్యంగా ఉన్నది. అమరావతి చరిత్ర, బౌద్ధ వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఘాట్లను అభి వృద్ధి చేస్తారు. సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికలను ఈ రివర్ ఫ్రంట్‌లో నిర్మిస్తారు. అలానే బయోడైవర్సిటీ పార్కులు, రివర్ మార్కెట్లు, థీమ్ పా ర్కులు, రివర్ మ్యూజియంలు నిర్మిస్తారు. పిల్లల ఆటస్థలాలు, అవుట్‌డోర్ ఫిట్‌నెస్ జిమ్‌లు, ఫుడ్ కోర్టులు, పబ్లిక్ ప్లాజాలు, అబ్జర్వేషన్ డెక్‌లు, ఓపెన్‌ఎయిర్ థియేటర్లు, మొక్కల పెంపకం, పూలతోటల పెంపకం కోసం కన్సల్‌టెంట్లు 2డీ, 3డీ డిజైన్లను అందించాల్సి ఉంటుంది. డిజైన్ దశ నాలుగు నెలలు, అమలు దశ 20 నెలలు కలిపి మొత్తం రెండేళ్లలో ఈ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుని అభివృద్ధి చేయాలని ఏజీఐసీఎల్ భావిస్తున్నది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సాయంత్రం 6.19 (సోమవారం)
సహరి : ఉదయం 5.07 (మంగళవారం)



రావెలలో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, చిత్రంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, దాతలు రాఘవేంద్రప్రసాద్, కల్యాణి దంపతులు

అభివృద్ధికి దాతలు సహకరించాలి

● రావెలలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

తాడికొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి దాతలు సహకరిస్తూ ముందుకు రావాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. మండలంలోని రావెల గ్రామంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని స్థాని క ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం పెమ్మసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ సూద్నగుంట రాఘవేంద్రప్రసాద్ అందించిన విరాళంతో కమ్యూనిటీ భవనాన్ని ని ర్మించినట్లు తెలిపారు. తాడికొండ నియోజకవర్గానికి, గ్రామానికి ఎలాంటి సంబంధం లేకపోయినా సరే ప్రజల కోసం వారు కమ్యునిటీ భవనాల నిర్మాణాలకు రూ.4 కోట్లు విరాళంగా అందజేశారని అభినందించారు. దాతలు అందించిన ప్రతి ఒక్క రూపాయి ఖర్చు పెడుతూ, ఎక్కడా అవినీతి జరకుండా చూసిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. చరిత్రలో నిలిచేలా రాజధాని అమరావతిని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారన్నారు. డాక్టర్ రాఘవేంద్రప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తాను ఇచ్చిన నగదును ప్రజల కోసం ఖర్చుపెట్టి ఇంతటి భవనాన్ని పెమ్మసాని నిర్మింపచేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెమ్మసాని చంద్రశేఖర్‌తో ఉన్న సత్సంబంధాలతో దాతలు రాఘవేంద్రప్రసాద్, కల్యాణిలు జిల్లా పరిధిలో 9 కమ్యూనిటీ భవనాలు నిర్మాణానికి సహకారం అందించారన్నారు. అభివృద్ధి చేసే సత్తా, నిధులు తీసుకువచ్చే చాకచక్యం, చొరవ పెమ్మసానికి మాత్రమే ఉందన్నారు. అనంతరం కమ్యూనిటీ భవనానికి విరాళం అందజేసిన డాక్టర్ రాఘవేంద్రప్రసాద్, కల్యాణిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త బేతపూడి విజయ్‌శేఖర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార మార్కెట్‌పై చర్యలు

నేటి ఉదయం తొలగించనున్న అధికారులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొన్నూరు రోడ్డులో జాతీయ రహదారికి ఆనుకుని అనధికారికంగా నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను తొలగించేందుకు కార్పొరేషన్ అధికారులు రంగం సిద్ధం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకోనున్నట్లు ఆదివారం ప్రకటించారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఈ అనధికార మార్కెట్‌ను తొలగించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను గతంలో లాగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నగరానికి చెందిన కొందరు పాత వ్యాపారులు గత కొన్ని నెలలుగా హైవే పక్కన కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ అనధికారికంగా నిర్వహిస్తున్నారు.హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

ఎన్టీఆర్ స్టేడియం కార్యదర్శిగా.. వజ్జా

● 455 ఓట్ల మెజార్టీతో రామకృష్ణ విజయకేతనం ● 2,160 మందిలో ఓటేసిన వారు 1267 మందే

గుంటూరు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ కార్యదర్శిగా వజ్జా రామకృష్ణ ఎన్నికైనట్లు డిప్యూటీ కమిషనర్, ఎన్నికల అధికారి సిహెచ్.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్టేడియం పాలకవర్గ ఎన్నికల ఓటింగ్, లెక్కింపు ప్రశాంతంగా జరిగాయి.మొత్తం 2,160 మంది ఓటర్లలో 1267 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 20 ఓట్లు చెల్లలేదు. కార్యదర్శి పదవికి పోటీ పడిన అభ్యర్థుల్లో వజ్జా రామకృష్ణకు 851 ఓట్లు పోల్ కాగా, దొడ్డపనేని రాజేంద్రకు మార్‌కు 396 ఓట్లు పోలయ్యాయి. దీంతో వజ్జా రామకృష్ణ 455 ఓట్లు మెజారిటీ సాధించారు. వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు దామా మహేశ్వరరావు, జాయింట్ సెక్రటరి పోస్టుకు పాకనాటి ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ పోస్టుకు కండె కాంతారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఇంకొల్లు వెంకట రత్తయ్య, జి.హ నుమంతరావు, గుంటుపల్లి యామిని శివ జ్యోతి,లగడపాటి అంజలి గెలుపొందారు.



కార్యదర్శిగా గెలుపొందినట్లు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వజ్జా రామకృష్ణ

తరగతి గది నుంచి.. చట్ట సభకు!
● విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలు తిలకించే అవకాశం ● పోలవరం కూడా చూపిస్తామన్న స్పీకర్
8
రేషన్ డోర్ డెలివర్రీ..!
● వృద్ధులకు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలన్న ఆదేశాలు బేఖాతరు ● పదే పదే జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ

ఊరేగిన.. నృసింహుడు

● కల్ప, పొన్న, శేష వాహనాలపై గ్రామోత్సవం

8



కల్పవృక్ష వాహనంపై నారసింహుడు

శేష, పొన్న వాహనాలపై శ్రీవారి గ్రామోత్సవం



కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం విష్ణు విన్యాసం



మాట్లాడుతున్న హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ నయన్ సారికా

గుంటూరు(తూర్పు), మార్చి 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా విష్ణు విన్యాసం అని.. చిత్రం హీరో శ్రీవిష్ణు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి వారంలో భారీ కలెక్షన్లు రావడం సంతోషంగా ఉందన్నారు. గుంటూరుకు చెందిన ముగ్గురు దర్శకులను తను పరిచయం చేశానని గుర్తుచేశారు. వారు అందించిన విజయాలతో సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. భవిష్యత్తులో మంచి పాత్రలను పోషించి, ప్రేక్షకులను అలరిస్తానని చెప్పారు. హీరోయిన్ నయన్ సారికా మాట్లాడుతూ విష్ణు విన్యాసంతో మంచి విజయం అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుడు యదునాథ్ మారుతిరావు పాల్గొన్నారు.

జేఏ, టైపిస్టులకు ఉద్యోగోన్నతి

● కలెక్టర్ అన్సారియా ఉత్తర్వులు

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ విభాగంలో 26 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుకు ఉద్యోగోన్నతి కల్పించి కలెక్టర్ తమీమ్ అన్సారియా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో పి.విక్రమ్‌కుమార్, ఇ.బాజీబాబు, జి.కృష్ణకిషోర్, డి.శ్రీదేవి, వై.బద్రీనాథ్, ఐ.సుభాషిణి, ఎ.సాయిమాధవ్, ఎన్.జాస్మిన్, కేవీ పద్మావతి, వి.స్రవంతి, ఎన్.మౌనిక, బీటీఎన్ కోటి కిరణ్‌కు గుంటూరు జిల్లాలో పోస్టింగ్ కల్పించారు. డి.సుధీప్, కె.వెంకటేశ్వర్లు, ఎస్.నాగరాజకుమార్, వె.సాయిసుప్రియ, టి.భాస్కర్, షేక్ ఖాశిం, ఆర్. నాగప్పూరి నాయక్, కె.కబ్బిరెడ్డి, షేక్ సూఫియ, డి.వెంకటేష్, వి.చైతన్య కుమార్‌లకు పల్నాడు జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఎస్.రవిరాజు, ఎం.శ్రీనివాసరావు, కె.కవితను బాపట్ల జిల్లాకు కేటాయించారు. వీరిలో ఎస్.రవిరాజు డిపార్టు మెంటల్ టెస్టు పాస్ కాకపోయినా 45 ఏళ్ల వయస్సు దాటడంతో ప్రమోషన్ కల్పించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

గుంటూరు (విద్య) మార్చి 1(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, కళాశాలల ప్రవేశం పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఐదవ తరగతిలో ప్రవేశానికి 1,614 మంది నమోదు చేసుకోగా 1,351 మంది పరీక్ష రాశారు. 263 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 2270 మంది నమోదు చేసుకోగా 2,090 మంది పరీక్షకు హాజరయ్యారు 180 మంది గైర్హాజరైనట్లు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ వెల్లడించారు. గురుకుల కళాశాలలో ఐఐటీ శిక్షణకు నిర్వహించిన పరీక్షకు 1,728 మంది దరఖాస్తు చేసుకోగా 1551 మంది హాజరయ్యారు. 177 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

సాగర్ నీటిమట్టం 539.20 అడుగులు

విజయపురిసౌత్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 539.20 అడుగులు ఉంది. ఇది 186.66 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8831, ఎడమ కాలువ ద్వారా 8807, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 19,938 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 10322 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పిల్లలకు అల్పాహారం తెచ్చేందుకు వెళ్లి..



వాసు మృతదేహం

తెనాలి క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వేస్టేషన్ సమీపంలోని మద్రాసు రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. పినపాడుకు చెందిన కరేటి వాసు (55) పిల్లలకు అల్పాహారం తెచ్చేందుకు రైల్వే గేటు కింద నుంచి దూరి ట్రాక్ దాటుతుండగా.. సూపర్‌ఫాస్ట్ రైలు ఢీకొట్టింది. మృతుడికి ఇద్దరు సంతానం. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఇన్‌చార్జి జీఆర్‌పీ ఎస్.ఎల్.సరస్వతి తెలిపారు.

మూడో వ్యక్తితో ఉందని..

ఆ ఇద్దరు హత్య చేశారు

రాజుపాలెం, మార్చి1(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో మహిళ హత్య గావింపబడింది. ఈ కేసులు ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన వేల్పుల ఈశ్వరయ్య, మల్లేశ్వరి దంపతులకు ఇద్దరు సంతానం. వారికి వివాహం కూడా చేశారు. కొంతకాలంగా మల్లేశ్వరి అదే గ్రామానికి చెందిన వేల్పుల నాగేశ్వరరావుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం మల్లేశ్వరి కుటుంబ సభ్యులకు కూడా తెలుసు. అయితే నాగేశ్వరరావు మల్లేశ్వరి కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకోవడంతో వారు కూడా అడ్డు చెప్పలేదు. అయితే మల్లేశ్వరి గ్రామానికే చెందిన మరో వ్యక్తితో కూడా సంబంధం నెరిపింది. ఈ విషయం నాగేశ్వరరావుకు, భర్త ఈశ్వరయ్యకు తెలియడంతో తట్టుకోలేక పోయారు. ఇద్దరూ మాట్లాడుకుని.. కలిసి గత నెల 25న రాత్రి మల్లేశ్వరిని హత్య చేశారు. ఈ క్రమంలో కుమారై శ్రీలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్, ఎస్ఐ మణికృష్ణ నిందితులను ఆదివారం రాజుపాలెం సమీప ంలో అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	167, 176, 187
చికెన్ విత్ స్కిన్(కిలో)	324.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	334.00

భూ వివాదాల్లో

బొల్లా జైలుకు వెళ్లడం ఖాయం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు చేసిన భూ ఆక్రమణలు, దందాల కేసుల్లో జైలుకు వెళ్లడం ఖాయమని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మానాయుడు ఎమ్మెల్యే అధికారం అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూమిలే కాకుండా దౌర్జన్యంగా ప్రైవేటు భూముల్ని కూడా ఆక్రమించారని ఆరోపించారు. భూ దందాలకు పాల్పడిన బొల్లా దొంగే.. దొంగా.. దొంగా అన్న చందంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వినుకొండ కొండ చుట్టూ దౌర్జన్యంగా, కారు చౌకగా భూములు కాజేశారన్నారు. చుట్టూ రోడ్లు వేసుకునేందుకు రామలింగేశ్వరస్వామి కల్లోకి వచ్చాడని, గిరి ప్రదక్షిణ రోడ్డు వేస్తానని ప్రజా ధనంతో తన భూముల వరకు రోడ్లు వేయించుకొన్నాడని విమర్శించారు. కారంపూడి రోడ్డు చెక్కవాగు వద్ద 4 ఎకరాలు భూమిని కొన్న బొల్లా.. దళిత క్రిస్టియన్ జోసెఫ్ ఫ్రెడ్రిక్ 2 ఎకరాల భూమిని ఆక్రమించాడని, కొండ వద్ద ఒక బీసీ పేద కుటుంబానికి చెందిన కనమల నాసరయ్య భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వెంకట్రావు, హనుమంతరావుకు చెందిన ప్రైవేటు ఆస్తులను బ్రహ్మానాయుడు ఆక్రమిస్తే బాధితుల కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ఇలా ఎన్నో ప్రభుత్వ ప్రైవేటు భూములను ఆక్రమించిన బొల్లా బ్రహ్మానాయుడుపై కోర్టులో కేసులు నడుస్తున్నాయని, భూ వివాదాల కేసుల్లో బ్రహ్మానాయుడు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. నాడు టీడీపీ పాలనలో తాము శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.160 కోట్లు తెచ్చామని, రూ.500 కోట్లు విలువచేసే ఎన్ఎస్‌పీ స్థలాన్ని మున్సిపాలిటీకి బదలాయిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు క్యాబినెట్ ఆమోదంతో 146 జీవో ఇవ్వడం జరిగిందన్నారు. దానిని కూడా నేనే తెచ్చానని బ్రహ్మానాయుడు అసత్య ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మధ్య చిచ్చు పెట్టేందుకు బ్రహ్మానాయుడు రెచ్చగొట్టే తీరును తమ శ్రేణులు గ్రహిస్తున్నారన్నారు. పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధికి ఈ నెల 7న జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు సీఎం చంద్రబాబు నాయుడుని కలవనున్నట్లు తెలిపారు.

బొల్లాకు మతిభ్రమించింది : మక్కెన

వినుకొండ నియోజకవర్గంలో సొసైటీ చెరువులు ఎన్ని ఉన్నాయో కూడా తెలియని బొల్లా బ్రహ్మానాయుడు మతిభ్రమించి మాట్లాడుతున్నాడని జీడీసీసీబీ చైర్మన్ మక్కన మల్లికార్జునరావు విమర్శించారు. వేల్పూరు సొసైటీ చెరువును ఎంపీపీ అనిల్‌కుమార్, ఈపూరు సొసైటీ చెరువును వైసీపీ నాయకుడు బుచ్చయ్య చౌదరి, కనుమల్లపూడి చెరువు వైసీపీ జడ్పీటీసీ చౌడయ్య చేస్తున్నారని, పెద్దకంచెర్ల చెరువు ఒక్కటే సొసైటీ చెరువు కాదని.. బ్రహ్మానాయుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. వ్యక్తిగత విమర్శలు చేస్తున్న బొల్లా బ్రహ్మానాయుడు ఒక పాల వ్యాపారిగా వందల కోట్లు ఎలా సంపాదించాడో ప్రజలకు చెప్పాలన్నారు. కల్తీ పాలు, అవినీతి, అక్రమాలు, దందాలు చేసి కోట్లకు పడగలెత్తిన బొల్లా సీఎం చంద్రబాబునాయుడును, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును విమర్శించే స్థాయి కాదని ఖండించారు.

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

● మంత్రి అనగాని



రేపల్లె, మార్చి1(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నడూలేని విధంగా తొలిసారిగా రెండుసార్లు అంగన్‌వాడీల వేతనాలను పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేందుకు ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రతి నెలా ఒకటినే వేతనాలు అందిస్తున్నామన్నారు. 58,204 మంది అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు బ్లాక్ కో-ఆర్డినేటర్లకు రూ.75వేల కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్ ఫోన్‌లు అందించామంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల హాజరు 70 నుంచి 96 శాతానికి పెరగడం కూటమి పాలన ప్రత్యక్ష ఫలితమని పేర్కొన్నారు. 2025 బడ్జెట్‌లోనే గ్రాడ్యూటీకి రూ.20 కోట్లు కేటాయించి అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్‌వాడీలకు అండగా నిలిచిందన్నారు. అంగన్‌వాడీలకు టీవీ, ఆర్‌వో ప్లాంట్లు, వేసవిలో టీచర్లు, ఆయాలకు 15 రోజులు సెలవు దినాలు కల్పించినట్లు తెలిపారు.

8వ పే కమిషన్‌లో జీడీఎస్‌లను చేర్చాలి

● తపాల ఉద్యోగుల ఆల్ ఇండియా సెక్రటరీ వాసిరెడ్డి శివాజీ

గుంటూరు సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తపాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిష్కరించాలని, 8వ పే కమిషన్‌లో జీడీఎస్ ఉద్యోగులను కూడా చేర్చి.. ప్రైవేటీకరణ అనుకూల విధానాలను వెంటనే విరమించాలని నేషనల్ యూనియన్ పోస్టల్ ఉద్యోగుల ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ డిమాండ్ చేశారు. గుంటూరు డివిజన్‌లో ఆదివారం జరిగిన నేషనల్ యూనియన్ పోస్టల్ ఉద్యోగుల ద్వైవార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పోస్టల్ విభాగాన్ని నష్టాల్లో ఉన్న సంస్థగా చూడటం సరైనది కాదన్నారు. ఇది దేశ ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించే అతిపెద్ద ప్రజా సంస్థ అని పేర్కొన్నారు. "డాక్ సేవ - జన సేవ" అన్నది కేవలం నినాదం కాకుండా ఆచరణలో ఉండాలని సూచించారు. పోస్టల్ వ్యవస్థ బలోపేతం అయితేనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఏపీ సర్కిల్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్, సెక్రటరీ డేవిడ్ రాజు, పోస్ట్‌మాన్, ఎంటీఎస్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సర్కిల్ సెక్రటరీ నవీన్ కుమార్, జీడీఎస్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ యోగేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలతో మెరుగైన విద్య

● భాష్యం రామృష్ణ



రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు(విద్య),మార్చి 1(ఆంధ్రజ్యోతి): అత్యున్నత ప్రమాణాలతో భాష్యం ఇంటర్నేషనల్ స్కూల్ ద్వారా నేటి తరం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఆదివారం గోరంట్లలో భాష్యం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్ అకడమిక్ బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలు పెంపునకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామకృష్ణ జన్మదినోత్సవం క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన తల్లి భాష్యం పేరమ్మ చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మహమ్మద్ నజీర్, గల్లా మాధవి, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, ఉగ్ర నరసింహారెడ్డి తదితరులు పాల్గొని, రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పదిమందికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వినుకొండటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొలుపులకని వెళ్తూ మార్గమధ్యంలో వాహనం ప్రమాదానికి గురై పదిమందికి గాయాలైన ఘటన మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో బాలాజీ ఎస్టేట్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. తెలంగాణలోని కామారెడ్డికి చెందిన బండారు చిరంజీవి, తమ్ముడు నాగరాజు కుటుంబాలు వాహనంలో ప్రకాశం జిల్లా దొనకొండ మండలం తెల్లబాడు గ్రామానికి వెళ్తున్నారు. ముందు వెళ్తున్న లారీ అర్ధంతరంగా బ్రేకులు వేయడంతో వెనుక ఉన్న వీరి వాహనం, మరో ట్రావెల్ బస్సు ఢీకొన్నాయి. 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎటువంటి ప్రాణహాని లేదని తెలపడంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రెండు వరుసల వంతెన..అక్కరకు వచ్చేనా..

● మిర్చియార్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం
● నివ్వెరపోతున్న వాహనదారులు



మిర్చియార్డు వద్ద నిర్మిస్తున్న రెండు వరసల బ్రిడ్జి

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు - పేరేచర్ల మధ్యన జాతీయ రహదారిపై నిర్మిస్తున్న రెండు వరసల వంతెనపై విమర్శలు వ్యక్తమవున్నాయి. మిర్చియార్డు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా చేపట్టిన ఈ బ్రిడ్జిని నాలుగు వరసలుగా నిర్మిస్తారని అంతా భావించారు. అందుకు తగినట్లుగానే ఇరువైపులా సర్వీసు రోడ్లను ప్రస్తుతం ఉన్న ఆరు వరసల రహదారి మార్జిన్‌లో నిర్మించారు. అయితే మధ్యలో కేవలం రెండు వరసల వంతెనని మాత్రమే నిర్మిస్తుండడంతో.. అటుగా ప్రయాణిస్తున్న వాహనదారులు ఆశ్చర్యపోతోన్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్, అనంతపురం వెళ్లేందుకు వాహనదారులు ఎక్కువగా వినియోగించే ఈ జాతీయ రహదారిపై భవిష్యత్తు అవసరాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా రెండు లేన్ల బ్రిడ్జిని నిర్మించడం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

వంతెన నిర్మాణంలో గోప్యత...

ఏటా మిర్చి సీజన్‌లో అనంతపురం - గుంటూరు ఎన్‌హెచ్-544డీ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇందుకు కారణం కర్ణాటక, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల నుంచి మిర్చి లోడుతో లారీలు భారీ సంఖ్యలో వస్తుండటమే. అలానే పల్నాడు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి కూడా ఆటోలు, ట్రాక్టర్లలో వందల సంఖ్యలో వస్తున్న మిర్చి వాహనాలు మిర్చి యార్డులోకి ప్రవేశించడానికి సమయం పడుతుంది. ఈ సమయంలో ట్రాఫిక్ ఇరువైపులా నిలిచిపోతుంది. కొన్ని సందర్భాల్లో రెండు కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీనికి పరిష్కారంగా మిర్చియార్డు వద్ద ఫ్లైఓవర్‌ని ఎన్‌హెచ్‌ఏఐ మంజూరు చేసింది. ఇది జాతీయ రహదారి కావడంతో కనీసం నాలుగు వరసల వంతెనను మంజూరు చేస్తుందని భావించారు. అయితే ఎన్ని వరసల వంతెన అనేది చెప్పకుండా అధికారులు గోప్యత పాటించారు.

ట్రాఫిక్ చిక్కులు తప్పవు

రూ. 41 కోట్ల అంచనాతో ఈ పనులు ప్రారంభమై రెండేళ్లు పూర్తి కావొస్తోంది. సర్వీసు రోడ్లు, డ్రెయినేజీ పనులను కొంతమేరకు పూర్తి చేశారు. మధ్యలో వంతెన నిర్మాణాన్ని మిర్చియార్డు వద్ద ప్రారంభించారు. మిర్చియార్డు వరకు 5.5 మీటర్ల ఎత్తులో అండర్ పాస్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ రెండు వరసల వంతెన వల్ల రేపటి రోజున బ్రిడ్జి పూర్తి అయిన తర్వాత రెండు భారీ వాహనాలు ఎదురెదురుగా వెళితే ఇబ్బందికరమే. ఒకవేళ సర్వీసు రోడ్డులోకి భారీ వాహనాలు వస్తే అప్పుడు కూడా అవి మిర్చి యార్డులోకి వెళ్లేంత వరకు సాఫీగా ఉండదు. ఈ నేపథ్యంలో ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి నివేదించి నాలుగు వరసల్లో ఈ వంతెన నిర్మాణం జరిగేలా చూడాలని వాహనదారులు కోరుతోన్నారు.

పులిచింతలలో.. 34.71 టీఎంసీలు

అచ్చంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 34.71 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

గుంటూరు (తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ కళాశాల ప్రాంగణంలో రాధా మాధవ రసరంజని 327వ నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తొలుత ఆర్ అగ్రహారం గీతామందిరం చైర్మన్ జుజ్జూరు శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్ఎస్‌కే నృత్యాలయ, హైదరాబాద్, నృత్య కళాభారతి, నటేష్ నర్తనం గుంటూరు వారి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. ఈ నృత్యాలకు ఎస్ఎమ్ సంధ్య, ఎన్.బాలు, శ్రీనివాసరెడ్డి నృత్య దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య ఎస్‌కే ఖలీల్ పర్యవేక్షించారు.

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి

లాంచీ స్టేషన్ ఆదాయం రూ.43 వేలు



నాగార్జున కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండపై ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీల్లో వెళ్లిన పర్యాటకులు కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు సందర్శించారు. అనుపులోని మహాస్థూపం, అశ్వమేధ యజ్ఞశాల, యాంపీ థియేటర్, రంగనాథస్వామి ఆలయం వీక్షించారు. అనంతరం అనుపులోకి ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ. 43 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

బ్రహ్మకుమారీల జీవితం ఆదర్శప్రాయం

● మహిళ కమిషన్ చైర్ పర్సన్ శైలజ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శైలజ

తుళ్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో శివనామస్మరణే పరమావధిగా జీవించే బ్రహ్మకుమారీల జీవితం ఆదర్శప్రాయమని మహిళ కమీషన్ చైర్ పర్సన్ శైలజ పేర్కొన్నారు. రాజధాని అమరావతిలోని నెక్కల్లు రెవెన్యూ పరిధిలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 90వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవానికి ముఖ్య అతిథిగా శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రాలు స్త్రీని గౌరవించడం, క్రమశిక్షణతో మెలగడం నేర్పుతాయని అన్నారు. ప్రతి మనిషి తన జీవితంలో కొంత సమయాన్ని ఆధ్యాత్మిక అంశాలకు కేటాయించాలని సూచించారు. ఆధ్యాత్మిక బోధనలే సమాజాన్ని సన్మార్గంలో నడుపుతాయన్నారు. ఈ సందర్భంగా జయంతి పతాకాన్ని శైలజ ఆవిష్కరించారు.



కంటి వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కుర్రా అప్పారావు, సామినేని వంశీకుమార్ తదితరులు

సామినేని చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

● గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గత పదమూడేళ్లుగా కుల, మతాలకు అతీతంగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు చేయూత, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్న సామినేని చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు అన్నారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం జోయపాలెం గ్రామంలోని అనంతలక్ష్మీ స్పిన్నింగ్ మిల్స్ ఆవరణలో ఆదివారం సామినేని ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి పెదకాకాని వారి ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కుర్రా అప్పారావు ప్రారంభించి మాట్లాడారు. స్పిన్నింగ్ పరిశ్రమలతో పాటు అనేక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్న సామినేని కోటేశ్వరరావు, వంశీకుమార్ అభినందనీయులని అన్నారు. ట్రస్ట్ సామినేని వంశీకుమార్ మాట్లాడుతూ, శిబిరంలో దాదాపు 500 మందికి పరీక్షలు నిర్వహించగా, 250 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరాన్ని వైద్యులు గుర్తించినట్టు చెప్పారు. శుక్లాల ఉచిత ఆపరేషన్‌కు శంకర కంటి ఆస్పత్రి ముందుకు రావడం సంతోషదాయక విషయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రిక్రియేషన్ జీఎం కేవీల్ రాజు, వైద్యులు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వీటు తినిపిస్తున్న పార్వతి నాయుడు

జనసేన సభ్యత్వ నమోదులో మహిళా ప్రభంజనం

● రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ పార్వతి నాయుడు

గుంటూరు మెడికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన ఉద్యమి సభ్యత్వ నమోదుకు మహిళలు ప్రభంజనంలా ముందుకు వస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ పార్వతి నాయుడు తెలిపారు. ఆదివారం శ్రీనివాసరావుతోటలో నిర్వహించిన జనసేన సభ్యత్వ నమోదు శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తూ పెద్ద సంఖ్యలో మహిళలు ముందుకు వచ్చి ఉద్యమి సభ్యత్వం స్వీకరించడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. మిర్చియార్డు కమిటీ వైస్ చైర్పర్సన్ బిట్రగుంట మల్లిక మాట్లాడుతూ, రాష్ట్రంలో మరే ఇతర పార్టీకి లేని విధంగా మహిళా శక్తి జనశక్తి జనసేన పార్టీ సొంతమని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యమి సభ్యత్వం స్వీకరించిన మహిళలకు పార్వతి నాయుడు, బిట్రగుంట మల్లిక స్వయంగా స్వీట్లు తినిపించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, వీరమహిళలు చేబ్రోలు లీల, ఆళ్ల శిరీష, వడ్డే విజయలక్ష్మి, ఆళ్ల భాగ్యలక్ష్మి, నేతలు షేక్ మెహబూబ్ బాషా, కోలా అంజనేయులు, బోడేం అశోక్, వడ్డే సుబ్బారావు, నాజర్‌వలి, నందూరి స్వామి పాల్గొన్నారు.

17వ డివిజన్ పరిధిలో...

17వ డివిజన్‌లో జనసేన పార్టీ నగర కార్యదర్శి మిద్దె నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 80 మంది జనసేన ఉద్యమి కార్యకర్తలుగా సభ్యత్వం స్వీకరించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి నాయుబ్‌కమాల్, నేతలు అడపా మాణిక్యాలరావు, చావలి అనంద సాగర్, నారదాసు ప్రసాద్, మేదరమెట్ల గిరిబాబు, కోలా రాజు, సరోజిని, వెంకట్ నాయుడు, శెట్టి సత్యనారాయణ, షాహిద్, షేక్ గౌస్ పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదం

● ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో దోహదం చేస్తాయని రాయలసీమ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పెద పలకలూరు చైతన్య విద్యాసంస్థల ఆవరణలో అఫ్తర్ ఆధ్వర్యంలో ఆదివారం కలాం సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్ట్ (కేశాట్) లెవెల్ 1 ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని పరీక్ష ఓఎంఆర్ షీట్లను ఆవిష్కరించిన రామచంద్రారెడ్డి మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం అవసరమన్నారు. ఈ అఫ్తర్ చైర్మన్ డాక్టర్ భువనగిరి ఫణి పవన్ శాస్త్రి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని విద్యార్థులకు డాక్టర్ అబ్దుల్ కలాం స్ఫూర్తితో కెసెట్ ఒలింపియాడ్ టాలెంట్ పరీక్షలు నిర్వహించి, వారిలో ఉన్న ప్రతిభను గుర్తిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో చైతన్య స్కూల్ డైరెక్టర్ ఎస్.సాంబిరెడ్డి, అఫ్తర్ ప్రతినిధులు కొండవీడు మస్తాన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీ పరీక్షల ఓఎంఆర్ షీట్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రరెడ్డి

క్రమశిక్షణకు కరాటే దోహదం

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ, క్రమశిక్షణకు కరాటే దోహదం చేస్తుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆర్‌బీ డ్రాగన్ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, జాతీయస్థాయి పోటీలను గుంటూరులో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజులలో ఈ మార్షల్ ఆర్ట్స్ ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. అసోసియేషన్ సభ్యుడు పి.రాంబాబు మాట్లాడుతూ, పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 620 మంది క్రీడాకారులు హజరైనట్లు చెప్పారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య, ఏపీ హైకోర్టు సెంట్రల్ గవర్నమెంట్ కౌన్సిల్ సభ్యురాలు పి.సరస్వతి, ఏపీ న్యాచురల్ వెల్ఫేర్ కౌన్సిల్ అంబటి నవకుమార్, ఆల్ ఇండియా చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యుడు పి.రుకమకరరావు, సాయిరామ్, ఆలపాటి రవికుమార్, శివకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.



కరాటే పోటీలలో బహుమతులు పొందిన క్రీడాకారులతో కోచ్‌లు

దేశ సంఘటితమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

గుంటూరు(విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని సంఘటితం చేయడమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లక్ష్యమని ప్రముఖ జాతీయవాద జర్నలిస్ట్ కస్తూరి రాకా సుధాకరరావు పేర్కొన్నారు. దుర్గాదాస్‌గా పేరు గడించిన గోనరాజు వెంకట సుబ్బారావు రచించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్మాత 'నవదధీచి మన డాక్టర్ జీ' గద్య నాటకం పుస్తకావిష్కరణ సభ స్థానిక అమరావతి రోడ్డు హిందూ పార్శీ కళాశాల సమావేశ మందిరంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుధాకర్ రావు మాట్లాడుతూ, చిన్న సంస్కృతులను ఒక గూటికి చేర్చి బలమైన శక్తివంతమైన సమాజ నిర్మాణానికి వందేళ్ల క్రితం పునాదులు వేసిన డాక్టర్ హెడ్గేవార్ జీ.దార్శనికత శ్రేయోదాయకమని అన్నారు. పుస్తక రచయిత దుర్గా దాస్ మాట్లాడుతూ, భారతమాత ప్రేరణతో డాక్టర్ జీ జీవితం మీద పుస్తకం రాసినట్లు చెప్పారు. టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, గుంటూరు విభాగ్ సంఘచాలక్ డాక్టర్ కేఎస్ఎన్ చారి, గడియారం రామకృష్ణ, అంగలకుదురు వాసు దాస స్వామి పీఠాధిపతులు సీతారామస్వామి, డాక్టర్ భోగరాజు విజయభాస్కర్, జూపూడి హైమావతి, జూపూడి రంగరాజు, సెర్వ్ ఆర్గనైజేషన్ మన్నవ హనుమ ప్రసాద్, కిషోర్, శ్రీధర్, సాయి కృష్ణ, శ్రీనివాస్ యాదవ్, సంఘ్ ప్రముఖులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూపూడి హైమావతి తదితరులు

కేఎస్ఆర్‌టీఎం స్కూల్ హెచ్ఎంకు అస్వస్థత

● విద్యాశాఖ అధికారుల తీరుతో ఒత్తిడికి గురయ్యారని ఆరోపణలు

● ప్రైవేటు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స

గుంటూరు (విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీపి కాలనీలోని కొల్లిశారద మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ హెచ్ఎం పి.శ్రీనివాసరావు అస్వస్థతతో ఆస్పత్రిపాలయ్యారు. అయితే విద్యాశాఖ అధికారుల తీరుతో తీవ్ర ఒత్తిడికి గురై శ్రీనివాసరావు గురయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వారం పాఠశాలను డీఈవో ఎస్‌కే సలీమ్ బాషా తనిఖీ చేశారు. ఆ సమయంలో హెచ్ఎం పాఠశాలలో లేరు. అధికారికంగా ఆయన సెలవులో ఉన్నారు. అయినా హెచ్ఎం శ్రీనివాసరావును డీఈవో సలీమ్ బాషా పాఠశాలకు పిలిపించారని తెలిసింది. పాఠశాలకు వచ్చిన హెచ్ఎం హుడావిడిగా నేరుగా డీఈవో ఉన్న తరగతి గదిలోకి వెళ్ళారని, విద్యార్థులతో మాట్లాడుతుంటే నేరుగా గదిలోకి వస్తారా అంటూ డీఈవో సలీమ్ బాషా హెచ్ఎం శ్రీనివాసరావుపై విద్యార్థులు, సిబ్బంది సమక్షంలోనే తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. ఇది జరిగిన రెండోరోజు మరలా హెచ్ఎం పనితీరు పరిశీలించాలంటూ డిప్యూటీ డీఈవోను పాఠశాలకు పంపారు. ఆయన కూడా సిబ్బంది, విద్యార్థుల ముందే హెచ్ఎం పనితీరును తప్పుపట్టినట్లు సమాచారం. ఆయా విషయాలపై తీవ్ర మనస్తాపానికి గురైన హెచ్ఎం శ్రీనివాసరావు శనివారం అస్వస్థతకు గురయ్యారని, వెంటనే ఆయనను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించామని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. విద్యాశాఖ అధికారులు తీరుతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారని సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని ఓ ఉపాధ్యాయ సంఘం నేత పేర్కొన్నారు.

తనిఖీలతో ఒత్తిడికి గురయ్యారనడం అవాస్తవం: డీఈవో

ఈ సంఘటనపై డీఈవో డాక్టర్ ఎస్‌కె సలీమ్ బాషా మాట్లాడుతూ తాను పాఠశాలను తనిఖీ చేసిన తరువాత హెచ్ఎం ఒత్తిడికి గురైనట్లు చేస్తున్న ప్రచారంలో ఎటువంటి నిజం లేదని అన్నారు. తాను తనిఖీకి వెళ్ళిన మరుసటి రోజు ఆ పాఠశాల హెచ్ఎం సీఎస్, డీవో శిక్షణకు హాజరయ్యారని, మూడోరోజు అస్వస్థతకు గురయ్యారని వెల్లడించారు.



మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర, పాల్గొన్న సంఘ నాయకులు

కుమ్మరులకు ప్రభుత్వం అండగా నిలబడాలి

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన కుమ్మరులకు ప్రభుత్వం అండగా నిలబడాలని కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర కోరారు. స్థానిక అరండల్‌పేట సీఏఎన్ కల్యాణ మండపంలో ఆదివారం ఆ సంఘ రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పారెళ్ళ బసవేశ్వరరావు అధ్యక్షత వహించిన సభలో తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మర్లుకు తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. రాష్ట్రంలోని కుమ్మర్లు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి బెజవాడ అది శేషయ్య మాట్లాడుతూ, వెనుకబడిన వారికి సంఘం అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ, పద్మ నాగేశ్వరరావు, నడికుడి వెంకటేశ్వరరావు, నాగన్నపాల్గొన్నారు.

3,4 తేదీల్లో ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన

గుంటూరు మెడికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా బ్రాడీపేట ఎస్‌హెచ్‌వో భవన్‌లో మార్చి 3,4 తేదీల్లో ప్రకృతి ఛాయా చిత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌వో) అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ నేచర్ ఫోటోగ్రాఫర్ టీఎన్ వరప్రసాద్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో ప్రముఖ వైద్యుడు, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ డాక్టర్ ఎన్.వెంకటరమణ, జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సతీష్‌కుమార్, ఎం.రవికుమార్, పట్వా గౌరవ సలహాదారు కె.కృష్ణ తదితరులు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. ప్రకృతి ఫోటోగ్రఫీ పట్ల ఆసక్తి ఉన్న వారికి ఈ ప్రదర్శనలో వరప్రసాద్ మెళకువలను వివరిస్తారన్నారు. ప్రజలు ఈ ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించాలని డాక్టర్ సేవకుమార్ కోరారు.

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందివెలుగు రోడ్డు వస్త్రనగర్‌లో వేంచేసిన కామ్య సిద్ధి వేంకటాచల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్చరణ నడుమ పలు పూజారి కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఆదివారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు స్వామివారి ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనునట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి మండల వెంకటేశ్వరరావు, కోశాధికారి మద్దినేని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కూరపాటి వెంకట నరసింహారావు, ఉప కార్యదర్శి చేబ్రోలు నాగేశ్వరరావు, కార్యనిర్వాహక సభ్యుడు కొత్తమాసు వేణుగోపాల్, చంద్ర పార్థీ సాయికుమార్ పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం అందించాలని కూటమి ప్రభుత్వాన్ని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు డిమాండ్ చేశారు. కొత్తపేట, సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో మొదలైన ఈ సమస్య నేటి వరకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 20 లక్షల మంది బాధితులు ఉన్నారని, వందలాది మంది చనిపోయారని అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. అగ్రిగోల్డ్ యాజమాన్యపు కుటుంబ సభ్యులకు ఉన్న బినామీ ఆస్తులను వెంటనే అటాచ్‌మెంట్ చేయాలని కోరుతూ నేటి నుంచి విజయవాడ ధర్నా చౌక్‌లో రిలే నిరవధిక నిరాహార దీక్షలను నిర్వహి స్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ దీక్షలకు రాష్ట్రంలో ఉన్న బాధితులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోటా మాల్యాద్రి, సాంబశివరావు, నాగరాజు, సుబ్బారెడ్డి, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం

గుంటూరు కార్పొరేషన్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్‌లోని లాలాపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి భక్తులు విరాళం అందజేసినట్లు ఆలయ ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. గుంటూరు వల్లూరు వారి తోటకు చెందిన కనమర్లపూడి నాగేశ్వరరావు సతీమణి పద్మావతి రూ.1,01,116ను విరాళంగా అందజేసినట్లు ఆమె తెలిపారు.

ముగిసిన పౌరాణిక పద్య నాటక ప్రదర్శనలు

గుంటూరు (తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం 29వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పౌరాణిక ఉచిత పద్య నాటక ప్రదర్శనలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజున సత్య హరిశ్చంద్ర పూర్తి నాటకం, బాలనాగమ్మ ఫకీరు సీను ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య హాజరై కళాకారులను అభినందించారు. కార్యక్రమాల్ని సంస్థ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి పూజ, గోపూజ, చక్రమేరుకు విశేషాభిషేకాలు, అర్చనలు జరిగాయి. కల్యాణాలలో భాగంగా విజయలక్ష్మి నారాయణుల కల్యాణం కనులపండువగా జరిగింది. అనంతరం పలు రకాలు పుష్పాలతో కల్యాణ మూర్తులకు పుష్పాభిషేకం వేడుకగా నిర్వహించారు. మహాహారతి, మంత్రపుష్పం, కల్యాణంలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ జరిగింది. ఉత్సవాలను ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు శర్మ పర్యవేక్షించారు.



మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, గౌస్ తదితరులు

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ మైనార్టీ సెల్ నగర మాజీ అధ్యక్షుడు షేక్ గౌస్ ఆధ్వర్యంలో శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులో ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అప్పిరెడ్డి మాట్లాడుతూ, రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలతో కలిసి ప్రత్యేకంగా దువా చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కలపాల సత్యనారాయణ, మాచర్ల జానీ, రబ్బానీ, షేక్ సబిల్, బండి వెంకటేష్, మన్సూర్, సాదిక్ తదితరులున్నారు.

దారి తప్పిన వృద్ధురాలు నిర్మల్‌హృదయ్‌కు తరలింపు

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : దారి తప్పిన ఓ వృద్ధురాలు లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో తిరుగుతుండగా పోలీసులు బ్రాడీపేటలోని నిర్మల్ హృదయ్‌కు ఆదివారం తరలించారు. సుమారు 70 నుంచి 75 సంవత్సరాల వయసు గల ఈవిడ పేరు రవణమ్మ అని చెబుతూ మరే ఇతర వివరాలు చెప్పలేకపోతోందన్నారు. గుంటూరు లాలాపేట పరిధిలోని ఎల్ ఆర్ కాలనీ ఏరియా లో తిరుగుతూ ఉండగా లాలాపేట పోలీస్‌లు బ్రాడిపేటలో గల నిర్మల హృదయ్‌లో చేర్పించారు. వృద్ధురాలి వివరాలు తెలిసి వారు లాలాపేట పోలీస్ స్టేషన్‌తో తెలియజేయాలని పోలీసులు కోరారు.

మహిళల భద్రత కోసమే వారోత్సవాలు : ఈస్ట్ డీఎస్పీ

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళల భద్రత, సాధికారతపై చైతన్యం కోసమే వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈస్ట్ డీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు విజ్ఞాన మందిరం నుంచి రాధాకృష్ణ థియేటర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళలకు ఏదైనా ఇబ్బంది కలిగినప్పుడు డయల్ 112కి గాని, శక్తి టీమ్‌ను కానీ వినియోగించుకోవాలని లేదా నేరుగా పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇవ్వవచ్చని, రక్షక్ వాహనం 24 గంటలు సేవలు అందిస్తుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎస్‌ఐలు రమేష్, పి.సుబ్బారావు, లాలాపేట ఎస్సై వెంకట్రావు, పాతగుంటూరు ఎస్సై రెహమాన్, ట్రాఫిక్ సిబ్బంది, గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది, పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

అనుభవాల అనుభూతులను నిక్షిప్తం చేసేది కవిత్వం

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న కవిత్వంతో కాసేపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం అరండల్‌పేటలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ప్రముఖ రచయిత డాక్టర్ విజయ్ కోగంటి తమ కవిత చదివి కార్యక్రమం ప్రారంభించి కవులందరు ఒక చోట చేరి కవిత్వంతో కాసేపు గడపడం బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నానా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని , కవిమిత్రుడు కె. పుల్లారావు, వశిష్ట సోమేపల్లి, తాటికోల పద్మావతి, ఎం. సుభద్రకృష్ణ, జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు,విజయలక్ష్మి సోమేపల్లి, రమణి సబ్బరాజు, రవికుమార్, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, పింగళి భాగ్యలక్ష్మి, గిరిభూషణ రావు, గురవయ్య తమ కవితలు చదివి అందరిని అలరించారు.

అంగన్‌వాడీల సంక్షేమమే కూటమి లక్ష్యం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండుసార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత టీడీపీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో ఇప్పటికే తొమ్మిది నెరవేర్చామని, వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత త్వరగా అమలు చేస్తామని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం


● తెలుగు మహిళ, అంగన్వాడీ నేతలు

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళా నేతలు చెప్పారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో మహిళా నేతలు ముత్తినేని శివలీల, మణికుమారి, లామ్ నవమి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండుసార్లు అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసిందని విమర్శించారు.

నాటి సామాజిక జీవిత దర్పణం... చుక్కపొడుపు

● కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పి శివశంకర్

గుంటూరు(తూర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 1970వ దశకంలో జిల్లాలోని సామాజిక జీవితాన్ని 'చుక్కపొడుపు' నవల ఆవిష్కరించిందని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో ఆదివారం నల్లూరి రుక్మిణి రచించిన చుక్కపొడుపు నవల ఆవిష్కరణ సభ జరిగింది. ప్రోగ్రెసివ్ ఫోరం బాధ్యులు పి.మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పాపినేని శివశంకర్ మాట్లాడుతూ మనుషుల సామాజిక జీవితాన్ని ఈ నవల బలంగా చిత్రించిందని తెలిపారు. సాహితి విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య ప్రసంగిస్తూ ఇది కేవలం ఒక చారిత్రక డాక్యుమెంట్ మాత్రమే కాదని, జీవితాన్ని అర్థవంతంగా సమన్వయించి రాసిన నవల అని అన్నారు. ఇందులో ప్రాంతీయత, స్థానికత అనే రెండు అంశాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ నవలలోని పాత్రలు, ఘటనలు మన అందరి జీవితాలతో ముడిపడి ఉన్నాయని అన్నారు. రచయిత నల్లూరి రుక్మిణి మాట్లాడుతూ ఈ ప్రాంతపు సామాజిక, రాజకీయ, ఆర్థిక జీవితంలో వచ్చిన ప్రగాఢమైన మార్పులను నేటి తరానికి అందించాలనే, ఆలోచనతో ఈ నవలను రచించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సాహితివేత్తలు, రచయితలు పాల్గొన్నారు.



చుక్కపొడుపు నవలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పాపినేని శివశంకర్, లక్ష్మినరసయ్య తదితరులు

రేపు వినికిడి లోపానికి ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా గుంటూరువారితోట మూడోలైన్‌లోని రాధిక రాయుడు స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో చెవికి సంబంధించిన పరీక్షలు ఆటో ఎండోస్కోపీ, చెవుడు తెలుసుకొనేందుకు ఆడియోమెట్రి పరీక్షలు ఉచితంగా చేస్తామని ఆయన వెల్లడించారు. పుట్టుకతో మూగ, చెవిటితో బాధపడే ఐదేళ్లలోపు పిల్లలకు గుర్తిస్తే వారికి రూ.12 లక్షల విలువైన కాక్లియార్ ఇంప్లాంట్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని ఆయన తెలిపారు. ఐదు నుంచి పదేళ్లల్లోపు పిల్లలకు కూడా ఇతర ఆర్థిక సహాయాల ద్వారా కాక్లియార్ ఇంప్లాంటేషన్ ఆపరేషన్ చేసే అవకాశం ఉన్నట్లు ఆయన వివరించారు. పెద్ద వారిలో చెవికి సంబంధించిన వ్యాధులను పరీక్షించి అవసరమైన శస్త్రచికిత్సలకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా చేస్తామని డాక్టర్ సుబ్బారాయుడు తెలిపారు. ఆధునిక చెవిటి మెషిన్లను 30 శాతం డిస్కౌంట్ ధరల్లో రోగులకు అందిస్తామని ఆయన వెల్లడించారు.

వైభవంగా శ్రీ వారి కల్యాణం

గుంటూరు (తూ ర్పు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా నాలుగో రోజు ఆదివారం స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై ఉభయదేవేరి సమేతుడైన స్వామి ఉత్సవ మూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పి.మాధవస్వామి బృందం ఆధ్వర్యంలో దంపతులతో కల్యాణాన్ని అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బ్రహ్మోత్సవాల సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. తిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. సాహితీ వేత్తలు గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి, న్యూ హైపరప్ కమిటీ జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, సీసీఎల్ ప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్ రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు.

టాస్క్‌ఫోర్స్ అదుపులో క్రికెట్ బుకీ

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తాడికొండలో ఓ క్రికెట్ బుకీని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడి వద్ద సుమారు రూ.4 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అతడి ఫోన్ లో నగదు లావాదేవీలు పరిశీలించగా ఆదివారం ఒక్కరోజే రూ.34 లక్షల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు బుకీని మరింత లోతుగా విచారిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోదండరామయ్య నగర్ 4వ లైను చివర గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతికి గల కారణాలు వెల్లడికాలేదు. ఆత్మహత్య చేసుకున్నాడా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసి వారు నగరం పాలెం పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఊరేగిన..నృసింహుడు

● కల్ప, పొన్న, శేష వాహనాలపై గ్రామోత్సవం



కల్పవృక్ష వాహనంపై నారసింహుడు



పొన్న వాహనంపై గ్రామోత్సవంలో నృసింహస్వామి

మంగళగిరి సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళాద్రి నృసింహుడు ఆదివారం వివిధ వాహనాలపై భక్తులను అలరించారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి ఊరేగిన శ్రీవారు, రాత్రి పొన్న వాహన సేవలో పాల్గొన్నారు. ఓ వైపు పొన్న వాహన సేవ కొనసాగు తుండగానే శ్రీదేవీ, భూదేవీ సమేతంగా నృసింహస్వామి వార్ల ఉత్సవ మూర్తులను కొత్త పెళ్లి కుమార్తెలు, పెళ్లి కుమారుడిగా ఆలయ అర్చకస్వాములు అలంకరింపజేసి శేష వాహనంపై గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం జరిగిన కల్పవృక్ష వాహన సేవకు తిరుపతికి చెందిన గొంటు ముక్కల రమణయ్య, సుగుణ దంపతులు కైంకర్య పరులుగా వ్యవహరి ంచారు. రాత్రి జరిగిన పొన్న వాహన సేవకు మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం కైంకర్యపరులుగా వ్యవహరించింది. ఉత్సవ నిర్వహణా ఏర్పాట్లను ఏవో కె.సునీల్ కుమార్ పర్యవేక్షించారు.



ఉత్సవంలో భక్తులు

రథాంగ దర్శనం మాత్రమే..

ఈ ఏడాది చంద్ర గ్రహణం అడ్డు తగలడంతో పురవీధుల్లో నృసింహుని రథోత్సవం రద్దు చేశారు. రథోత్సవానికి బదులుగా భక్తులకు స్వామి వారి రథాంగ దర్శనం కల్పించనున్నారు. మంగళవారం గ్రహణ గడియలు సమీపించక ముందే కల్యాణ క్రతువులు, గ్రామోత్సవాలను ముగించనున్నారు. గ్రహణం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు ఎగువ, దిగువ సన్నిధులకు ద్వార బంధనం చేయనున్నట్లు అర్చకస్వాములు తెలిపారు. గ్రహణ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం బుధవారం ఉదయం నుంచి యథావిధిగా స్వామి వారి దర్శనం ఉంటుందన్నారు.

నేడు నృసింహుని కల్యాణం

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం అర్ధరాత్రి స్వామి వార్ల కల్యాణం జరుగనుంది. దేవస్థానం ఉత్సవ గ్రౌండులో శ్రీవారి కల్యాణం నిర్వహించేందుకు వేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.



శేష వాహనంపై స్వామివారు

● విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలు తిలకించే అవకాశం

● పోలవరం కూడా చూపిస్తామన్న స్పీకర్

తెనాలి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చట్ట సభల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అమరావతిలో జరుగుతున్న శాసన సభ సమావేశాలకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు పలు పాఠశాలల నుంచి విద్యార్థులు వచ్చి సమావేశాలను తిలకిస్తున్నారు. రాష్ట్రంలో పలు ఉన్నత పాఠశాలల నుంచి 9వ తరగతి విద్యార్థులు,

తరగతి గది నుంచి.. చట్ట సభకు!

కళాశాలలు, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులను సమావేశాలకు అనుమతించారు. అసెంబ్లీకి వచ్చిన విద్యార్థులను, ఉపాధ్యాయులను విజిటర్స్ గ్యాలరీలోకి అనుమతించి 20 నిమిషాల పాటు జరుగుతున్న చర్చలను వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు సభలో చర్చిస్తున్న విధానాన్ని స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల సభా నిర్వహణ తీరును విద్యార్థులు పరిశీలిస్తున్నారు. అనంతరం వచ్చిన ప్రతి విద్యార్థికి స్పీకర్ కార్యాలయ సిబ్బంది స్వీటు ప్యాకెట్లు అందిస్తున్నారు. అసెంబ్లీ బయట నియోజకవర్గ ఎమ్మెల్యేతో పాటు పలువురు మంత్రులు, ఉపముఖ్యమంత్రి, స్పీకర్ విద్యార్థులతో ఫొటోలు దిగడంతో ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషిస్తున్నారు. స్పీకర్ విద్యార్థులతో చక్కగా మాట్లాడి సభా, సమావేశాల పట్ల వారు పొందిన అవగాహనను తెలుసుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అసెంబ్లీ వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

ఇటీవల నియోజకవర్గాల వారీగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించి నియోజక వర్గ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులతో శాసన సభ ప్రాంగణంలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులే స్వయంగా నమూనా అసెంబ్లీ నిర్వహించడం అలరించింది. విద్యార్థులు అసమాన ప్రతిభ చూపి సమావేశం నిర్వహించడం నేతలను ఆశ్చర్య పరిచింది. నేటి బాలలే రేపటి పౌరులు అన్న దృక్పథంతో ప్రభుత్వం చట్టసభల పట్ల అవగాహన కల్పించే నిర్ణయం తీసుకోవడం పలువురు అభినందిస్తున్నారు. సమావేశాలకు వచ్చిన విద్యార్థులందరితో రాష్ట్రానికి ఎంతో ఉపకరించే ప్రాజెక్టు పోలవరం కూడా చూపించి, ప్రాజెక్టుల అవసరాలు కూడా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ ఉపాధ్యాయులతో చెప్పడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తుంది. గత ప్రభుత్వం పూర్తిచేయలేని పోలవరం ప్రాజెక్టును కూటమి హయాంలో పూర్తయ్యేలా కృషి జరుగుతోంది.

అమరావతిలో సీజేఐ

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శ్యామల రావు, సురేష్‌కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐకు ఘనంగా స్వాగతం

తొలిసారిగా రాజధాని అమరావతికి వచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు ఘన స్వాగతం లభించింది. గన్నవరం విమానాశ్రయంలో ఆయనకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్‌ఠాకూర్, న్యాయమూర్తులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్డు మీదగా సీజేఐ పిచుకలపాలెం చేరుకున్నారు. పిచుకల పాలెంలో జ్యుడీషియల్ అకాడమీ శంకుస్థాపన కార్యక్రమం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీజేఐకి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజధాని నిర్మాణ ప్రణాళిక, వివిధ శాఖల నిర్మాణాలు, రాజధానిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి సీజేఐ సూర్యకాంత్‌కు ప్రత్యేకంగా వివరించారు. కాగా గత వైసీపీ పాలనలో రైతుల న్యాయ పోరాటానికి అన్ని విధాలుగా అండగా నిలిచి, తమకు న్యాయం చేసిన న్యాయశాఖకు సంబంధించిన కీలకఘట్టం కావడంతో రాజధాని రైతుల్లో సంతోషం వెల్లివిరిసింది. రాజధాని రక్షణలో కీలక తీర్పులిచ్చిన నాటి రోజులను రైతులు నెమరువేసుకున్నారు. తమ ఇంట్లో పండుగలా భావించి రైతులు సందడి చేశారు.

ప్రేమ, మానవత.. విద్యాధర్ కవిత

● అరసం జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, మానవత విద్యాధర కవిత్వ నేత్రాలని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు విజేత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం 'అమరావతి సాహితీ మిత్రులు' నిర్వహించిన జెల్ది విద్యాధరరావు కవిత్వ సమాలోచన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అమరావతి సాహితి మిత్రులు సంస్థ సంస్థాపకుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. మానవీయత, నవ్యత విద్యాధరరావు కవితలలో కనిపిస్తాయని, ఆయన కవిత్వానికి అభ్యుదయం అంతర సూత్రమని తెలియజేశారు. 'అంతరంగ భాష' కవిత్వ సంపుటి గురించి ప్రముఖ సాహితీవేత్త శైలజా మిత్ర ప్రసంగిస్తూ, ప్రేమ విశ్వరూపం విద్యాధరరావు కవిత్వంలో కనిపిస్తుందని, ప్రేమతో పాటు రాజకీయ విమర్శ కూడా ఉద్యోగం చేస్తున్నప్పుడే ధైర్యంగా చిత్రించినందుకు అభినందించారు. 'కోహినూర్' కవిత్వ సంపుటి గురించి యర్రగుంట్ల పాణిరావు మాట్లాడుతూ, విద్యాధరరావు కవిత్వంలో చక్కని వ్యక్తీకరణ, ఉదాత్త పవిత్ర ప్రేమ భావనలు ఉన్నాయని కొనియాడారు. ముసాఫిర్ కవిత్వ సంపుటి గురించి ప్రముఖ సాహితీవేత్త సరికొండ నరసింహరాజు మాట్లాడుతూ ఉన్నతమైన విలువలు, అనుభూతి అద్భుతంగా ఉన్నాయని కవిత్వాన్ని మెచ్చుకున్నారు. 'తోటమాలి మాలిమి' కవిత్వ సంపుటిపై తాటికోల పద్మావతి మాట్లాడుతూ ఆధునికత, అద్భుతశైలి విద్యాధరరావు కవిత్వం సంపదలని మెచ్చుకున్నారు. విశిష్ట అతిథిగా పాలుపంచుకున్న ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ విద్యాధరరావు భాషా శక్తిని, అద్భుత విషయ పరిజ్ఞానాన్ని, అలంకార వైభవాన్ని ప్రశంసించారు. విద్యాధరరావు స్పందిస్తూ తాను అనుభూతి కవిని కానని, అనుభవాల కవినని, సామాజిక సంక్షేమం తన కవిత్వ లక్ష్యంగా తెలియజేశారు. ఈ సభలో ఇంకా పింగళి భాగ్యలక్ష్మి, పలకలూరి శివరావు తదితరులు పాల్గొన్నారు. కవి జెల్ది విద్యాధరరావును అమరావతి సాహితీ మిత్రులు సంస్థ పక్షాన డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, పెనుగొండ లక్ష్మీనారాయణ, బండికల్లు జమదగ్ని, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, సాహితీ ప్రియులు ఘనంగా సత్కరించారు.



కవి విద్యాధరరావును సత్కరిస్తున్న రంగారావు, లక్ష్మీనారాయణ తదితరులు

ఆలోచింపజేసిన అమ్మ చెక్కిన బొమ్మ

● నరసరావుపేటలో ముగిసిన రంగస్థలి నాటిక పోటీలు

● నటి సరోజకు రంగస్థలి ప్రతిభా పురస్కారం అందజేత



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న రంగస్థలి నిర్వాహకులు



అమ్మ చెక్కిన బొమ్మ నాటికలోని దృశ్యం

నరసరావుపేట కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న నరసరావుపేట రంగస్థలి 25వ జాతీయ ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరుగుతున్న ఈ పోటీలలో మూడో రోజు మొదటి నాటికగా గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ నాటికను ప్రదర్శించారు. ఓ ట్రాన్స్‌జెండర్‌ను తండ్రితో సహా సమాజం చీత్కరించినా తల్లి బాధ్యతగా తీసుకుని ఆమెను కలెక్టర్‌గా తీర్చిదిద్దిన తీరు అందరిని ఆలోచింపజేస్తుంది. అనంతరం సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారి గేమ్ నాటిక అలరించింది. ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌ల బారిన పడి సర్వం కోల్పోయి, చివరికి ప్రాణాలు తీసుకుంటున్నారని, వాటి మాయలో పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తుంది ఈ నాటిక. నాటికల మధ్యలో పట్టణంలోని కే-రిడ్జ్ ఇంటర్నేషల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన శ్రీరామ పట్టాభిషేకం నృత్య రూపకం ప్రేక్షకులను ముగ్ధులను చేసింది. అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, వేదిక అధ్యక్షుడు డా.ముత్తవరపు సురేష్ బాబు పాల్గొన్నారు. రంగస్థలి ప్రతిభా పురస్కారాన్ని రంగస్థల, టీవీ, చలనచిత్ర నటి ద్రాక్షారామం సరోజకు అందజేశారు. కార్యక్రమాన్ని రంగస్థలి గౌరవాధ్యక్షుడు కిలారు వెంకట్రావ్, అధ్యక్షుడు మహబూబ్ సుభాని, ఇక్కుర్తి మస్తాన్ రావు, కేఆర్ ప్రసన్నకుమార్, నల్లపాటి బోస్, ఏఏ మధుకుమార్, షేక్ బాజీ మస్తాన్, సూరిబాబు, బాజాన్ నిర్వహించారు.

తెలుగు వైభవాన్ని ..

దశదిశలా వ్యాపింపజేయాలి

● ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

● అమలాపురంలో ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు

అమలాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, కిమ్స్ సంయుక్తంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో రెండోరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'దేశభాషలందు తెలుగులెస్స అన్న శ్రీకృష్ణదేవరాయలు మాటలు ఈ నాటికీ మనకు స్ఫూర్తిని నింపుతున్నాయన్నారు. వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా వికాసంలో మహత్తర పాత్ర పోషించారని, వ్యవహారిక తెలుగు ప్రాచుర్యానికి కృషిచేసి భాషను ప్రజలకు చేరువ చేశారన్నారు. నేటి ఆధునిక యుగంలో తెలుగును ప్రోత్సహించాల్సిన అవసరం ప్రజలపై ఉందని అన్నారు. భావితరాలు తెలుగు భాష సాంస్కృతిని, ఔన్నత్యాన్ని కాపాడుకునేందుకు ముందడుగు వేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

అమ్మభాషను మరవొద్దు: హైకోర్టు న్యాయమూర్తులు

హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గౌసుమీరా మొయినుద్దీన్, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ కుటుంబసమేతంగా తెలుగు మహాసభల్లో పాల్గొన్నారు. న్యాయమూర్తులు మాట్లాడుతూ, అమ్మభాషను మరువకూడదన్నారు. ఇతర భాషలు నేర్చుకున్నా మాతృభాషను మాత్రం చిన్నారులకు దూరం చేయొద్దని పిలుపునిచ్చారు.

తెలుగు మీడియం అభ్యర్థులకు 10 శాతం రిజర్వేషన్‌కు తీర్మానం

గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకూ తెలుగు మాధ్యమంలో విద్యనభ్యసించినవారికి ఉద్యోగాల్లో పదిశాతం రిజర్వేషన్ కల్పించాలని, 1వ తరగతి నుంచి డిగ్రీ వరకూ మాతృభాషను బోధించాలని చేసిన తీర్మానాలను హర్షధ్వానాల మధ్య మహాసభలో ఆమోదించారు. మహాసభల్లో తెలుగుదనం ఉట్టిపడే రీతిలో ఏర్పాటు చేసిన వివిధ ఆకృతులు, ఆవులు, ఎద్దుల బొమ్మల సెట్టింగులు ఆకట్టుకున్నాయి. అంబేడ్కర్, పూలే, ఎన్టీఆర్, తెలుగుతల్లి సహా ప్రముఖుల విగ్రహాలను సభా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ప్రముఖ సినీ రచయిత తనికెళ్ల భరణి, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, నన్నయ్య యూనివర్సిటీ వీసీ లక్ష్మీప్రసన్న, కిమ్స్ ఎండీ రవికిరణ్‌వర్మ, గైట్ ఎండీ శశికిరణ్‌వర్మ తదితర ప్రముఖులను దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.



ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రసంగిస్తున్న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



హాజరైన తనికెళ్ల భరణి, మండలి బుద్ధప్రసాద్ తదితరులు

బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ టీకా

● ప్రారంభమైన ఉచిత వ్యాక్సినేషన్

● క్యాన్సర్ నివారణలో.. కీలకమంటున్న వైద్యులు

● పేద పిల్లలకు ఎంతో ఉపయోగం

సత్తెనపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్య రక్షణలో నూతన అధ్యాయానికి కేంద్ర ప్రభుత్వం తెర లేపింది. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం దేశ వ్యాప్తంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి కమ్యూనిటీ వైద్యశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● ఉచితంగా టీకా

ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో టీకా ఉచితంగా లభిస్తుంది. టీకా తీసుకొనే ప్రతి బాలిక వివరాలను డిజిటల్ రికార్డుల్లో నమోదు చేస్తారు. టీకా అనంతరం వారికి డిజిటల సర్టిఫికెట్ ఇస్తారు. టీకా తరువాత వారికి వైద్య పర్యవేక్షణ కూడా ఉంటుంది. ఈ టీకా పూర్తిగా స్వచ్ఛందం. బాలికలకు టీకా వేయటానికి ముందు తల్లిదండ్రుల రాతపూర్వక అనుమతి, ఓటీపీ తప్పనిసరి. ప్రధానంగా 14 సంవత్సరాలు వయస్సు కలిగిన బాలికలందరికీ ఈ టీకా ఉచితంగా అందిస్తారు. 14 సంవత్సరాలు పూర్తయిన బాలికలకు కేవలం ఒక్క డోసు టీకా మాత్రమే ఇస్తారని, ఇది జీవితాంతం రక్షణ కల్పిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. నాలుగు రకాల క్యాన్సర్లకు ఈ టీకాతో చెక్ పడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. 0.5 ఎంఎల్‌ను ఇంజక్షన్ రూపంలో సింగల్ డోస్‌గా ఇవ్వనున్నారు. ఈ డోస్ బహిరంగ మార్కెట్‌లో రూ 3,927గా ఉంది.

● క్యాన్సర్ నివారణకు కీలకం

భారతదేశంలో మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ అత్యంత ప్రమాదకర మైనదిగా పరిగణించ బడుతుంది. దీనిని వ్యాక్సిన్ ద్వారా పూర్తిగా నివారించ వచ్చని వైద్య నిపుణులు చెపుతున్నారు. ప్రభుత్వాల నిర్ణయం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్య భద్రత కల్పించటమే కాకుండా క్యాన్సర్ రహి త సమాజ స్థాప నకు ఇది పు నాది కా నుంది.



పేదలకు మేలు

సర్వైకల్ క్యాన్సర్‌పై కొందరిలో అవగాహన ఉంది. ఇప్పటికే పల్నాడు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు క్యాన్సర్లపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చాం. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ధర ఖరీదైనది కావటంతో పేదలు వెనకడుగు వేస్తున్నారు. 15 సంవత్సరాలలోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న టీకాను రెండు డోసుల్లో తీసుకోవాలి. ఈ పరిస్థితుల్లో వ్యాక్సిన్ ఉచితంగా ఇవ్వనుండటం పేద వర్గాలకు మేలు చేస్తుంది.

- డాక్టర్ బండ్ల భాగ్యలక్ష్మి, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

రేషన్ డోర్ డెలివ్రరీ..!

● వృద్ధులకు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలన్న ఆదేశాలు బేఖాతరు

● పదే పదే జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ

● అమలు చేయని చౌకధరల దుకాణాల డీలర్లు

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల డోర్ డెలివరీ జిల్లాలో ఏమాత్రం అమలు జరగడం లేదు. 65 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు ఇవ్వాలన్న నిబంధనలను చాలామంది డీలర్లు తుంగలోకి తొక్కుతున్నారు. వృద్ధులనే షాపుల వద్దకు వచ్చి సరుకులు తీసుకెళ్లమంటున్నారు. ఒకవేళ తీసుకెళ్లలేకపోతే వేలిముద్ర వేసి సరుకులకు బదులుగా నగదు తీసుకెళ్లమని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రేషన్ సరుకుల పంపిణీ తీరుపై ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా కార్డుదారులకు ఫోన్లు చేసి వారి స్పందన తెలుసుకుంటుండగా, అందులో గుంటూరు జిల్లా ప్రజల నుంచి ఏమాత్రం సానుకూల స్పందన రావడం లేదు.

● కొన్ని నెలల క్రితమే కార్యక్రమం

వృద్ధులు, దివ్యాంగులు రేషన్ సరుకులు తీసుకెళ్లడంలో ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాన్ని కొన్ని నెలల క్రితమే తీసుకొచ్చింది. మార్చి నెలలో పంపిణీ చేసే సరుకులను ఫిబ్రవరి 26వ తేదీ నుంచే వారు తీసుకునేలా ఈ-పోస్ సిస్టమ్‌లో మార్పులు కూడా చేసింది. ఈ నిబంధన ప్రకారం రేషన్ డీలర్లు ఐదు రోజుల పాటు ఎవరైతే 65 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు, దివ్యాంగులున్నారో వారి చిరునామాలకు సరుకులు తీసుకెళ్లి ఇంటి వద్దనే పంపిణీ చేయాలి. అయితే ఈ ప్రక్రియ జిల్లాలో ఏమాత్రం అమలు జరగడం లేదు. డీలర్లు షాపులు తెరిచి అక్కడికే రమ్మంటున్నారు. కొందరైతే షాపులు అరకొరగా తీస్తున్నారు. ఈ కారణంగా 30 శాతం మందికి పైగా వినియోగదారులు గుంటూరు జిల్లా పనితీరుపై నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు.

● నగదు ఇవ్వొద్దని జేసీ ఆదేశం

గతంలో నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలోనూ సానుకూల స్పందన రాలేదు. కాగా ప్రజలకు సరుకులు మాత్రమే పంపిణీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో నగదు ఇవ్వరాదన్న జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశాలు కూడా అమలుకు నోచుకోవడం లేదు. అలానే రేషన్ షాపుల వద్ద సీసీ టీవీల నిఘా ఏర్పాటు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చేసిన విజ్ఞప్తి కూడా ఆచరణలోకి రాలేదు. షాపుల్లో తనిఖీలు అరకొరగానే జరుగుతుండటంతో డీలర్లకు భయం అనేదే లేకుండా పోయింది. జిల్లాలో 972 రేషన్ దుకాణాలున్నాయి. వీటిల్లో 5,95,404 కార్డులున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉండే సీసీ టీవీలను అనుసంధానం చేసుకొంటే రేషన్ సరుకుల దారి మళ్లింపు ఎక్కడ జరుగుతుందనేది సులభతంగానే తెలిసిపోతుంది.



తెలుగు తేజం

ప్రపంచంలో అతి శక్తిమంతమైన సాఫ్ట్‌వేర్ లినక్స్. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లు, ఏటీఎంలు, 'అంతరిక్ష నౌకలు, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, డేటా సెంటర్లు, ప్రపంచవ్యాప్తంగా సూపర్ కంప్యూటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ... ఇవన్నీ లినక్స్ ఆధారంగా పని చేస్తాయి. ఈ అద్భుతమైన ఓపెన్ సాఫ్ట్‌వేర్ రూపకల్పన, నిర్వహణలో 'లినక్స్ ఫౌండేషన్ ఫెలో'గా తెలుగు మహిళ షువాఖాన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగానూ ఆమె చరిత్రకెక్కారు. అపూర్వమైన షువాఖాన్ ప్రయాణం గురించి 'నవ్య' ప్రత్యేక కథనం ఇది.

షువాఖాన్ స్వస్థలం ఒంగోలు. ఆమె తండ్రి ప్రభుత్వ పశువైద్యాధికారి కావడంతో... షువాఖాన్ చదువు రాష్ట్రంలోని పలుచోట్ల సాగింది. మారుమూల పల్లెల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో, బాపట్ల ఏబీఎం, సరస్వతీ మెమోరియల్ పాఠశాలల్లో చదువుకున్నారు. మోదుకూరులో పదోతరగతి పూర్తి చేశారు. గుంటూరు మహిళా కళాశాలలో ఇంటర్ చదివారు. ఆంధ్రా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ అందుకున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకొని ఎదిగానని ఆమె సగర్వంగా చెప్పుకుంటారు. భారత్‌లో కొన్నేళ్ళు పని చేసిన తరువాత... 1988లో అమెరికాలోని కొలరాడో స్టేట్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్సులో మాస్టర్స్ పూర్తి చేశారు. బే ఏరియాలో తొలి ఉద్యోగం అనంతరం 'లూసెంట్ ఏటీ అండ్ టీ బెల్ ల్యాబ్స్'లో పని చేశాక... హ్యూలెట్ ప్యాకర్డ్ (హెచ్‌పి)లో పదమూడేళ్ళు సేవలు అందించారు. ఆ సమయంలోనే లినక్స్‌తో ఆమెకు ప్రత్యక్ష అనుబంధం ఏర్పడింది. హెచ్‌పీ హార్డ్‌వేర్‌ను లినక్స్‌తో అనుసంధానించే ప్రాజెక్టులో లినక్స్ డెవలపర్లకు నేరుగా సహకరించే అవకాశం వచ్చింది. 2007లో ఓపెన్ సోర్స్ రంగంలో అడుగుపెట్టారు. 2011 నుంచి స్వతంత్ర లినక్స్ కంట్రిబ్యూటర్‌గా మారారు. తరువాత అయిదేళ్ళు శాంసంగ్‌లో పని చేశారు. లినక్స్ ఫౌండేషన్ సాంకేతిక సలహాదారుల మండలి చొరవతో ప్రారంభించిన 'కె-సెల్ఫ్‌టెస్ట్' నిర్వాహకురాలుగా... 2014లో ఆ ఫౌండేషన్ సభ్యురాలుగా చేరారు.

> **ఆత్మసంతృప్తే నిజమైన విజయం**
>
> సమాజం ఆశించేది చేయడం కోసం పరుగులు పెట్టకండి. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోండి. మీ కలలను తెలుసుకోండి. మీ బలాలు, బలహీనతలు గుర్తించండి. మీకు ఆనందాన్ని ఇచ్చే పనిని ఎంచుకోండి. ఆత్మ సంతృప్తి లేకపోతే ఏ విజయమూ నిలవదు.
>
> - షువాఖాన్

ఏమిటీ లినక్స్ ఫౌండేషన్?

లినక్స్‌ను నడిపించే లినక్స్ కెర్నెల్ నిర్వహణ సున్నితమైన, భద్రతాపరమైన అంశాలతో ముడిపడి ఉంది. కెర్నెల్ కోడ్‌లో చిన్న పొరపాటు పెనుముప్పునకు దారి తీసే ప్రమాదం ఉంటుంది. కాబట్టి దాని నిర్వహణ, భద్రత కేవలం ముగ్గురి చేతుల్లో మాత్రమే ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డెవలపర్లతో పాటు... తమ వాణిజ్య ప్రయోజనాలకి సంబంధించిన అవసరాల మేరకు కంపెనీలు సమర్పించే కెర్నెల్ కోడ్ అప్‌డేట్స్‌ను సమీక్షించడంతోపాటు... లినక్స్‌పై ఆధారపడే వారందరికీ లబ్ధి చేకూర్చే కార్యక్రమాలను ఈ త్రిసభ్య బృందం పర్యవేక్షిస్తుంది. ఈ బృందానికి జీతభత్యాలు, చట్టపరమైన రక్షణ అందించే నిమిత్తం 'లినక్స్ ఫౌండేషన్' ఏర్పడింది. ఈ త్రిసభ్య బృందాన్ని 'లినక్స్ ఫౌండేషన్ ఫెలో'లుగా పిలుస్తారు. లినక్స్ నుంచి లబ్ధి పొందే దిగ్గజ సంస్థలు ఈ ఫౌండేషన్‌లో సభ్యులుగా చేరి... కెర్నెల్ అభివృద్ధికి ఆర్థిక, సాంకేతిక సహకారం అందించడంతో పాటు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయి. తద్వారా 'లినక్స్ కెర్నెల్'పై గుత్తాధిపత్యానికి తావులేకుండా... కేవలం దాని అభివృద్ధిని, భద్రతను సమీక్షించే వనరులను మాత్రమే కల్పిస్తారు. అంటే కెర్నెల్ డెవలపర్లకు, కార్పొరేట్ సంస్థలకు మధ్యవర్తిగా లినక్స్ ఫౌండేషన్ వ్యవహరిస్తుంది. అయినప్పటికీ కెర్నెల్ వ్యవహారాల్లో ఈ ఫౌండేషన్ జోక్యం చేసుకోదు. లినక్స్ ఫౌండేషన్ ఫెలో.... ఓపెన్-సోర్స్ ప్రపంచంలో లభించే అత్యున్నత గౌరవం. ఓపెన్ సోర్స్ కమ్యూనిటీలో దీర్ఘకాలంగా సేవలందించడం., విలువైన సాఫ్ట్‌వేర్ కోడ్ అందించడం, నాయకత్వం లాంటి వాటికి గుర్తింపుగా ఈ సభ్యత్వం లభిస్తుంది. 1991లో మొదలైన లినక్స్ ప్రయాణంలో ఇప్పటి వరకూ కేవలం ముగ్గురు వ్యక్తులు మాత్రమే ఈ ఫెలో హోదా పొందారంటేనే దాని ప్రాముఖ్యత ఏమిటో అర్థమవుతుంది. ఆ ముగ్గురు 'లినక్స్ ఫౌండేషన్' ద్వారా నేరుగా 'లినక్స్ కెర్నెల్' అభివృద్ధికి పూర్తి సమయం కృషి చేస్తున్నారు. లినక్స్ ఫౌండేషన్ ఫెలో అయిన తొలి మహిళగా షువాఖాన్ ఘనత సాధించారు.

సాంకేతిక న్యాయమూర్తి లాంటి పాత్ర...

షువాఖాన్ 2019 నుంచి .లినక్స్ ఫౌండేషన్ ఫెలో'గా లినక్స్ కెర్నెల్ నాణ్యతను కాపాడే బాధ్యత నిర్వహిస్తున్నారు. లినక్స్ కెర్నెల్ మెయింటెయినర్‌గా వ్యవహరిస్తూ... లినక్స్ సెల్ఫ్‌టెస్ట్ ఫ్రేమ్ వర్క్, క్లౌడ్ కంప్యూటింగ్‌లో విస్తారంగా ఉపయోగపడే యూఎస్బీ ఓవర్ ఐపీ డ్రైవర్ లాంటి సబ్ సిస్టమ్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. డెవలపర్లు తమ మార్పు వల్ల కెర్నెల్‌కు ఎలాంటి నష్టం జరగదని నిర్ధారించుకోవడానికి వీలు కల్పించే కె-సెల్ఫ్‌టెస్ట్ రూపొందించడంలో, ఆండ్రాయిడ్ డ్రైవర్లను మెయిన్ లైన్ లినక్స్‌లో విలీనం చేసే ప్రయత్నాల్లో ఆమె కీలక పాత్ర పోషించారు. వీటి ఆధారంగా, ఓపెన్ సోర్స్ కమ్యూనిటీలో సేవల ఆధారంగా ఆమెను 'లినక్స్ ఫౌండేషన్ ఫెలో'గా ఎంపిక చేశారు. "రోజువారీ పనిలో భాగంగా... డెవలపర్లు రాసిన కోడ్‌ను సమీక్షిస్తాను. అది అప్పటికే ఉన్న సిస్టమ్‌తో సరిగ్గా కలుస్తుందా? దానివల్ల కెర్నెల్ పాడవుతుందా? నాణ్యతా ప్రమాణాలకు అది అనుగుణంగా ఉందా? లాంటి అంశాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటాను. ఇది ఒక సాంకేతిక న్యాయమూర్తి లాంటి పాత్ర" అంటారు షువాఖాన్. యువ డెవలపర్లను తీర్చిదిద్దడంలోనూ ఆమె శ్రద్ధ వహిస్తున్నారు. 'లినక్స్ ఫౌండేషన్ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్'ను స్థాపించి, నాయకత్వం వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా వందలాదిమంది కొత్త డెవలపర్లను కెర్నెల్ అభివృద్ధిలోకి తీసుకువస్తున్నారు. ఈ ప్రోగ్రాంలో రిమోట్‌గా పాల్గొనే అవకాశం ఉంది. స్టైఫండ్ కూడా ఇస్తారు. మహిళలు కెర్నెల్ కమ్యూనిటీలో మరింత కీలకంగా వ్యవహరించేలా షువా చొరవ తీసుకుంటున్నారు.



కొరవడుతున్న ఆలోచన, అవగాహన

మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌లో తన అనుభవాల గురించి ఆమె మాట్లాడుతూ "కొందరు విద్యార్థులు కృత్రిమ మేధ ద్వారా తయారు చేసిన కోడ్‌ను సమర్పిస్తున్నారు. కానీ కోడ్ సమీక్ష సమయంలో దాని వెనుక ఉన్న అసలైన ఆలోచన, అవగాహన విద్యార్థుల్లో కొరవడుతున్నాయి. అందుకే ముందుగా మౌలిక అంశాలను లోతుగా అధ్యయనం చేశాక... అవసరమైన సాంకేతిక సహాయాన్ని వినియోగించాలి. సాఫ్ట్‌వేర్ రంగంలో తార్కిక, సృజనాత్మక అంశాలు రెండూ కలిసి ఉంటాయి. ఓపెన్ సోర్స్ రంగం నాకు స్వేచ్ఛ ఇచ్చింది. కార్పొరేట్ సంస్థల్లో వారి వాణిజ్య అవసరాలకు అనుగుణంగా పని చేయాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం ప్రపంచవ్యాప్తంగా ఉన్న డెవలపర్లతో సమన్వయం చెయ్యడం, వారికి సహకరించడం, మెంటార్‌గా పని చెయ్యడం లాంటి అంశాలు నన్ను ముందుకు నడిపిస్తున్నాయి" అని చెబుతున్నారు షువాఖాన్. సాంకేతికంగా కఠినమైన లినక్స్ కెర్నెల్ లాంటి రంగంలో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువ. అక్కడ నుంచి గవర్నెన్స్ స్థాయికి ఎదగడం, ఓపెన్ సోర్స్ విలువలను కాపాడే ప్రయత్నం చేయడం, గ్లోబల్ టెక్ గవర్నెన్స్‌లో కీలక పాత్ర పోషించడం లాంటివి షువాఖాన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చాయి.

• **కిలారు గోకుల్‌కృష్ణ**, డాలస్, అమెరికా

ఏఐ... మంత్రదండం కాదు

ఓపెన్ సోర్స్ లేకుండా కృత్రిమ మేధ (ఏఐ) లేదు. ఎన్విడియా లాంటి సంస్థలు ఓపెన్ సోర్స్‌పై ఆధారపడి ఏఐ వ్యవస్థలు నిర్మిస్తున్నాయి. కానీ ఏఐని నడిపే మోడల్స్ (ఎల్ఎల్ఎంలు) కొందరి గుప్పిట్లోనే ఉండడం ఆందోళనకరం. వాటిని ఓపెన్ సోర్స్‌గా మార్చే ప్రయత్నాలు ముమ్మరంగా చేయాల్సిన అవసరం ఉంది. పదేళ్ళ క్రితమే లినక్స్ కమ్యూనిటీ ఏఐ ద్వారా స్వయంచాలితంగా కెర్నెల్ సమస్యలు గుర్తించే పద్ధతులు ప్రయోగించింది. ఏఐ అనేది మంత్రదండం కాదు. సమీకృత సహకారం లేకుండా ఏదీ సాధించలేరు. ఏఐ మోడల్స్‌లో నిష్పాక్షికతకు పెద్దపీట వేయాలి. అది సాధించే సత్తా కేవలం ఓపెన్ సోర్స్‌కు మాత్రమే ఉంది. నా కోడ్ రివ్యూలలో ఏఐని వినియోగించడం లేదు. ఏదిఏమైనా ఏఐ ఫలాలు అందరికీ అందుబాటులోకి రావాలి.

- షువాఖాన్



రాత్రికి రాత్రే అందం

కంటి నిండా నిద్ర చర్మ ఆరోగ్యాన్ని ఇనుమడింపచేస్తుంది. కాబట్టే అలాంటి నిద్రను 'బ్యూటీ స్లీప్'గా పరిగణిస్తూ ఉంటారు. అయితే ఈ నిద్రతో రెట్టింపు ఫలితం పొందాలంటే కొన్ని సౌందర్య చిట్కాలు కూడా ట్రై చేస్తూ ఉండాలి. అవేంటంటే...

- **యాంటిఆక్సిడెంట్ ఫేస్ క్రీమ్:** పగలంతా కాలుష్యం, భిన్నమైన వాతావరణాలతో పోరాడి అలసిపోయిన చర్మం రాత్రి వేళ విశ్రాంతి తీసుకుంటుంది. చర్మ చికిత్సకు ఇదే సరైన సమయం. చర్మ సంరక్షణ కోసం ఉపయోగించే విటమిన్ సి, రెటినాల్ మొదలైన బ్రైటెనింగ్ ఏజెంట్స్ కలిగిన క్రీమ్స్‌తో రాత్రివేళ రెట్టింపు ఫలితం పొందవచ్చు. ఇందుకోసం యాంటిఆక్సిడెంట్స్ ఉన్న నైట్ క్రీమ్ అప్లై చేయాలి. ఇవి చర్మపు వయసుని పెంచే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ఫలితంగా పగటివేళ ఇలాంటి వాటికి బహిర్గతమవడం వల్ల పాడైన చర్మం రాత్రివేళ జీవం పుంజుకుంటుంది
- **కళ్ల కింద వాపు:** రాత్రి బాగానే ఉన్న కళ్లు ఉదయం లేవగానే ఉబ్బిపోతున్నాయా? కళ్ల కింద ఇలాంటి ఉబ్బు రాకుండా ఉండాలంటే రాత్రి తలకింద రెండు దిండ్లు పెట్టుకుని పడుకోవాలి. ఇలా చేయటం వల్ల కళ్ల కింద పేరుకున్న ద్రవాలు డ్రెయిన్ అయిపోతాయి. ఈ చిట్కాతో పాటు కెఫీన్ కలిగిన ఐక్రీమ్స్ అప్లై చేయాలి
- **హెయిర్ మాయిశ్చరైజర్:** జుట్టు పట్టుకుచ్చులా తయారవ్వాలంటే రాత్రివేళ వెంట్రుకలకు లీవిన్ కండిషనర్ అప్లై చేయాలి. అలా అప్లై చేసుకుని పడుకోవటం వల్ల కండిషనర్ వెంట్రుకల కుదుళ్లలోకి చొరబడే సమయం ఉంటుంది కాబట్టి ఉదయానికల్లా వెంట్రుకలు సిల్కీగా తయారవుతాయి. రాత్రివేళ కొబ్బరినూనెతో మసాజ్ చేసుకుని ఉదయాన్నే తలస్నానం చేసినా ఇదే ఫలితం దక్కుతుంది
- **తడి జుట్టును టవల్‌తో చుట్టేయాలి:** రాత్రివేళ తలస్నానం చేసే అలవాటుంటే జుట్టును అలాగే వదిలేసి పడుకోకూడదు. తడి వెంట్రుకలు తేలికగా తెగుతాయి. అలాగే నిద్రపోతే దిండుకు ఒరుసుకుని వెంట్రుకలు చిట్లిపోయే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి రాత్రివేళ తలస్నానం చేస్తే టవల్‌తో చుట్టి పడుకోవాలి. ఇలా చేస్తే తడిని టవల్ పీల్చేసుకుంటుంది. టవల్‌లో చుట్టడం వల్ల ఉదయానికల్లా వెంట్రుకలు వంకీలు కూడా తిరుగుతాయి
- **చేతులు, పాదాలు మృదువుగా:** పగిలిన పాదాలు, బిరుసెక్కిన చేతులను సరిచేయటానికి రాత్రివేళే అనువైన సమయం. వాజెలీన్ లేదా కొబ్బరి నూనెను చేతులకు, పాదాలకు అప్లై చేసి గ్లోవ్స్, సాక్స్ వేసుకుని పడుకుంటే ఉదయానికల్లా మృదువుగా తయారవుతాయి. గ్లోవ్స్, సాక్స్ వేసుకుని పడుకోవటం మొదట్లో కాస్త అసౌకర్యంగా అనిపించినా కొద్ది రోజులకు అలవాటైపోతుంది
- **విటమిన్ ఇ:** చర్మం ముడతలు తగ్గి నునుపుగా మారడం కోసం విటమిన్ ఇ నూనె ముఖానికి అప్లై చేసుకోవచ్చు. అయితే పగటి వేళకు బదులుగా రాత్రి వేళ ఈ పని చేస్తే రెట్టింపు ఫలితం దక్కుతుంది
- **ఆహారం:** రాత్రి భోజనంలో తినే పదార్థాలు కూడా చర్మం మీద ప్రభావాన్ని కనబరుస్తాయి. కాబట్టి రాత్రివేళ తినే ఆహారంలో నూనె, మసాలాలు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే తీపి పదార్థాలకు రాత్రి డిన్నర్‌లో చోటు కల్పించకూడదు. అలాగే వీలైనంత పెందలాడే డిన్నర్ ముగించాలి. నిద్రకు కనీసం రెండు నుంచి మూడు గంటల ముందే రోజులో చివరి భోజనం ముగించాలి.



బాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థల్లో, అగ్రశ్రేణి దర్శకుల దగ్గర పని చేసిన అనుభవం లక్ష్మీప్రియాదేవిది. ప్రయత్నిస్తే పెద్ద స్టార్లు, నిర్మాతల నుంచి దర్శకురాలుగా అవకాశం పొందడం కష్టం కాదు. కానీ తను పుట్టిన నేలను సంక్షుభితం చేస్తున్న కల్లోలాన్ని, అగమ్యంగా మారిన పిల్లల భవిష్యత్తును తెరపై చూపాలనుకున్నారు. అలా తెరకెక్కిన మణిపురీ చిత్రం 'బూంగ్'... బ్రిటిష్ అకాడమీ (బాఫ్టా) పురస్కారాన్ని గెలుచుకున్న తొలి భారతీయ చిత్రంగా చరిత్రకెక్కింది.

పుట్టిన నేల ఆకాంక్షలకు అద్దం పడుతూ...



'లక్ష్య', 'తలాష్', 'రంగ్ దే బసంతి', 'పికె' లాంటి లాంటి పలు చిత్రాలకు ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా... రాజ్‌కుమార్ హిరానీ, ఫర్హాన్ అక్తర్, మీరానాయర్ లాంటి దర్శకులు, ఆమిర్‌ఖాన్ తదితర స్టార్లతో కలిసి పని చేసినప్పటికీ వాణిజ్య చిత్రాలు తీయాలని తాను ఎప్పుడూ కోరుకోలేదంటారు లక్ష్మీప్రియా దేవి. రచనలు చేయడం ఆమెకు ఇష్టం. తన సృజనాత్మకతను ప్రదర్శించడానికి, మరింత పదునుపెట్టుకోవడానికి బాలీవుడ్‌ను వేదికగా ఎంచుకున్నారు.

కోవిడ్‌తో బ్రేక్...

ఇరవయ్యేళ్ళ క్రితం బాలీవుడ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా అడుగుపెట్టిన లక్ష్మీప్రియ పలు చిత్రాలకు పని చేశారు. అయితే మణిపూర్‌లో తీవ్రమవుతున్న సంక్షోభం ఆమె ఆలోచనల్లో ఎప్పుడూ మెదులుతూ ఉండేది. ఆ క్రమంలోనే ఒక కథ రాసుకున్నారు. దానికి తనే దర్శకత్వం చేద్దామనుకున్నారు. "అది 2018. కొద్దికాలం మా నాన్న, అత్తయ్య సంరక్షణ చూసుకోవాల్సి వచ్చింది. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నాను. ఆ సమయంలో ఆ కథకు మెరుగులు దిద్దాను. స్క్రిప్ట్ పూర్తయిపోయింది. కానీ అంతలోనే కోవిడ్ రావడంతో... సినిమాకు బ్రేక్ పడింది. పరిస్థితులు చక్కబడ్డాక స్క్రిప్ట్‌ను నా స్నేహితుడు వికేష్ భూటానికి పంపాను. మర్నాడు అతను ఫోన్ చేసి "ఈ సినిమాను నేను నిర్మించవచ్చా?" అని అడిగారు. ఆ తరువాత అతని ద్వారా మరికొందరు కూడా నిర్మాణంలో భాగస్వాములు కావడానికి ముందుకు వచ్చారు. అయితే దాన్ని మణిపురి భాషలో తీయాలనుకుంటున్నానని చెప్పినపుడు... నా శ్రేయోభిలాషులు చాలామంది నిరుత్సాహపరిచారు. "బాలీవుడ్‌లో నువ్వు పని చేస్తున్నావు. మంచి పరిచయాలు ఉన్నాయి. హిందీలోనే తియ్యొచ్చు కదా!" అన్నారు. "నా కథలోని పాత్రలన్నీ మణిపూర్ ప్రాంతానివి. అవి అక్కడే ఉండాలి. ఆ భాషే మాట్లాడాలి. కాబట్టి మణిపురీలోనే తియ్యాలి" అని చెప్పాను. దర్శకురాలిగా నా మొదటి సినిమా 'బూంగ్' అలా మొదలైంది" అని చెప్పారు లక్ష్మీపియ.

అది కష్టం అనిపించింది...

చిన్న యూనిట్‌తో, 38 రోజుల్లో, తక్కువ ఖర్చుతో బూంగ్ చిత్రీకరణను పూర్తి చేసుకుంది. "ఈ సినిమా తీస్తున్నప్పుడు పిల్లలతో నటింపజెయ్యడం కష్టంగా అనిపించింది. కానీ నాకు నచ్చిన విషయం కూడా అదే. వారు స్వచ్ఛంగా, అమాయకంగా ఉంటారు. వాళ్ళ ప్రశ్నల్లో నిజాయితీ ఉంటుంది. వారు లేకపోతే ఈ సినిమా ఇంత బాగా వచ్చేది కాదు" అంటారు లక్ష్మీప్రియ. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర బూంగ్ అనే చిన్న పిల్లాడిది. అతని తండ్రి ఉపాధి కోసం వేరే చోటుకు వెళ్తాడు. కొన్నేళ్ళు గడిచినా అతని జాడ ఆ కుటుంబానికి తెలియదు. భర్త ఏమయ్యాడోనని బూంగ్ తల్లి బాధపడుతూ ఉంటుంది. తండ్రిని వెతకడానికి బూంగ్, అతనికి సాయంగా ఒక స్నేహితుడు బయలుదేరుతారు. ఈ ప్రయాణంలో వారికి ఎదురైన అనుభవాలను మణిపూర్ కల్లోలం నేపథ్యంలో లక్ష్మీప్రియ ఆవిష్కరించారు. 'బూంగ్' సినిమా మన దేశంతోపాటు వివిధ దేశాల్లో పురస్కారాలు అందుకుంది. 2024లో 'టొరంటో ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివల్'లో విమర్శకులు బూంగ్‌ను అభినందనలతో ముంచెత్తారు. ఇటీవల 'బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్ - (బాఫ్టా) 2026' పురస్కారాన్ని 'ఉత్తమ బాలల-కుటుంబ చిత్రం' విభాగంలో 'బూంగ్' గెలుచుకుంది. ఒక భారతీయ చిత్రానికి ఈ పురస్కారం లభించడం ఇదే మొదటిసారి. ప్రధాని నరేంద్ర మోదీ, ఎంతోమంది సినీ ప్రముఖులు ఈ చిత్రయూనిట్‌కు అభినందనలు తెలిపారు. "ఈ అవార్డు నాకు మరువలేని మధురానుభూతి. చిన్న స్థాయిలో తీసిన ఈ సినిమాను ఇంత ఘనమైన గౌరవం దక్కడం సంతోషంగా ఉంది. నా మాతృభూమి మణిపూర్‌లో మళ్ళీ శాంతి నెలకొనాలని, మా సినిమాలో నటించిన బాలలతో పాటు మణిపూర్‌లోని పిల్లలందరూ సంతోషాన్ని తిరిగి పొందాలని, తమ కలలు నెరవేర్చుకోవాలని కోరుకుంటున్నాను" అంటూ స్పందించిన అంటున్న లక్ష్మీప్రియ చిత్రం... తమ ప్రాంతంలో శాంతి నెలకొనాలనే ఎందరో మణిపురి ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం.

> **అవే ఆసక్తిని పెంచాయి...**
>
> మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో పుట్టిన లక్ష్మీప్రియ... ఆ ఈశాన్య రాష్ట్రం సామాజికంగా, రాజకీయంగా ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను చూస్తూ పెరిగారు. "సుదీర్ఘమైన అనిశ్చితి, అశాంతి, మానవత్వానికి ఎదురవుతున్న సవాళ్ళు ప్రపంచాన్ని నేను చూసే తీరును ప్రభావితం చేశాయి. ఆలోచనాపరురాలుగా, రచయిత్రిగా నన్ను తీర్చిదిద్దాయి" అని ఆమె చెబుతారు. పదేళ్ళ వయసులో ఆమె మకాం మణిపూర్ నుంచి ఢిల్లీలోని ఒక బోర్డింగ్ స్కూల్‌కు మారింది. అక్కడే గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాక... ముంబాయి చేరుకున్నారు. "మా తాతయ్య (అమ్మ తండ్రి) రాజవంశానికి చెందినవారయినప్పటికీ సామ్యవాది. అప్పట్లో మణిపూర్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో సినిమా థియేటర్లు పెద్దగా లేవు. తాతయ్య ఒక వ్యాన్‌లో ప్రొజెక్టర్‌ను తీసుకువెళ్ళి, వీధుల్లో దుప్పట్లు కట్టి సినిమాలు ప్రదర్శించేవారు. నేను చదువుకొనే సమయంలో విహెచ్ఎఫ్ టేప్‌లు ఉండేవి. వాటిని నేను, నా ఫ్రెండ్స్ కలిసి చూసేవాళ్ళం. అలాగే మా బామ్మ ఎన్నో కథలు చెప్పేది. నాలో సినిమాలంటే ఆసక్తి పెరగడానికి ఇవన్నీ దోహదం చేశాయి" అని గుర్తుచేసుకుంటారు లక్ష్మీప్రియ.

మెరిసే చర్మం కోసం

అందంగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? కానీ కెమికల్స్ ఉన్న క్రీములు వాడి చర్మాన్ని పాడుచేసుకోవడం కంటే మన వంటింట్లో దొరికే వస్తువులతో 'న్యాచురల్ గ్లో' పొందవచ్చు.



ముఖంపై మెరుపు కోసం: పాలు, శనగపిండి, చిటికెడు పసుపు కలిపి ఫేస్‌ప్యాక్ వేసుకోండి. ఇది చర్మంపై ఉన్న మృతకణాలను తొలగించి ముఖాన్ని కాంతివంతంగా మారుస్తుంది. జిడ్డు చర్మం ఉన్నవారు శనగపిండిలో పెరుగు కలిపి వాడవచ్చు.

కళ్ల కింద నలుపు: కంప్యూటర్ల ముందు ఎక్కువసేపు గడపడం వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు వస్తాయి. దీనికి బంగాళదుంప రసం లేదా దోసకాయ ముక్కలను కళ్లపై 15 నిమిషాలపాటు ఉంచుకుంటే ఉపశమనం లభిస్తుంది. రాత్రి పడుకునే ముందు కలబంద జెల్ రాసుకుంటే కళ్లు తాజాగా కనిపిస్తాయి.

మృదువైన పెదవులు: పెదవులు నల్లబడకుండా, పగలకుండా ఉండాలంటే రోజూ రాత్రి పడుకునే ముందు కొద్దిగా నెయ్యి లేదా తేనె రాయండి. వారానికి ఒకసారి పంచదారతో మెల్లిగా స్క్రబ్ చేస్తే పెదవులు గులాబీ రంగులోకి మారతాయి. గుర్తుంచుకోండి, రోజుకు కనీసం 8 గంటల నిద్ర, 3 లీటర్ల నీరు తాగడం వల్ల కలిగే గ్లో ఏ క్రీములూ ఇవ్వలేవు.

మీ ఆరోగ్యం.. మీ గుప్పిట్లో

వేసవి కాలం వచ్చిందంటే చాలు చెమటలు కారడం, నీరసం, వడదెబ్బ భయం మొదలవుతుంది. ఈ ఎండల నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి కొన్ని జాగ్రత్తలు అవసరం.

నీరే ఔషధం: దాహం వేసినా, వేయకపోయినా గంటకోసారి గ్లాసు నీళ్లు తాగడం అలవాటు చేసుకోండి. ఫ్రిజ్ నీరు కంటే కుండలో నీరు తాగడం వల్ల గొంతు సమస్యలు రావు. పైగా శరీరానికి చల్లదనం లభిస్తుంది. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, రాగి అంబలి వంటివి శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ సమతుల్యతను కాపాడతాయి.



ఆహారం: వేసవిలో మసాలాలు, వేపుళ్లు తగ్గించి ఆకు కూరలు, కూరగాయలకు ప్రాధాన్యం ఇవ్వండి. ముఖ్యంగా పుచ్చకాయ, దోసకాయ, తాటి ముంజలు వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను డైట్‌లో చేర్చుకోండి. ఇవి డీహైడ్రేషన్ నుంచి కాపాడతాయి.

బయటకు వెళ్లేటప్పుడు: మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్య బయటకు వెళ్లకపోవడం ఉత్తమం. తప్పనిసరి అయితే గొడుగు, టోపీ లేదా స్కార్ఫ్ ధరించండి. వదులైన కాటన్ దుస్తులు ధరించడం వల్ల గాలి తగిలి చర్మ వ్యాధులు రాకుండా ఉంటాయి. కళ్లకు రక్షణగా సన్ గ్లాసెస్ ధరించడం మర్చిపోవద్దు.



స్మార్ట్ హౌస్ కీపింగ్

ప్రతి ఇల్లు ఒక దేవాలయం వంటిదే. అలాంటి ఇల్లు ఎప్పుడూ శుభ్రంగా కళకళలాడుతూ ఉండాలంటే గృహిణికి కాస్త స్మార్ట్ ఆలోచనలు ఉండాలి. రోజూ కష్టపడి పనిచేయడం కంటే చిన్నచిన్న ట్రిక్స్‌తో ఇంటిని మెరిపించడం ఎలాగో చూద్దాం.

అద్దాల మెరుపు కోసం: మన ఇంట్లో ఉండే అద్దాలు లేదా కిటికీ గ్లాసులపై వేలి ముద్రలు, నీటి మరకలు పడి చూడటానికి ఇబ్బందిగా ఉంటాయి. మార్కెట్లో దొరికే కెమికల్స్ కంటే ఇంట్లోనే దొరికే వార్తా పత్రిక ఇందుకు అద్భుతంగా పనిచేస్తుంది. అద్దంపై కొద్దిగా నీళ్లు చల్లి పేపర్‌ను ఉండలా చుట్టి అద్దాన్ని తుడవండి. పత్రికలోని సిరా జిడ్డును పీల్చుకుని అద్దం కొత్త దానిలా మెరిసేలా చేస్తుంది.

చీమల బెడదకు చెక్: వంటగదిలో లేదా డైనింగ్ టేబుల్ దగ్గర చీమలు పెద్ద సమస్యగా మారుతుంటాయి. వీటిని వెళ్లగొట్టేందుకు లక్ష్మణరేఖలు వంటివి వాడుతుంటారు. అయితే, వీటికంటే దాల్చినచెక్క పొడి వాడండి. చీమలు తిరిగే చోట ఈ పొడిని చల్లితే ఆ ఘాటుకు అవి దరిచేరవు. అలాగే నిమ్మరసం కలిపిన నీటితో నేలను తుడిచినా చీమలు రావు.

వంటగది వాసనలు: నాన్ వెజ్ వండినప్పుడు లేదా సింక్ దగ్గర వచ్చే నీచు వాసన పోవాలంటే ఒక గిన్నెలో కొద్దిగా బేకింగ్ సోడా వేసి ఉంచండి. అది గాలిలోని దుర్వాసనను పీల్చుకుంటుంది. ఇక ఫ్రిజ్‌లో వచ్చే వాసనలకు సగం కోసిన నిమ్మకాయ రామబాణంలా పనిచేస్తుంది.

బిజినెస్

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.83 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్లలో జోరు కొనసాగుతోంది. ఫిబ్రవరిలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.83 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 8.1 శాతం ఎక్కువ. దిగుమతులతో పాటు దేశీయ అమ్మకాల వృద్ధి ఇందుకు ప్రధానంగా దోహదం చేశాయి. గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో దేశీయ అమ్మకాలపై వసూళ్లు 5.3 శాతం పెరిగి రూ.1.36 లక్షల కోట్లకు, దిగుమతి సుంకాల వసూళ్లు 17.2 శాతం పెరిగి రూ.47,837 కోట్లకు చేరాయి. ఇదే కాలంలో జీఎస్‌టీ రిఫండ్స్ 10.2 శాతం పెరిగి రూ.22,595 కోట్లకు చేరాయి. దీంతో ఫిబ్రవరి నికర జీఎస్‌టీ వసూళ్లు రూ.1.61 లక్షలుగా ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	500
వరంగల్	452	గోదావరి	458
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	150	విజయవాడ	150
వరంగల్	150	గుంటూరు	150
కరీంనగర్	150	ఒంగోలు	150
మహబూబ్‌నగర్	150	చిత్తూరు	136
కర్నూలు	150	నెల్లూరు	141
విశాఖపట్నం	150	అనంతపురం	141
గోదావరి	150		



ముంచుకొస్తున్న చమురు ముప్పు



రిఫైనరీల వద్ద 15 రోజులకు సరిపడా నిల్వలు

మూసుకుపోయిన హోర్ముజ్ జల సంధి ● సగం భారత చమురు దిగుమతులకు బ్రేక్

- రెండు నెలలకు సరిపడా క్రూడాయిల్
- 100 డాలర్ల దిశగా బ్యారల్ చమురు!

న్యూఢిల్లీ: మరోసారి చమురు ముప్పు ముంచుకొస్తోంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడితో ఊహించినట్టే ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. దీంతో మన దేశం రోజూ దిగుమతి చేసుకునే 50 లక్షల బ్యారళ్ల చమురు సరఫరాలో సగానికి బ్రేక్ పడింది. ఇదే సమయంలో సౌదీ అరేబియా, కువైట్, ఇరాన్, ఇరాక్, యూఏఈ, ఖతార్ దేశాలకు జరిగే మన ఎగుమతులకూ బ్రేక్ పడనుంది.

భారీగా నిల్వలు

తాజా పరిస్థితుల నేపథ్యంలో మన దేశ చమురు అవసరాలకు ఇప్పటికిప్పుడు పెద్దగా వచ్చే ముప్పేమీ కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కర్ణాటకలోని మంగళూరు, పాడూరుల్లోని వ్యూహాత్మక చమురు నిల్వల కేంద్రాల్లో రెండు నెలల దేశ అవసరాలకు సరిపడా ముడి చమురు (క్రూడాయిల్) నిల్వలు ఉన్నాయి. దీనికి తోడు దేశంలోని పెట్రోలియం రిఫైనరీల వద్ద 15 రోజుల అవసరాలకు సరిపడా పెట్రో ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయి. దీంతో ఈ ఉద్రిక్తతలు ఎంత తీవ్రమైనా మరో రెండు నెలల వరకు మన దేశ ముడి చమురు, పెట్రో ఉత్పత్తుల అవసరాలకు ఢోకా ఉండదని భావిస్తున్నారు. అయితే ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీ సరఫరాలకు మాత్రం బ్రేక్ పడి వాటి ధరలు చుక్కలంటే ప్రమాదం కనిపిస్తోంది.

ధరలకు రెక్కలు?

ప్రస్తుతం బ్రెంట్ రకం బ్యారల్ ముడి చమురు అంతర్జాతీయ మార్కెట్లో 73 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో సోమవారం ఇది 15 డాలర్ల వరకు ఎగిసిపడే ప్రమాదం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ఈ ఉద్రిక్తతలకు ఇప్పట్లో తెరపడకపోతే బ్యారల్ ముడి చమురు ధర త్వరలో 100 డాలర్లకు చేరినా ఆశ్చర్యం లేదని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ యూబీఎస్ ఒక నివేదికలో పేర్కొంది.

ప్రత్యామ్నాయాలు

భారత ముడి చమురు దిగుమతుల్లో దాదాపు 45 శాతం పశ్చిమాసియా దేశాలైన సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, యూఏఈ దేశాల నుంచి వస్తోంది. అమెరికా ఆంక్షలతో ఇరాన్ నుంచి దిగుమతుల దాదాపుగా ఆగిపోయాయి.అయితే ఇప్పుడు ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, యూఏఈ నుంచి వచ్చే దిగుమతులకూ బ్రేక్ పడింది. దీంతో మన దేశంలో తప్పనిసరిగా ప్రత్యామ్నాయాలు చూసుకోక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికా, రష్యా, వెనెజువెలా, బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే ఈ దేశాల నుంచి కొనుగోలు చేసే ముడి చమురు మన దేశానికి చేరేందుకు ఎంత లేదన్నా 30 నుంచి 45 రోజుల సమయం పడుతుంది. అదే గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే 5 నుంచి 7 రోజుల్లో భారత రేవులకు చేరుతుంది. అయితే ఈ దేశాలు మన రోజువారీ చమురు దిగుమతులైన 50 లక్షల బ్యారళ్ల సగం మొత్తాన్ని భర్తీ చేయగలవా? అన్నది పెద్ద ప్రశ్న.

ముందున్న మార్గం?

వాణిజ్య ఒప్పందం కోసం ట్రంప్ సర్కారు ఒత్తిడికి లొంగి మన దేశం ఇప్పటికే రష్యా చమురు దిగుమతులను భారీగా తగ్గించింది. ఇప్పుడు ఒట్టు తీసి గట్టు మీద పెట్టి రష్యాను ఆశ్రయించడం ఒక్కటే సరైన మార్గంగా కనిపిస్తోంది. దీనికి తోడు పెద్దమొత్తంలో చమురు నిల్వలతో అనేక రష్యా నౌకలు కొనుగోలుదారుల కోసం అరేబియా, హిందూ మహాసముద్రంలో వేచి చూస్తున్నాయి. అయితే ట్రంప్ సర్కారు ఇందుకు మన దేశాన్ని అనుమతిస్తుందా? లేదా? అనేది పెద్ద ప్రశ్న. ఒకవేళ అనుమతించకపోతే మోదీ సర్కారు కత్తి మీద సాము చేయక తప్పదు.

బియ్యం ఎగుమతులపై జరజాగ్రత్త

తాజా పరిణామాల నేపథ్యంలో గల్ఫ్ దేశాలకు మన దేశం నుంచి జరిగే బియ్యం ఎగుమతులూ ప్రమాదంలో పడ్డాయి. కాస్ట్, ఇన్సూరెన్స్, ఫ్రైట్ (సీఐఎఫ్) పద్ధతిలో ఈ దేశాలకు బియ్యం ఎగుమతి చేసే సంస్థలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని భారత బియ్యం ఎగుమతిదారుల సమాఖ్య (ఐఆర్ఈఎఫ్) తన సభ్యులను కోరింది. రవాణా ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియం పెరిగిపోయే ప్రమాదం ఉన్నందున ఈ ఆప్షన్‌ను అసలు ఎంచుకోవద్దని హెచ్చరించింది. సీఐఎఫ్ పద్ధతిలో ఎగుమతి చేసే వస్తువుల ఖర్చులు, నౌకా రవాణ, బీమా ప్రీమియం ఖర్చులు ఎగుమతిదారుడే భరించాలి.

బులియన్ ధరలు మరింత పైకి!

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతలతో బంగారం, వెండి ధరలు ఈ వారం 3 నుంచి 6 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ఆదివారం రాత్రి ఔన్స్ మేలిమి బంగారం అంతర్జాతీయ మార్కెట్లో 5,280 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అయితే ఈ సమస్యకు ఏదైనా సత్వర దౌత్య పరిష్కారం లభిస్తే వారాంతంలో లాభాల స్వీకరణకూ అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఆటుపోట్లలోనే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం భీకరంగా కొనసాగుతుండటంతో పాటు అమెరికా జాబ్ డేటా, ద్రవ్యోల్బణం విపరీతంగా ఉండటం, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి సూచీల గమనాన్ని నిర్దేశించనున్నాయి. ఈ నేపథ్యంలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపొచ్చు. నష్టభయాన్ని అంచనా వేసుకుని ఎంపిక చేసిన షేర్లలోనే పెట్టుబడులు పెట్టడం మంచిది. ప్రస్తుతం పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎనర్జీ, హెల్త్‌కేర్, ఫార్మా షేర్లు కొంత బలాన్ని ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

వోల్టాస్: జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 49 శాతం మేర పతనమైన ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేషన్ దశను ముగించుకుంది. ఏడాదికాలంగా మంచి బేస్ ఏర్పడింది. రూ.1,500 వద్ద బలమైన నిరోధాన్ని బ్రేక్ చేసింది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,561 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,550 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,620 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.1,520 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐడీబీఐ బ్యాంక్: గత ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. చిన్నచిన్న కరెక్షన్ వచ్చినా బుల్లిష్ ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. 2025 నుంచి ఇప్పటి వరకు 75 శాతం మేర రాబడిని అందించింది. గత శుక్రవారం రూ.116 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.114 స్థాయిలో ప్రవేశించి రూ.125 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.110 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్: ఈ షేరు దీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. గత ఏడాది మార్చి నుంచి 70 శాతం మేర రాణించింది. మెరుగైన రిలేటివ్ స్ట్రెంత్‌తో జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసేందుకు సిద్ధంగా ఉంది. గత శుక్రవారం రూ.187 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.185 శ్రేణిలో ఎంటరై రూ.210 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.180 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్: ప్రస్తుతం ఈ షేరు మీడియం టర్మ్ డౌన్‌ట్రెండ్‌లో ఉంది. జీవితకాల గరిష్ఠం నుంచి 55 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. రిలేటివ్ స్ట్రెంత్ ఇప్పుడిప్పుడే మెరుగవుతోంది. చివరి 20 సెషన్లలో 30 శాతం పెరగటం గమనార్హం. గత శుక్రవారం రూ.2,753 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,700 శ్రేణిలో ప్రవేశించి రూ.2,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.2,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆయిల్ ఇండియా: జీవితకాల గరిష్ఠం నుంచి 56 శాతం మేర పతనమైన ఈ కౌంటర్ ప్రస్తుతం మీడియం అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. చక్కని బేస్ ఏర్పరచుకుంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.483 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.480 శ్రేణిలో ప్రవేశించి రూ.540 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.460 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ: 25,000 వద్ద నిలదొక్కుకుంటేనే..



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ తొలుత రికవరీ కనబరిచి 25,770 స్థాయిలకు చేరుకుంది. ఆ తర్వాత గరిష్ఠ స్థాయిలైన 26,000 వద్ద బలహీనతను సూచించింది. చివరకు వారాంతంలో 300 పాయింట్ల నష్టంతో 25,178 స్థాయిల వద్ద క్లోజైంది. వారం మొత్తం మీద నిఫ్టీ 400 పాయింట్లు (1.5 శాతం) నష్టపోయింది. ఫిబ్రవరి నెలలో నిఫ్టీ 26,340 గరిష్ఠ స్థాయిల నుంచి 1,200 పాయింట్ల మేర పతనమైంది. గడచిన మూడు నెలలుగా మార్కెట్ కరెక్షన్ ట్రెండ్‌లోనే సాగుతోంది. నిఫ్టీ ఇటీవలి మద్దతు స్థాయిలైన 25,500 వద్ద నిలదొక్కుకోలేక పోవటంతో మరింత బలహీనతను సూచిస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధంతో మార్కెట్లు మరింత పతనమయ్యే అవకాశం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ఆటుపోట్ల ట్రెండ్‌లో సాగే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ డౌన్‌ట్రెండ్ నుంచి కోలుకుని రికవరీ కనబరిస్తే తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలు 25,300, 25,500 ఎగువన ఉంటాయి.

బేరిష్ స్థాయిలు: సానుకూలత కోసం మద్దతు స్థాయిలైన 25,000 ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.మద్దతు స్థాయిలు 24,750, 24,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 640 పాయింట్లు నష్టపోయి 60,530 వద్ద క్లోజైంది. మూడు వారాల పాటు నిరోధ స్థాయిలైన 61,000 పాయింట్ల వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొని నిలదొక్కుకోలేక మరింత బలహీనతను సూచించింది. మరింత బలహీనతను సూచిస్తే 59,900 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే అప్రమత్తతను సూచిస్తుంది. సానుకూల ట్రెండ్ కోసం 60,600 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

పాటర్న్: మార్కెట్ గతవారం 200 డీఎంఏ దిగువకు చేరింది. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.అలాగే సానుకూలత కోసం 25,500 స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం శుక్రవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,210, 25,300
మద్దతు	25,000, 24,910

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

వినోదాత్మక చిత్రం



శ్రీనాథ్ మాగంటి కథానాయకుడిగా బాల సతీశ్ తెరకెక్కించిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేశ్'. కామాక్షి భాస్కర్ల, గాయత్రి రమణ కథానాయికలు. రాజేశ్ నిర్మించారు. ఈనెల 6న 'మెన్షన్ హౌస్ మల్లేశ్' విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు సందీప్ రెడ్డి వంగా విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలసతీశ్ మాట్లాడుతూ 'అన్ని వర్గాల వారిని అలరించేలా ఈ చిత్రంలోని సన్నివేశాలు ఉంటాయి. ఇందులోని సన్నివేశాలు ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ అలరిస్తాయి. ఈ సినిమాను చూసిన ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటారు. థియేటర్ల నుంచి సంతృప్తితో బయటకు వస్తారు' అని అన్నారు. 'ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకముంది' అని రాజేశ్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: గ్యారీ బీహెచ్, డీఓపీ: అమ్మముత్తు, సంగీతం: సురేశ్ బొబ్బిలి.

మా మ్యారేజ్ రిసెప్షన్‌కు రండి

సీఎం రేవంత్ రెడ్డి కుటుంబాన్ని ఆహ్వానించిన నటి రష్మిక

ఈ నెల 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తమ మ్యారేజ్ రిసెప్షన్‌కు రావాలని కోరుతూ నటి రష్మికమందన్న.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబాన్ని ఆహ్వానించారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి ఆమె తన వివాహ రిసెప్షన్ కార్డును అందించారు. పెళ్లైన తరువాత రష్మిక తమ ఇంటికి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి భార్య గీత.. రష్మికకు బొట్టు పెట్టి, సారె అందించారు.

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)



రష్మికకు సారె ఇస్తున్న తెలంగాణ సీఎం సతీమణి గీత

స్వగ్రామంలో గృహప్రవేశం



నేడు నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండలంలోని తుమ్మన్‌పేటకు విజయ్ దేవరకొండ, రష్మికలు రానున్నారు. ముందుగా అక్కడి వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన ఇంటి వద్ద గృహప్రవేశం చేసి, వధూవరులు సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తారు. వివాహం అయిన తర్వాత తొలిసారి వస్తుండటంతో గ్రామస్థులు విజయ్, రష్మిక రాక కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి)

16 పుణ్యక్షేత్రాల్లో విజయ్, రష్మికల అన్నదానం

వివాహ బంధంతో ఒక్కటైన విరోష్ (విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న) జంట తమ కొత్త జీవితానికి ప్రజల ఆశీస్సులు కోరుతూ ఆదివారం దేశవ్యాప్తంగా 16 పుణ్య క్షేత్రాల్లో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అభిమానులతో తమ ఆనందాన్ని పంచుకునేందుకు పలు నగరాల్లో ట్రక్కుల ద్వారా మిఠాయిలను పంచిపెట్టారు. 'మా ప్రయాణంలో, ప్రేమలో మీరంతా భాగం. భారతదేశంలో ఏ శుభకార్యమైనా, భోజనం, మిఠాయిలతోనే జరుపుతారు. అందుకే మా సంతోషాన్ని మీ అందరితో పంచుకోవడానికి స్వీట్స్ పంపిస్తున్నాం' అని విజయ్ రష్మిక సోషల్ మీడియాలో పేర్కొన్నారు.



సందేశంతో అలరిస్తుంది

- వరలక్ష్మి శరత్‌కుమార్

'సరస్వతి' చిత్రంలోని ప్రతీ పాత్రా చాలా అర్థవంతంగా ఉంటుంది. ప్రకాశ్‌రాజ్, ప్రియమణి తన నటనతో ఈ సినిమాకు ప్రాణం పోశారు. ప్రేక్షకులకు మంచి సందేశం ఇస్తూనే ఆద్యంతం అలరిస్తుంది' అని అన్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. ఆమె ప్రధానపాత్రలో నటించి తెరకెక్కించిన చిత్రం 'సరస్వతి'. దోశ డైరీస్ బ్యానర్‌పై వరలక్ష్మి శరత్‌కుమార్, పూజ శరత్‌కుమార్ నిర్మించారు. ఈనెల 6న విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ 'సరస్వతి' లాంటి కథను కచ్చితంగా చెప్పితీరాలి. స్త్రీలను గౌరవించడం మన కర్తవ్యం. ఈ సినిమా ప్రేక్షకుల ప్రేమను పొందుతుంది' అని చెప్పారు. 'ఆడవారికి ధైర్యాన్నిచ్చే చిత్రం 'సరస్వతి'. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఈ కథను వరలక్ష్మి తెరకెక్కించినందుకు గర్వంగా ఉంది' అని రాధికా శరత్‌కుమార్ తెలిపారు.

స్పోర్ట్స

గ్రూప్-1 — పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
దక్షిణాఫ్రికా	3	3	0	0	6	2.259
భారత్	3	2	1	0	4	0.106
వెస్టిండీస్	3	1	2	0	2	0.993
జింబాబ్వే	3	0	3	0	0	-3.415

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
ఇంగ్లండ్	3	3	0	0	6	1.096
న్యూజిలాండ్	3	1	1	1	3	1.390
పాకిస్థాన్	3	1	1	1	3	-0.123
శ్రీలంక	3	0	3	0	0	-1.950

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్

ఇది కదా అభిమానులకు కావాల్సిందనే రీతిలో సంజూ శాంసన్ చెలరేగాడు. ఈ మెగా టోర్నీ ముందు నుంచీ అతడి బెర్త్ విషయంలో ఎన్నో నాటకీయ పరిణామాలు. తుది జట్టులోకి రావడం, పోవడంతో తీవ్ర ఒత్తిడి నెలకొన్నా.. తనలోని అసలైన సత్తాను వెలికితీశాడు. జట్టుకు చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో ఇదీ నా ఆటతీరంటూ.. విండీస్‌పై బ్యాట్ ఝుళిపించాడు. ప్రశాంత చిత్తంతో, తడబాటుకు లోనుకాకుండా కళ్లు చెదిరే షాట్లతో అంతా తానై చివరి వరకు క్రీజులో నిలిచాడు. కరీబియన్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూనే.. భారత్‌ను ఒంటి చేత్తో సెమీస్‌కు చేర్చాడు. తద్వారా కోట్లాది మంది భారతీయుల ఉత్కంఠకు ముగింపు పలికాడు.



1 ఈ మెగా టోర్నీలో ఎక్కువ సార్లు (6) సెమీస్‌కు చేరిన జట్టుగా భారత్. పాక్, ఇంగ్లండ్ జట్లతో సమంగా నిలిచింది.

హెట్‌మయెర్‌ను అవుట్ చేసిన బుమ్రా

సాహో.. సంజూ

సెమీస్‌లో టీమిండియా ● విండీస్ ఇంటికి ● ఇంగ్లండ్‌తో పోరుకు సై



1 టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ ఛేదనలో భారత్ తరఫున ఎక్కువ రన్స్ చేసిన బ్యాటర్‌గా సంజూ శాంసన్. కోహ్లీ(82)ని దాటాడు.

సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 నాటౌట్)

2 టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ తరఫున రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు (97 నాటౌట్) చేసిన శాంసన్. రైనా (101) ముందున్నాడు.

కోల్‌కతా: టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో నెగ్గింది. ఓపెనర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 నాటౌట్) చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో శతకం ముంగిట నిలిచాడు. ఇక ఈ విజయంతో గ్రూప్ 1లో రెండో స్థానంలో నిలిచిన భారత జట్టు సెమీస్‌లో ఇంగ్లండ్‌తో తలపడనుంది. గురువారం ఈ మ్యాచ్ జరుగనుంది. అటు విండీస్ ఈ ఓటమితో ఇంటిముఖం పట్టగా.. 2016 సెమీస్‌లో కరీబియన్ల చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ముందుగా విండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. చేజ్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 40), హోల్డర్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్), పోవెల్ (19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 34 నాటౌట్), హోప్ (33 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 32), హెట్‌మయెర్ (12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 27) రాణించారు. బుమ్రాకు 2 వికెట్లు లభించాయి. ఛేదనలో భారత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు చేసి గెలిచింది. తిలక్ (27) పర్వాలేదనిపించాడు. హోల్డర్, జోసెఫ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సంజూ శాంసన్ నిలిచాడు.

సంజూ అంతా తానై: ఛేదనలో ఓపెనర్ శాంసన్ ఆరంభం నుంచి ముగింపు వరకు అంతా తానై కదం తొక్కాడు. మరో ఎండ్‌లో పెద్దగా సహకారం లభించకపోయినా ఎలాంటి తడబాటుకు లోనుకాకుండా జట్టును సెమీస్‌కు చేర్చాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా నిలకడను ప్రదర్శిస్తూ చెలరేగాడు. ఇక జింబాబ్వేపై హాఫ్ సెంచరీతో ఫామ్ చాటుకున్న అభిషేక్ (10) మళ్లీ నిరాశపరిచాడు. ఇషాన్ (10) ఆట ఆరు బంతులకే పరిమితమైంది. వాస్తవానికి తొలి 10 బంతుల వరకు శాంసన్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ మూడో ఓవర్‌లో మాత్రం 4,6,4తో తన ఉద్దేశాన్ని చాటుకున్నాడు. తన జోరుతో పవర్‌ప్లేలో స్కోరు 53/2తో మెరుగ్గా కనిపించింది. సూర్య (18) ఆచితూచి ఆడినా మరోవైపు శాంసన్ మాత్రం ధాటిని కొనసాగించాడు. షెఫర్డ్ ఓవర్‌లో 6,4తో ఆకట్టుకున్నాడు. అటు ఓసారి క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్న సూర్యను 11వ ఓవర్‌లో జోసెఫ్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మూడో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. అయితే 13వ ఓవర్‌లో తిలక్ హ్యాట్రిక్ ఫోర్లతో 17 రన్స్ సమకూరాయి. హెట్‌మయెర్ సూపర్ క్యాచ్‌తో తను పెవిలియన్‌కు చేరినా నాలుగో వికెట్‌కు 26 బంతుల్లోనే 42 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత హార్దిక్ (17), దూబే (8 నాటౌట్) సహకరించారు. మరోవైపు శాంసన్ శతకం పూర్తి చేయకపోయినా 6,4తో మ్యాచ్‌కు అద్భుత ముగింపునిచ్చాడు.

హోల్డర్-పోవెల్ ఎదురుదాడి: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ ఆరంభం ఓ మాదిరిగా సాగగా, మధ్య ఓవర్లలోనూ పెద్దగా మెరుపులు కనిపించలేదు. కానీ చివరి ఐదు ఓవర్లలో హోల్డర్, పోవెల్ బ్యాట్లకు పనిచెప్పారు. దీంతో విండీస్ స్కోరు 200 దరిదాపుల్లోకి రాగలిగింది. తొలి వికెట్‌కు ఓపెనర్లు హోప్, చేజ్ 68 పరుగులు జోడించినా.. బంతికో పరుగు చొప్పున అన్నట్టుగా వీరి ఆట సాగింది. ముఖ్యంగా షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడిన హోప్ 17 డాట్ బాల్స్ ఆడాడు. మరోవైపు చేజ్ మూడో ఓవర్‌లో రనౌట్, ఐదో ఓవర్‌లో క్యాచ్ అవుట్ నుంచి బతికిపోయాడు. పవర్‌ప్లేలో 45 పరుగులతో నిలిచిన విండీస్ తొమ్మిదో ఓవర్‌లో తొలి వికెట్‌ను కోల్పోయింది. హోప్‌ను వరుణ్ బౌల్డ్ చేయడంతో ఈడెన్‌లో హుషారు కనిపించింది. ఆ తర్వాత హెట్‌మయెర్ ఉన్నది కాసేపైనా ధనాధన్ ఆట ఆడాడు. వరుణ్ ఓవర్‌లో 6,4తో 17 రన్స్ రాబట్టాడు. అయితే 12వ ఓవర్‌లో పేసర్ బుమ్రా డబుల్ ఝలక్ ఇచ్చాడు. జోరు మీదున్న హెట్‌మయెర్‌తో పాటు క్రీజులో నిలదొక్కుకున్న చేజ్‌ను సైతం పెవిలియన్‌కు చేర్చాడు. కాసేపటికే రూథర్‌ఫోర్డ్ (14)ను హార్దిక్ దెబ్బతీయడంతో విండీస్‌కు 150 కూడా కష్టమేనేమో అనిపించింది. ఈ స్థితిలో ఆల్‌రౌండర్ జాసన్ హోల్డర్ అండగా నిలవగా, అతడికి పోవెల్ సహకరించాడు. 16వ ఓవర్‌లో పోవెల్ 6,6,4 బాదగా మొత్తం 24 రన్స్ సమకూరాయి. ఆ తర్వాత హోల్డర్ 6,4తో 14 రన్స్ రాగా, స్కోరు 150 దాటింది. కానీ 19వ ఓవర్‌లో అర్ష్‌దీప్ 6 పరుగులే ఇచ్చి కట్టడి చేశాడు. దీంతో ఆఖరి ఓవర్‌లో 14 రన్స్ వచ్చినా స్కోరు 200 లోపే ముగిసింది. ఐదో వికెట్‌కు హోల్డర్-పోవెల్ జోడీ అజేయంగా 76 రన్స్ జత చేసింది.

స్కోరుబోర్డు

వెస్టిండీస్: హోప్ (బి) వరుణ్ 32, చేజ్ (సి) సూర్య (బి) బుమ్రా 40, హెట్‌మయెర్ (సి) శాంసన్ (బి) బుమ్రా 27, రూథర్‌ఫోర్డ్ (సి) శాంసన్ (బి) హార్దిక్ 14, పోవెల్ (నాటౌట్) 34, హోల్డర్ (నాటౌట్) 37; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 195/4; వికెట్ల పతనం:** 1-68, 2-102, 3-103, 4-119; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-43-0, హార్దిక్ 4-0-40-1, అక్షర్ 4-0-35-0, బుమ్రా 4-0-36-2, వరుణ్ 4-0-40-1.

భారత్: అభిషేక్ (సి) హెట్‌మయెర్ (బి) హొసేన్ 10, శాంసన్ (నాటౌట్) 97, ఇషాన్ (సి) హెట్‌మయెర్ (బి) హోల్డర్ 10, సూర్య (సి) రూథర్‌ఫోర్డ్ (బి) జోసెఫ్ 18; తిలక్ (సి) హెట్‌మయెర్ (బి) హోల్డర్ 27, హార్దిక్ (సి) హోల్డర్ (బి) జోసెఫ్ 17, దూబే (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 19.2 ఓవర్లలో 199/5. వికెట్ల పతనం:** 1-29, 2-41, 3-99, 4-141, 5-179. **బౌలింగ్:** హొసేన్ 2-0-22-1, ఫోర్డ్ 3-0-22-0, హోల్డర్ 4-0-38-2, మోటీ 2-0-18-0, షెఫర్డ్ 2.2-0-34-0, జోసెఫ్ 4-0-42-2, చేజ్ 2-0-18-0.

విలువైన ఇన్నింగ్స్..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సంజూ శాంసన్..ఈ కేరళ వికెట్‌కీపర్, బ్యాటర్ ఎంతో సత్తా కలిగినోడు. దేశవాళీ క్రికెట్‌తోపాటు ఐపీఎల్‌లో తానేమిటో నిరూపించుకున్నాడు. అయితే 2015లోనే జింబాబ్వేపై టీ20ల ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. కానీ ఆదిలో అతడు అంచనాలను అందుకోలేకపోయాడు. దాంతో జాతీయ జట్టులో చోటు కోల్పోయాడు. తానేంటో నిరూపించుకొని టీమిండియాలోకి మళ్లీ వచ్చేందుకు సంజూకు నాలుగున్నర సంవత్సరాలు పట్టింది. అయితే సంజూ కెరీర్‌ను మలుపు తిప్పింది 2024 సంవత్సరం. ఆ ఏడాది బంగ్లాదేశ్‌పై టీ20 సెంచరీ (47 బంతుల్లో 111)తో భళా అనిపించిన సంజూ..బలమైన దక్షిణాఫ్రికా జట్టుపై రెండు టీ20 శతకాలతో ఔరా అనిపించాడు. 2025లో తిరిగి ఆట ఆట గాడి తప్పింది. ఈసారి టీ20 వరల్డ్ కప్ జట్టులో చోటు లభించినా అంతకుముందు న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్‌లో విఫలం కావడంతో ఆరంభ మ్యాచ్‌ల్లో శాంసన్‌ను పక్కనబెట్టారు. అనారోగ్యంతో నమీబియా మ్యాచ్‌కు ఓపెనర్ అభిషేక్ దూరం కావడంతో సంజూకు తుది జట్టులో స్థానం దక్కింది. కానీ ఆ మ్యాచ్‌లో రాణించలేకపోవడంతో తదుపరి మూడు మ్యాచ్‌లకు శాంసన్ మళ్లీ బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. శుభారంభాలను భారీ స్కోర్లుగా మలచకపోవడమే సంజూ బలహీనతగా మారింది. దాంతో అతడిపై విమర్శలు వెల్లువెత్తాయి. జింబాబ్వేతో మ్యాచ్‌లోనూ (15 బంతుల్లో 24) అదే సీన్ రిపీట్ కావడంతో అతడికి జట్టులో చోటెందుకనే ప్రశ్న లేవనెత్తిన వారు లేకపోలేదు. కానీ వెస్టిండీస్‌తో నాకౌట్ పోరులో సంజూ విశ్వరూపం ప్రదర్శించాడు. ఒక విధంగా చెప్పాలంటే ఒంటిచేత్తో టీమిండియాను సెమీఫైనల్‌కు చేర్చాడు. జట్టుకు తన విలువేమిటో ఒక్క ఇన్నింగ్స్‌తో తెలియజెప్పాడు. ఇదే జోరులో టీమిండియా మరోసారి టీ20 ప్రపంచ కప్‌ను సాధించడంలో సంజూ తన పాత్రను సమర్థంగా పోషిస్తాడని ఆశిద్దాం.

సెమీఫైనల్ షెడ్యూల్

మార్చి 4 (బుధవారం)
దక్షిణాఫ్రికా x న్యూజిలాండ్ (కోల్‌కతా)

మార్చి 5 (గురువారం)
భారత్ x ఇంగ్లండ్ (ముంబై)

గమనిక: మ్యాచ్‌లు రాత్రి 7 గంటలకు

సెమీఫైనల్స్, ఫైనల్స్‌కు రిజర్వ్‌డే ఉంది

ఎదురులేని సఫారీలు

5 వికెట్లతో జింబాబ్వేపై గెలుపు


రజా ఆల్‌రౌండ్ షో వృథా

గ్రూప్‌లో అగ్రస్థానం



డెవాల్డ్ బ్రెవిస్ (42)

న్యూఢిల్లీ: సికందర్ రజా (73, 3/29) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టినా.. టీ20 వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా జైత్రయాత్రను అడ్డుకోలేక పోయాడు. ఇప్పటికే సెమీస్ బెర్త్‌ను సొంతం చేసుకొన్న మార్‌క్రమ్ సేన.. సూపర్-8లో భాగంగా గ్రూప్-1లో ఆదివారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో 5 వికెట్లతో జింబాబ్వేపై గెలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచిన సఫారీలు.. బుధవారం కోల్‌కతాలో జరిగే తొలి సెమీస్‌లో న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకొన్న జింబాబ్వే 20 ఓవర్లలో 153/7 స్కోరు చేసింది. మపాక, బోష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఒకవైపు వికెట్లు టపాటపా రాలుతున్నా కెప్టెన్ సికందర్ రజా అర్ధ శతకంతో ఒంటరి పోరాటం చేశాడు. చివర్లో రజాతో కలసి మదాండె (26 నాటౌట్) దూకుడుగా ఆడడంతో.. టీమ్ స్కోరు 150 మార్క్ దాటింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (15) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరాడు. అనంతరం ఛేదనలో దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 154/5 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు క్వింటన్ డికాక్ (0), కెప్టెన్ మార్‌క్రమ్ (4)ను సికందర్ స్వల్ప స్కోరుకే అవుట్ చేసి షాకిచ్చాడు. కానీ, రికెల్టన్ (31), డెవాల్డ్ బ్రెవిస్ (42), మిల్లర్ (22) పరిస్థితిని చక్కదిద్దారు. వీరు అవుటైన తర్వాత.. స్టబ్స్ (21 నాటౌట్), లిండే (30 నాటౌట్) ఆరో వికెట్‌కు అజేయంగా 53 పరుగులు జోడించడంతో.. సౌతాఫ్రికా మరో 13 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. ఓటమి పాలైన జింబాబ్వే సారథి సికందర్ రజాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



సికందర్ రజా (73, 3/29)

సంక్షిప్త స్కోర్లు

జింబాబ్వే: 20 ఓవర్లలో 153/7 (సికందర్ 73, క్లైవ్ మదాండే 26 నాటౌట్; మపాక 2/21, బాష్ 2/40).

దక్షిణాఫ్రికా: 17.5 ఓవర్లలో 154/5 (బ్రెవిస్ 42, లిండే 30 నాటౌట్; సికందర్ 3/29).

లంక కోచ్ జయసూర్య రాజీనామా?



కొలంబో: శ్రీలంక జట్టు ప్రధాన కోచ్ సనత్ జయసూర్య రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాడు. టీ20 వరల్డ్‌కప్‌లో లంక జట్టు సెమీస్ చేరడంలో విఫలమైన సంగతి తెలిసిందే. 'నా బాధ్యతలను మరొకరికి అప్పగించేందుకు ఇదే సరైన సమయంగా భావిస్తున్నా. వరల్డ్‌కప్ టైటిల్‌తో కోచ్ పదవిని ముగిద్దామనుకున్నా. కానీ అలా జరగకపోవడం విచారకరం. నా కాంట్రాక్ట్ జూన్ వరకు ఉంది. అయితే నా నిర్ణయాన్ని ఇంకా శ్రీలంక క్రికెట్ (ఎస్‌ఎల్‌సీ)కు చెప్పలేదు. త్వరలోనే వారితో మాట్లాడతా' అని జయసూర్య తెలిపాడు.

సలీమాకు హాకీ పగ్గాలు

8 నుంచి వరల్డ్ కప్ క్వాలిఫయర్స్

హైదరాబాద్: గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఈనెల 8 నుంచి జరిగే హాకీ వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ కోసం భారత మహిళల జట్టును ప్రకటించారు. 20 మందితో కూడిన ఈ బృందానికి సలీమా టెటె సారథ్యం వహించనుంది. ఇక వ్యక్తిగత కారణాలతో వెటరన్ గోల్‌కీపర్ సవితా పూనియా ఈ టోర్నీకి దూరమైంది. మార్చి 14 వరకు ఈ క్వాలిఫయర్స్ జరుగనుంది. ఇందులో పాల్గొనే మొత్తం 8 జట్లను రెండు పూల్స్‌గా విభజించారు. పూల్ 'ఎ'లో ఇంగ్లండ్, కొరియా, ఇటలీ, ఆస్ట్రియా.. పూల్ 'బి'లో భారత్, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ ఉన్నాయి. ఆగస్టులో జరిగే హాకీ వరల్డ్‌కప్‌లో మిగిలిన మూడు బెర్త్‌ల కోసం ఈ జట్లు పోటీపడనున్నాయి.

కెప్టెన్‌ను డమ్మీ చేశాడు..

ఆఘాపై పాక్ జర్నలిస్టుల ఆగ్రహం



పల్లెకెలె/కరాచీ: శ్రీలంకతో సూపర్-8 మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా ఆ దేశ జర్నలిస్టుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కోచ్ మైక్ హెసన్ అన్నీ తానై వ్యవహరిస్తున్నాడని, సల్మాన్‌ను డమ్మీ కెప్టెన్ చేశాడని మ్యాచ్ తర్వాత జరిగిన మీడియా సమావేశంలో నిలదీశారు. అంతేకాదు..స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ సేవలను సరైన రీతిలో వినియోగించుకోలేదని మండిపడ్డారు. ప్రపంచ కప్‌లో చెత్త ప్రదర్శనపై పాకిస్థాన్ మాజీలు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. 'రెండేళ్లకొకసారి దక్కే అవకాశంలో పాకిస్థాన్ క్రికెటర్లు సత్తా చాటడంలో విఫలమయ్యారు. ఇది ఎంతో నిరాశకు లోనుచేస్తోంది' అని మాజీ కెప్టెన్ మియాందాద్ నిర్వేదంగా అన్నాడు.

409 పరుగుల భారీ స్కోరు

ఆసీస్ అదుర్స్

సిరీస్ క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ భారత్ ఓటమి

వీడ్కోలు మ్యాచ్‌లో కదం తొక్కిన హీలీ

మూనీ సెంచరీ

హోబర్ట్: కెరీర్ ఆఖరి వన్డేలో అలీసా హీలీ (158) చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడగా, బేత్ మూనీ (106 నాటౌట్) అజేయ సెంచరీతో అదరగొట్టిన వేళ..భారత్‌తో వన్డే సిరీస్‌ను ఆస్ట్రేలియా మహిళలు క్లీన్‌స్వీప్ చేశారు. ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌లో కంగారూలు 185 పరుగులతో వరల్డ్ చాంపియన్ భారత్‌ను చిత్తు చేశారు. అంతేకాదు..ఏకైక టెస్ట్ మ్యాచ్ మిగిలుండగానే ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్‌లో 8-4తో ట్రోఫీని నిలబెట్టుకున్నారు. 2021లో చివరిసారి మల్టీఫార్మాట్ సిరీస్‌నూ ఆసీస్ మహిళలు సొంతం చేసుకున్నారు. ఇక.. మ్యాచ్‌లో మొదట ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 409/7 స్కోరు చేసింది. హీలీ, మూనీకి తోడు జార్జియా వాల్ (62) సత్తా చాటింది. వాల్‌తో కలిసి రెండో వికెట్‌కు 104 పరుగులు జోడించిన హీలీ..మూనీతో కలిసి మూడో వికెట్‌కు 145 (92 బంతులు) రన్స్ జత చేసింది. భారీ ఛేదనలో భారత్ 45.1 ఓవర్లలో 224 పరుగులకే కుప్పకూలింది. స్నేహ్ రాణా (44), జెమీమా (42) కూడా విఫలమైతే మనోళ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. అలనా కింగ్ నాలుగు, వార్హెమ్ రెండు వికెట్లు సాధించారు. ఈ విజయంతో గత వన్డే వరల్డ్ కప్ సెమీస్‌లో హర్మన్‌ప్రీత్ సేన చేతిలో ఓటమికి ఆస్ట్రేలియా బదులు తీర్చుకుంది. హీలీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. కాగా వన్డేల్లో అత్యధిక స్కోరు న్యూజిలాండ్ (2018లో 491/4) పేరిట ఉంది.




బేత్ మూనీ (106 నాటౌట్)

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 50 ఓవర్లలో 409/7 (హీలీ 158, మూనీ 106 నాటౌట్, వాల్ 62, నికోలా కేరీ 34 నాటౌట్, స్నేహ్ రాణా 2/66, శ్రీచరణి 2/106).

భారత్: 45.1 ఓవర్లలో 224 ఆలౌట్ (స్నేహ్ రాణా 44, జెమీమా 42, దీప్తీశర్మ 29, ప్రతిక 27, హర్మన్ 25, అలనా కింగ్ 4/33, జార్జియా వార్హెమ్ 2/3).



అలీసా హీలీ (158)

శ్రీచరణి చెత్త రికార్డు

10-0-106-2.. మ్యాచ్‌లో స్పిన్నర్ శ్రీచరణి గణాంకాలు. దాంతో వన్డేల్లో అత్యధిక రన్స్ ఇచ్చిన భారత స్పిన్నర్‌గా ఆమె నిలిచింది. ఈక్రమంలో చాహల్ (10-0-89-1) రికార్డును తిరగ రాసింది. అంతేకాదు ఒక ఇన్నింగ్స్‌లో 100కు పైగా పరుగులిచ్చిన తొలి భారత స్పిన్నర్‌గా శీచరణి మరో రికార్డు నమోదు చేసింది. అలాగే..వన్డేలలో అత్యధిక పరుగులిచ్చిన భారత్ బౌలర్‌గా భువనేశ్వర్ (10-0-106-1) రికార్డును సమం చేసింది.

1 409/7 .. ఆస్ట్రేలియా గడ్డపై మహిళల వన్డేలలో ఇదే అత్యధిక స్కోరు. అలాగే భారత జట్టుపై ఏ దేశంలోనైనా ఇదే అత్యధిక స్కోరు.

కెరీర్ ఆఖరి వన్డేలో సెంచరీ చేసిన లోట్జెన్‌బర్గ్ (దక్షిణాఫ్రికా)తో సమంగా నిలిచిన అలీసా హీలీ.

సీఎంపై డీఎస్పీ ఫిర్యాదు

- తిరుమల లడ్డూ విషయంలో డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌పైనా!
- డిబేట్లతో మనసు గాయపడినట్టు వెల్లడి



డీఎస్పీ నాగవరప్రసాద్

తుళ్లూరు, మార్చి 1 (ఆంధ్రజజ్యోతి): ఆయన డీఎస్పీ స్థాయి పోలీసు అధికారి..! పేరు దేవరకొండ నాగవరప్రసాద్. ప్రస్తుతం మెడికల్ లీవ్‌లో ఉన్న ఆయన... తిరుమల లడ్డూ కల్తీ విషయంలో ఇటీవల జరుగుతున్న చర్చతో భక్తుల మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతిన్నాయంటూ బాధపడిపోయారు! ప్రభుత్వం కూడా దీనిపై మాట్లాడడం, డిబేట్‌లు నిర్వహించడం ఆయనకు నచ్చలేదట. అందుకని ఏకంగా సీఎం చంద్రబాబుపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఈనాడు, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, మహాన్యూస్ మీడియా చానెళ్లు, టీటీడీ మాజీ ఈవో శ్యామలరావు, చైర్మన్ బీఆర్ నాయుడుపైనా తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తాను గతంలో శ్రీకాకుళం జిల్లాలో డీటీసీగా పనిచేశానని, తర్వాత అనంతపురం జిల్లాలో పీటీసీగా పోస్టు ఇవ్వగా, అక్కడకు వెళ్లడం ఇష్టంలేదని మీడియాకు వివరించారు. వలంటరీ రిటైర్మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నానని, ప్రస్తుతం మెడికల్ లీవ్‌లో ఉన్నట్టు చెప్పారు.

37 కరువు మండలాల్లో 50 రోజులు అదనపు ఉపాధి

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 37 కరువు మండలాల్లో అదనపు ఉపాధి పనిదినాలు కల్పిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం శ్రీసత్యసాయి జిల్లాలో 25 మండలాలు, అన్నమయ్య జిల్లాలో 9, ప్రకాశం జిల్లాలో మూడింటిని ఇప్పటికే కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ మండలాలకు మరో 50 పనిదినాలు అదనంగా కల్పించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్రం ఆమోదించడంతో ఈ 37 మండలాల్లో ఒక్కో కుటుంబానికి అదనంగా 50 పనిదినాలు కల్పిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలిచ్చింది. మార్చి 31లోపు ఈ పనిదినాలు వాడుకోవలసి ఉంటుంది.

ఉన్నత విద్య కమిషన్ రద్దు

- ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆర్డినెన్స్
- ఉన్నత విద్యలో వరుస సంస్కరణలు
- మండలి అధికారాలు కమిషనరేట్‌కు బదిలీ

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్'ను రద్దుచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వంలో అనాలోచితంగా తీసుకొచ్చిన కమిషన్‌ను రద్దుచేసి, పాత విధానంలో 'ఫీజుల నియంత్రణ కమిటీ'ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దీనిపై న్యాయ సలహాలు తీసుకుంటున్న ఉన్నత విద్యాశాఖ బడ్జెట్ సమావేశాల అనంతరం... ఆర్డినెన్స్ ద్వారా కమిటీని అమల్లోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ నెల 20లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిసింది. ఎందుకంటే వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల కాలానికి ఉన్నత విద్య కోర్సుల ఫీజులు ఖరారు చేయాల్సి ఉంది. ఫీజుల ఖరారుకు కొంత సమయం అవసరమైనందున వీలైనంత త్వరగా ఫీజుల నియంత్రణ కమిటీని తీసుకురావాలని భావిస్తోంది. 2019కు ముందు రాష్ట్రంలో 'అడ్మిషన్లు, ఫీజుల నియంత్రణ కమిటీ' (ఏఎఫ్ఆర్‌సీ) ఉండేది. వైసీపీ ప్రభుత్వం ఈ కమిటీని పక్కనపెట్టి 'ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్'ను తీసుకొచ్చి విస్తృతమైన అధికారాలు ఇచ్చింది. విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం... ఫీజుల భారాన్ని తగ్గించునేందుకు.. ఫీజులు ఎక్కువగా పెంచకుండా ఒత్తిడి చేసింది. మరోవైపు అసలు కమిషన్‌కు ఫీజుల ఖరారు అధికారం లేదంటూ పలు కాలేజీల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. దానిపై విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కమిషన్‌ను రద్దుచేసి ఆ స్థానంలో కమిటీని తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కమిటీ ఏర్పాటు ద్వారా ఫీజుల ఖరారు విషయంలో ప్రభుత్వానికి కొంత వెసులుబాటు రానుంది. కాలేజీ యాజమాన్యాల విజ్ఞప్తులు, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఫీజులు నిర్ణయించే పరిస్థితి వస్తుంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఉన్నత విద్య ఫీజుల ఖరారుకు ఫీజు నియంత్రణ కమిటీలే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వమే దానిని కమిషన్‌గా మార్చి గందరగోళ పరిస్థితులు తెచ్చింది.

ఎగ్జిక్యూటివ్ అధికారాలు బదిలీ

ఉన్నత విద్యాశాఖ ప్రక్షాళన ప్రారంభించిన ప్రభుత్వం.. తాజాగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కళాశాల విద్యా శాఖను ఉన్నత విద్య కమిషనరేట్‌గా మార్చింది. సాంకేతిక విద్యా శాఖను రద్దుచేసి ఆ సిబ్బంది, ఆస్తులను ఉన్నత విద్య కమిషనరేట్‌కు బదిలీ చేసింది. ఉన్నత విద్యలో కేంద్రంగా వ్యవహరించిన ఉన్నత విద్యా మండలి అధికారాలను కమిషనరేట్‌కు బదిలీ చేసింది. మండలి చట్టం పరిధిలో లేని ఎగ్జిక్యూటివ్, పరిపాలన అధికారాలను కమిషనరేట్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేసింది. ఇకపై ప్లానింగ్, విద్యలో నాణ్యత, కరిక్యులమ్ సంస్కరణలు, పరిశోధనలకే మండలి పరిమితం కానుంది. దీంతో ఇకపై ఉన్నతలో కీలక అధికారాలన్నీ కమిషనరేట్‌కు బదిలీ అవుతాయి. అన్ని కోర్సుల అడ్మిషన్లను కమిషనరేటే చేపడుతుంది. ప్రస్తుతం ప్రైవేటు డిగ్రీ కాలేజీలు, బీఈడీ కాలేజీలు, పీజీ కాలేజీల అనుమతుల అధికారాలు మండలికి ఉన్నాయి. మరోవైపు నైపుణ్యాభివృద్ధి శాఖలోనూ కొత్తగా కమిషనరేట్ ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటుచేసిన ఉన్నత విద్య కమిషనరేట్‌లోకి పాలిటెక్నిక్ కాలేజీలు వచ్చాయి. ఇప్పటివరకూ ఈ కాలేజీలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి.

నెల్లూరు జీజీహెచ్‌లో అగ్నిప్రమాదం

- చిన్నపిల్లల వార్డులో షార్టుసర్క్యూట్
- భయంతో పరుగులు.. తప్పిన ప్రాణాపాయం



నెల్లూరు జీజీహెచ్‌లోని చిన్న పిల్లల వార్డులో కాలిపోయిన బెడ్లు

నెల్లూరు (వైద్యం) మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లోని చిన్నపిల్లల ఇంటెన్సివ్ వార్డులో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పొగలు దట్టంగా వ్యాపించాయి. దీంతో రోగులు, రోగుల సహాయకులతో పాటు కొందరు వైద్య సిబ్బంది కూడా బయటికి పరుగులు తీశారు. అగ్నిమాపక వాహనాలు వచ్చేటప్పటికే వైద్య సిబ్బంది మంటలాపివేయటంతో అంతా పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ సంఘటనపై పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ ఆరా తీశారు. పరిస్థితిని చక్కదిద్దాలని ఆదేశించారు.

అసలేం జరిగిందంటే...

ఆదివారం సాయంత్రం 6 గంటలకు చిన్నపిల్లల ఇన్‌టెన్సివ్ వార్డులోని ఏసీలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఆ సమయంలో 15 మంది పిల్లలతోపాటు, తల్లులు, ఇతర సహాయకులు మొత్తం 35 మంది ఉన్నారు. ఏసీలో మంటలు రాగా, అవి రెండు పడకలకు వ్యాపించి కాలిపోయాయి. ఆ పడకలలో చిన్నారులెవరూ లేక పోవటంతో ప్రాణాపాయం తప్పింది. డ్యూటీలో ఉన్న వైద్యురాలు అద్దాలను పగులగొట్టి, గట్టిగా అరుస్తూ హెచ్చరికలు చేయడంతో వైద్య సిబ్బంది కరెంటు ఆపేశారు. అక్కడే ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలతో మంటలను ఆర్పేశారు. ముందు జాగ్రత్తగా పక్క వార్డులోని మరో 30 మంది పిల్లలు, వారి సహాయకులను వేరే వార్డుకు తరలించారు. ప్రమాదం నుంచి బయట పడటంతో రోగులు, సహాయకులు ఊపిరిపీల్చుకున్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో ఎస్పీ అజిత వేజెండ్ల ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా ఆస్పత్రిని సందర్శించారు. వెంటనే మంటలను ఆపివేసిన వైద్య సిబ్బందిని అభినందించారు.

ఇరాన్ కకావికలం



పరస్పరం భీకర దాడులు..

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తోపాటు ఇస్ఫహాన్, ఇతర కీలక నగరాల్లోని మిలటరీ స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం టెహ్రాన్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయం సమీపంలో అతిభారీ పేలుడు జరిగింది. మెహ్రాన్ నగరంలో జరిగిన క్షిపణి దాడిలో 43 మంది ఇరాన్ భద్రతా సిబ్బంది మరణించారు. ఇరాన్‌లోని బాలికల పాఠశాలపై జరిగిన క్షిపణి దాడిలో మృతుల సంఖ్య 165కు పెరిగింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ నిరంతరంగా క్షిపణుల దాడి కొనసాగిస్తూనే ఉంది. ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాల్లో పొద్దంతా సైరన్లు మోగుతూనే ఉన్నాయి. మరోవైపు దుబాయ్, ఖతార్, బహ్రెయిన్, సౌదీ, ఇరాక్, కువైట్ తదితర దేశాల్లోని 27 అమెరికా సైనిక స్థావరాలపై 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్' పేరిట దాడులు చేపట్టినట్టు ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. కువైట్‌లోని అమెరికా నౌకాదళ బేస్‌పై నాలుగు క్షిపణులు, 12 డ్రోన్లతో దాడి చేసి ధ్వంసం చేశామని.. పెద్ద సంఖ్యలో అమెరికా సైనికులు మరణించారని తెలిపింది. కాగా, ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్‌లో 9 మంది మృతిచెందగా, 121 మంది గాయపడినట్టు ఆ దేశ ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఇక ఇరాక్‌లో ఇద్దరు, కువైట్‌లో ఒకరు, యూఏఈలో ముగ్గురు మృతిచెందారు. ఇక ముగ్గురు అమెరికన్ సైనికులు మరణించారని, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అయితే ఈ ఘటనలు ఎక్కడ, ఎలా జరిగినదీ వెల్లడించలేదు.



హోర్ముజ్‌లో కాలిపోతున్న నౌక

వేలాది లక్ష్యాలపై దాడులు కొనసాగుతాయి: నెతన్యాహు

ఇరాన్ ఉన్నతాధికారుల్లో చాలా మంది చనిపోయారని, ఈ దాడులు మరికొన్ని రోజులపాటు కొనసాగుతాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఇంకా వేలాది లక్ష్యాలపై దాడులు చేయనున్నట్టు తెలిపారు. ఇరాన్‌కు చెందిన ధైర్యవంతులైన ప్రజలు తమ సంకెళ్లను తెంచుకుని, స్వేచ్ఛను పొందేందుకు అనువైన పరిస్థితిని తాము సృష్టిస్తున్నామని.. అంతా బయటికి వచ్చి ప్రభుత్వాన్ని కూలదోసి స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా ఇజ్రాయెల్ తమ సైన్యాన్ని పూర్తిస్థాయి యుద్ధానికి సన్నద్ధం చేస్తోంది. లక్ష మంది రిజర్వు బలగాల సిబ్బందిని వెంటనే విధుల్లోకి రావాల్సిందిగా ఆదివారం ఆదేశాలు జారీ చేసింది.

(మొదటి పేజీ తరువాయి)

మరణించారని, ఆయన నిరంతరం ప్రజల కోసం ముందు నిలిచి, తన బాధ్యతలను నిర్వర్తించారన్న విషయాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తోందని పేర్కొంది. ఇక ఖమేనీ మృతి పట్ల ఇరాన్ 40రోజుల పాటు సంతాపదినాలను, ఏడు రోజుల పాటు పూర్తిస్థాయి సెలవులను ప్రకటించింది. ఇరాన్ ప్రజలు అత్యంత పవిత్రమైనదిగా భావించే ఖోమ్ నగరంలోని జమ్‌కారన్ మసీదుపై ఎర్రజెండా ఎగురవేశారు. ఖమేనీని చంపడంపై ఆయన మద్దతుదారుల్లో ఉన్న ఆగ్రహానికి, ప్రతీకారం తీర్చుకోవాలన్న కసికి ఇది నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ తమ రెడ్‌లైన్ దాటాయని, ఆ దేశాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించింది. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్, అమెరికా కూడా ఇరాన్‌లోని టెహ్రాన్, ఇతర కీలక ప్రాంతాల్లో వైమానిక, క్షిపణి దాడులు కొనసాగిస్తున్నాయి.

అటు నివాళి.. ఇటు సంబరాలు!

ఖమేనీ మృతి చెందారన్న విషయం తెలిసి టెహ్రాన్‌తోపాటు ఇరాన్‌లోని కీలక పట్టణాల్లో వేలాదిమంది ప్రజలు రోడ్లపైకి వచ్చారు. పలుచోట్ల ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడి ఖమేనీకి నివాళి అర్పిస్తున్న దృశ్యాలను ఇరాన్ అధికారిక టీవీ ప్రసారం చేసింది. టెహ్రాన్‌లోని ఎంఘెలాబ్ స్క్వేర్ ప్రాంతంలో వేలాది మంది నలుపు వస్త్రాలు ధరించి, ఇరాన్ జెండాలు ఊపుతూ ఖమేనీకి నివాళి అర్పించారు. మరోవైపు ఖమేనీ మృతితో టెహ్రాన్, ఇస్ఫహాన్, ఇతర నగరాల్లో కొన్నిచోట్ల జనం సంబరాలు చేసుకుంటున్నట్టుగా రాయిటర్స్, ఇతర వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఇక ఇరాన్‌పై దాడి, ఖమేనీ మృతి పట్ల ఇరాక్, పాకిస్థాన్‌తో పాటు పలు దేశాల్లో ఆందోళనలు జరిగాయి. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో అమెరికా రాయబార కార్యాలయంపై దాడికి నిరసనకారులు ప్రయత్నించారు. పాకిస్థాన్‌లోని కరాచీలో అమెరికా ఎంబసీకి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ క్రమంలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో పది మంది మరణించారు.

లింకన్ నౌకపై దాడి చేశాం.. అదేమీ లేదు..

యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక యుద్ధ నౌకపై నాలుగు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశామని, నౌక కొంతమేర ధ్వంసమైందని ఐఆర్‌జీసీ ఆదివారం ప్రకటించింది. అయితే అలాంటిదేమీ లేదని, ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు కనీసం నౌక దరిదాపుల్లోకి కూడా రాలేదని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. అంతేకాదు చబహార్ పోర్టులో ఇరాన్‌కు చెందిన జమరాన్ క్లాస్ యుద్ధ నౌకపై తమ దళాలు దాడి చేశాయని, అది సముద్రంలో మునిగిపోతోందని పేర్కొంది.

హోర్ముజ్‌లో చమురు నౌకలపై దాడి

హోర్మజ్ జల సంధి మీదుగా ప్రయాణిస్తున్న చమురు ట్యాంకర్ నౌకపై క్షిపణి దాడి జరిగింది. పలావ్ దేశ జెండాతో ప్రయాణిస్తున్న ఈ నౌకలో 15 మంది భారతీయులు సహా 20 మంది సిబ్బంది ఉన్నారని, అందులో నలుగురికి గాయాలయ్యాయని ఒమన్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. హోర్మజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ఐఆర్‌జీసీ నుంచి అనధికారికంగా హెచ్చరికలు జారీ అయిన నేపథ్యంలో.. చమురు నౌకలపై దాడులు జరగడం గమనార్హం. దీనితో వందల కొద్దీ చమురు రవాణా నౌకలు హోర్మజ్ జల సంధికి ఇరువైపులా నిలిచిపోయాయి.

శత్రువులకు నరకానికి గేట్లు తెరుస్తాం: ఇరాన్

ఖమేనీ మరణానికి కారకులైన వారికి అత్యంత తీవ్రమైన శిక్ష తప్పదని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ), ఇరాన్ కేబినెట్ తీవ్రంగా హెచ్చరించాయి. తమ చరిత్రలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో అమెరికా స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై ఆపరేషన్ చేపడతామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. తమ ప్రతీకారం తీవ్రంగా ఉంటుందని, ఆ దాడి ఏ క్షణమైనా మొదలుకావొచ్చని పేర్కొంది. శత్రువుల కోసం నరకలోకం గేట్లు తెరిచే ఉంచుతామని వ్యాఖ్యానించింది.ఖమేనీ మృతి నేపథ్యంలో తాత్కాలిక పాలనా మండలిని ఏర్పాటు చేశామని.. శత్రుదేశాల దాడులను దీటుగా ఎదుర్కొని, వారి స్థావరాలను నాశనం చేస్తామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు.

పవిత్ర రంజాన్‌లో రణరంగం

అరబ్ దేశాల్లో ముస్లింలపై తీవ్ర ప్రభావం

దుబాయి, మార్చి1: రంజాన్ మాసంలో ప్రపంచంలో ఏ మూలన ఉన్న ముస్లింలు అయినా ఎంతో భక్తిశ్రద్ధలతో గడుపుతారు. సాధారణంగా రోజుకు ఐదుసార్లు నమాజు చేసే ముస్లింలు.. రంజాన్ మాసంలో అంతకంటే ఎక్కువసార్లు చేస్తూ దైవ చింతనలో ప్రశాంతంగా గడుపుతుంటారు. ఇలాంటి సమయంలో యుద్ధం మొదలుకావటంతో అరబ్ దేశాల్లోని ముస్లింలలో అసహనం పెరిగిపోతోంది. నమాజు చేయటానికి కూడా ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎప్పుడు బాంబులు వచ్చిపడతాయో తెలియని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ముందు జాగ్రత్తగా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు పలు ఆంక్షలు విధించాయి. ముఖ్యంగా పెద్ద నగరాల్లో ఉండే వారిపై ఆంక్షలు అధికంగా ఉన్నాయి. దీంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి.

లైవ్‌లో ఇరాన్ టీవీ యాంకర్ కన్నీళ్లు

» ఖమేనీ మృతిని ప్రకటిస్తూ భావోద్వేగం

టెహ్రాన్, మార్చి 1: అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ చనిపోయిన విషయాన్ని ప్రకటిస్తూ ఇరాన్ అధికారిక మీడియా సంస్థ 'ప్రెస్ టీవీ' న్యూస్ రీడర్ కన్నీటిపర్యంతమయ్యారు. విలపిస్తూనే ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మరోవైపు ఖమేనీ మరణ వార్తను చదువుతూ టీవీ యాంకర్ మర్యమ్ అజర్ చెహ్రా.. తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కన్నీళ్లను ఆపుకొనేందుకు ప్రయత్నిస్తూనే, 'త్వరలోనే ప్రతీకారం తీర్చుకుంటాం' అని అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనాథ పిల్లలు నేడు ఖమేనీ కోసం విలపిస్తున్నారని, ఇమామ్ అలీ లాగా ఖమేనీ చిరస్థాయిగా నిలిచిపోతారని నివాళులర్పించారు. "ఈరోజు వారు సంబరాలు చేసుకోవచ్చు. కానీ, ఇది ముగియలేదు. ట్రంప్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది" అని అజర్ చెహ్రా హెచ్చరించారు.



ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్‌లో ధ్వంసమైన భవనాలు





టెహ్రాన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ విధ్వంసం

ఖొమేనీ ప్రభావంతో విప్లవ బాట!

ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎదిగిన ఖమేనీ

న్యూఢిల్లీ, మార్చి 1: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతితో ఒక శకం ముగిసినట్లయింది. 1989లో ఇరాన్ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ఖమేనీ మతపరంగా అత్యంత కఠినమైన నియంత్రణ విధానాలనే అనుసరించారు. దేశంలో చెలరేగిన పలు ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేశారు. ఇరాన్‌ను పశ్చిమాసియాలో అధికార కేంద్రంగా మార్చాలని ఆకాంక్షించేవారు. అణుపరీక్షల విషయంలో అమెరికా, ఇజ్రాయెల్‌తో ఘర్షణకు దిగారు. ఖమేనీ అమెరికాను తీవ్రంగా వ్యతిరేకించారు. ఖమేనీ 1939 ఏప్రిల్ 19న జన్మించారు. చిన్ననాటి నుంచే ఇస్లామిక్ థియాలజీ (దార్శనిక శాస్త్రం)లో విద్యాభ్యాసం చేశారు. ఆయన ప్రముఖ షియా పండితుడు రుహోల్లా ఖొమేనీ ప్రభావంతో విప్లవ భావజాలాన్ని స్వీకరించారు. 1979 ఇరాన్ విప్లవ సమయంలో షా మహమ్మద్ రెజా పహ్లావీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. విప్లవం తర్వాత కొత్త ఇస్లామిక్ రిపబ్లిక్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 1981లో ఇరాన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో దేశాన్ని సమర్థంగా నడిపించారు. 1989లో ఖొమేనీ మరణించిన తర్వాత మితవాద మతగురువులు ఖమేనీని ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌కు సుప్రీం లీడర్‌గా నియమించాలని పట్టుపట్టారు. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఖమేనీ ప్రకటించినా.. వారు మాత్రం ఆయనకే మద్దతు పలికారు. దీంతో 1989 నుంచి ఇప్పటి వరకు ఆయనే సుప్రీం లీడర్‌గా ఉన్నారు. 1999లో విద్యార్థుల ఆందోళనలు, 2009లో వివాదాస్పద అధ్యక్ష ఎన్నికలకు వ్యతిరేకంగా నిరసనలు, 2019లో ఆందోళనలు జరగ్గా.. ఖమేనీ వాటన్నింటినీ తనదైన శైలిలో అణచివేశారు. కాగా, అంతర్జాతీయ ఆంక్షల వల్ల ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి గురైంది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగిపోయాయి. తాజాగా దుస్తుల నిబంధనను ఉల్లంఘించారంటూ కుర్దిష్ మహిళ మాసా అమినీని అరెస్టు చేయగా.. ఆమె పోలీసుల కస్టడీలో మృతి చెందారు. దీనిపై ఇరాన్‌వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం జరిగింది. అలాగే హిజాబ్‌పైనా తీవ్రస్థాయిలో ఆందోళనలు జరిగాయి.



ఇరాన్‌పై దాడికి సౌదీ యువరాజు మంత్రాంగం!

న్యూఢిల్లీ, మార్చి 1: ఇరాన్‌పై అమెరికా దాడి చేసేలా సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్ మంత్రాంగం నడిపినట్టు వార్తలు వస్తున్నాయి. అమెరికాకు చెందిన ఓ పత్రిక కథనం ప్రకారం ఆయన గత నెలలో ట్రంప్‌నకు పలుమార్లు ఫోన్ చేసి ప్రయివేటుగా ఈ విషయమై సంభాషించారు. బహిరంగంగా ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడినా లోలోపల లాబియింగ్ జరిపి అమెరికా దాడి చేసేలా చూశారని ఆ పత్రిక పేర్కొంది. అరబ్ పత్రికల కథనం ప్రకారం.. గతంలో అమెరికా ఎయిర్ బేస్‌లపై ఇరాన్ దాడులు చేసినప్పుడు సౌదీ క్రౌన్ ప్రిన్స్ పొరుగు దేశాల పాలకులతో మాట్లాడారు. ఇరాన్ దాడుల నుంచి ఆ దేశాలకు భద్రత, సుస్థిరత కల్పించేందుకు వనరులను సమీకరిస్తామని తెలిపారు.

యూఏఈపై దాడులను ఖండిస్తున్నా: మోదీ

న్యూఢిల్లీ, మార్చి 1: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందించారు. యూఏఈపై జరిగిన దాడులను ఆయన ఖండించారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో తాను ఫోన్ ద్వారా మాట్లాడానంటూ మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. దాడుల్లో ప్రాణ నష్టంపై ఆయన సంతాపం తెలిపారు.



గురిచూసి దెబ్బ

ఖమేనీ కదలికలపై కొన్ని నెలలుగా నిఘా

» పక్కా సమాచారం సేకరించిన ఇజ్రాయెల్, అమెరికా గూఢచారులు

» శనివారం ఉదయం సలహాదారులతో భేటీ అవుతున్నట్లు గుర్తింపు

» వెంటనే ఆయన నివాసంపై 30 బాంబులు కుమ్మరించిన ఇజ్రాయెల్

వాషింగ్టన్, మార్చి1: ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అంతమొందించటంలో అమెరికా, ఇజ్రాయెల్‌లు పక్కా ప్రణాళికతో ముందుకు కదిలాయి. ఖమేనీ ఎప్పుడు ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? ఆయనను ఎవరు కలుస్తున్నారు? అనే సమాచారాన్ని అత్యంత కచ్చితత్వంతో సేకరించి, గురిచూసి దాడి చేశాయి. ఖమేనీయే లక్ష్యంగా ఈ రెండు దేశాలు కొన్ని నెలలుగా అత్యంత రహస్య ఆపరేషన్ నిర్వహించినట్లు అమెరికా మీడియా పేర్కొంది. అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ, ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ ఏజెంట్లు ఎవరికి వారు ఖమేనీ సమాచారాన్ని సేకరిస్తూ.. దానిని ఎప్పటికప్పుడు పరస్పరం పంచుకున్నారు. ఖమేనీని అంతం చేయటంలో ఆంత్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను కూడా వాడుకున్నట్లు తేలింది.

శనివారం మీటింగ్..వెంటనే దాడి

ఖమేనీ తన సలహాదారులు, మిలిటరీ ఉన్నతాధికారులతో శనివారం మూడు సమావేశాల్లో పాల్గొనబోతున్నట్లు అమెరికా, ఇజ్రాయెల్ గూఢచారులు గుర్తించారు. ఆ సమావేశాలు ఎక్కడ జరగబోతున్నాయన్న కచ్చితమైన సమాచారం తెలియనప్పటికీ.. శనివారం సాయంత్రం అత్యంత కీలక సమావేశం జరుగుతుందని ఇరాన్‌లోని సీఐఏ ఏజెంట్లు తొలుత తమ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే, ఆ సమావేశం శనివారం ఉదయమే జరుగుతోందని మొసాద్ ఏజెంట్లు కచ్చితమైన సమాచారం సేకరించి, స్వదేశంతోపాటు అమెరికాకు చేరవేశారు. ఈ అవకాశం చేజారితే ఖమేనీ రహస్య ప్రదేశానికి వెళ్లిపోవచ్చని భావించిన రెండు దేశాలు.. వెంటనే రంగంలోకి దిగాయి. అమెరికా మిలిటరీతో సమన్వయం చేసుకొంటూ ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఖమేనీ నివాసంపై ఒకేసారి 30 బాంబులను కుమ్మరించాయి. దీంతో ఆ భవనం తునాతునలు అయిపోయింది. దాడికి ముందు సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీతోపాటు మరీ కీలక నేత షంఖానీతో ఖమేనీ సమావేశమైనట్లు ఇరాన్ అధికార వర్గాలు తెలిపాయి.

ఆంత్రోపిక్ క్లాడ్‌తో చెక్

ఖమేనీ ఆనుపానులు ఎప్పటికప్పుడు తెలుసుకొనేందుకు, ఆలస్యం కాకుండా అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసేందుకు అమెరికా సైన్యం ఆదేశానికి చెందిన ఆంత్రోపిక్ సంస్థ అభివృద్ధి చేసిన క్లాడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ వార్తా సంస్థ తెలిపింది. అది కూడా అధ్యక్షుడు ట్రంప్ ఆ సంస్థను ప్రభుత్వ సంస్థలు వినియోగించకుండా నిషేధం విధించిన కొన్ని గంటల తర్వాత మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా సైన్యం నిఘా సమాచార అధ్యయనం, టార్గెట్‌ను కచ్చితంగా గుర్తించేందుకు క్లాడ్‌ను వాడుకుందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 3వ తేదీన వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అర్ధరాత్రి ఆయన నివాసం నుంచి అపహరించిన ఆపరేషన్‌లో కూడా అమెరికా సైన్యం క్లాడ్ ఏఐనే వినియోగించినట్లు అమెరికా అధికారులను ఉటంకిస్తూ రిపోర్టు చేసింది.

టెహ్రాన్‌లో ఖమేనీకి సంతాపం ప్రకటిస్తున్న ఇరానీయులు



ఇరాన్‌పై దాడులను స్వయంగా పర్యవేక్షించిన ట్రంప్

వాషింగ్టన్, మార్చి 1: ఇరాన్‌పై అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన దాడులను ట్రంప్ స్వయంగా పర్యవేక్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను వైట్‌హౌస్ ఆదివారం విడుదల చేసింది. ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో తన రిసార్టు 'మార్ ఎ లాగో'లో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో కలిసి ట్రంప్ సమీక్షిస్తున్న దృశ్యాలు ఈ ఫొటోల్లో ఉన్నాయి. బాంబు దాడులను శాటిలైట్ చిత్రాల ద్వారా ట్రంప్ ప్రత్యక్షంగా పర్యవేక్షించినట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. అంతకుముందు వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లెవిట్ మాట్లాడుతూ..ట్రంప్, జాతీయ భద్రతా బృందం రోజంతా పరిస్థితులను పర్యవేక్షిస్తూనే ఉంటారని తెలిపారు. అంతేకాకుండా ఇరాన్‌పై మిలిటరీ దాడులు కొనసాగిస్తూనే... ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతోపాటు సౌదీ, గల్ఫ్ నేతలతో, నాటో సెక్రటరీతో ట్రంప్ దౌత్యపరమైన చర్చలు జరిపినట్లు తెలిపారు.

ఇప్పటికైనా ఆపితే సరి.. లేకుంటే ఇరాన్ వినాశనమే



వాషింగ్టన్, మార్చి 1: ఖమేనీ మృతి విషయాన్ని ట్రంప్ తొలుత ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. "చరిత్రలో అత్యంత దుష్టులైనవారిలో ఒకరైన ఖమేనీ మరణించారు. ఇది కేవలం ఇరాన్ ప్రజలకే కాదు.. ఖమేనీ, దోపిడీదారులైన ఆయన గ్యాంగ్ పాల్పడిన దారుణాల్లో ప్రాణాలు కోల్పోయిన, బాధితులైన అమెరికన్లు, ఇతర దేశాల వారికి జరిగిన న్యాయం.. ఇరాన్ ప్రజలు తమ దేశాన్ని తిరిగి తమ చేతుల్లోకి తెచ్చుకోవడానికి ఇది ఏకైక గొప్ప అవకాశం. ఇరాన్‌లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో వారం పాటు వరుసగా భారీ స్థాయిలో బాంబు దాడులు కొనసాగుతాయి. పశ్చిమాసియాలో, తద్వారా ప్రపంచంలో శాంతి నెలకొల్పాలన్న మా లక్ష్యం నెరవేరేదాకా దాడులు ఉంటాయి.." అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా స్థావరాలపై ఎన్నడూ లేని స్థాయిలో దాడి చేస్తామని ఇరాన్‌లో మిగిలినవారు అంటున్నారని.. వారు అలా చేయకపోవడం మంచిదని చెప్పారు. లేకపోతే ఇరాన్ ఇంతకుముందెన్నడూ చూడని స్థాయిలో వినాశనాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం సీఎన్‌బీసీకి, ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలలో ట్రంప్ మరికొన్ని వివరాలు వెల్లడించారు. ఒకే ఒక్క దెబ్బతో ఇరాన్‌కు చెందిన 48 మంది అగ్రనేతలు, కీలక అధికారులను చంపేశామని పేర్కొన్నారు. 9 ఇరాన్ యుద్ధ నౌకలను ధ్వంసం చేశామన్నారు. కాగా, ఖమేనీ మృతి అనంతరం పాలన పగ్గాలు చేపట్టిన కొత్త నేతలు చర్చల కోసం తనను సంప్రదించారని ట్రంప్ చెప్పారు. నిజానికి ఇరాన్ నాయకత్వం ఈ పని ముందే చేసి ఉండాల్సిందని ట్రంప్ అన్నారు.

లోకం తీరు



ఇరాన్ మధ్యంతర సుప్రీం లీడర్‌గా అయతుల్లా అలీరేజా అరాఫీ



టెహ్రాన్: అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోవడంతో మధ్యంతర సుప్రీం లీడర్‌గా అయతుల్లా అలీరేజా అరాఫీ వ్యవహరించనున్నారు. ఇరాన్ పాలనా పగ్గాలు ముగ్గురు సభ్యుల గార్డియన్ కౌన్సిల్‌కు చేరాయి. వీరిలో ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, చీఫ్ జస్టిస్ గొలామ్ హొసేన్‌తో పాటు అయతుల్లా అలీరేజా అరాఫీ ఉన్నారు. 67 సంవత్సరాల అరాఫీ ఇరాన్ ఇస్లామిక్ సెమినరీల జాతీయ నెట్‌వర్క్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. అంతేకాదు సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే 88 మంది సభ్యుల(మత గురువులు) అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ బృందంలో కూడా ఉన్నారు. అయతుల్లా అనేది షియా ముస్లింలకు ఇచ్చే గౌరవప్రదమైన బిరుదు. అయతుల్లా అంటే దేవుడి సంకేతం అని అర్థం. అయతుల్లా అనే బిరుదు లభించాలంటే ఇరాన్‌లోని కోమ్ లేదా ఇరాక్‌లోని నజాఫ్ వంటి ప్రసిద్ధ ఇస్లామిక్ విద్యాకేంద్రాలలో దశాబ్దాల పాటు చదువుకోవాలి. వీరు ఖురాన్, ప్రవక్త బోధనలు, తర్క శాస్త్రం, ఇస్లామిక్ తత్వ శాస్త్రంలో అపారమైన పాండిత్యం కలిగి ఉంటారు. ఈ బిరుదును ఏ ప్రభుత్వమో లేదా సంస్థో అధికారికంగా ప్రకటించదు. ఆ మత పండితుడికి ఉన్న జ్ఞానం, రచనలతో పాటు ఇతర సీనియర్ మత గురువుల (సీనియర్ అయతుల్లాలు) ఆమోదంతో సహజంగానే ఈ గుర్తింపు లభిస్తుంది. కాగా, సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే 88 మంది సభ్యులను 8 ఏళ్లకు ఒకసారి ఓటువేసి ఎన్నుకుంటారు.

ఇంటికి తిరిగెళ్లేదెలా..?

- దుబాయ్, ఇతర విమానాశ్రయాల్లో చిక్కుకున్న ప్రయాణికుల భయాందోళన
- పరిస్థితి భయానకంగా ఉంది : సింధు

న్యూఢిల్లీ, దుబాయ్, మార్చి 1 : మేమున్న చోటుకి అత్యంత సమీపంలోనే బాంబు పేలింది, ఆ దట్టమైన పొగను చూడండి.. ఇప్పుడేం చెయ్యాలో తెలియడం లేదు... భయం వేస్తుంది.. ఎవరిని సాయం అడగాలో తెలియడం లేదు.. క్షణక్షణానికి పరిస్థితి మరింత భయానకంగా మారుతోంది. ఇంటికి ఎలా తిరిగెళ్లాలో, మా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు... ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సైనిక చర్య నేపథ్యంలో విమానయానం స్తంభించిపోయి దుబాయ్ సహా ఇతర విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన వారి ఆవేదన ఇది. భారత స్టార్ షట్లర్ పీవీ సింధు, కర్ణాటకకు చెందిన జేడీఎస్ ఎమ్మెల్సీ ఎస్ఎల్ బోజేగౌడ, బెంగాలీ నటి శుభశ్రీ గంగూలీ వంటి ప్రముఖులతో పాటు విద్యార్థి బృందాలు, పర్యాటకులు వందలాది మంది భారతీయులు వేర్వేరు విమానాశ్రయాల్లో చిక్కుకున్నారు. తమ ప్రయాణాలు ఆఖరి నిమిషంలో రద్దు కావడంతో వీళ్లలో చాలా మంది చేతిలో సరిపడా డబ్బు లేక ప్రత్యామ్నాయం తెలియక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రంజాన్ నేపథ్యంలో ఉమ్రా చేయడానికి భారత్ నుంచి వచ్చిన వేలాది భారతీయులు స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు విమానాలు లేక సౌదీలో ఉండిపోయారు. ఓ సదస్సు కోసం బహ్రెయిన్ వచ్చిన దాదాపు 400 మంది తెలుగు కుటుంబాలు విమానాశ్రయ మూసీ వేతతో అక్కడే ఇరుక్కుపోయారు. వీరు బస చేసిన హోటల్ సమీపంలో పేలుళ్లు సంభవించడంతో వీరిని మరో హోటల్‌కు తరలించారు. వీళ్లలో చాలా మంది చేతిలోని డబ్బు అయిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దుబాయ్, అబుధాబి, దోహా నగరాలలో కూడా వేలాది ప్రయాణికులు తదుపరి విమానాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇక, కుమారుడు యువాన్‌తో కలిసి శుభశ్రీ గంగూలీ.. ఓ హోటల్‌లో ఉండిపోయారని, ఆ హోటల్‌కు సమీపంలో పేలుడు జరిగిందని ఆమె భర్త, టీఎంసీ ఎమ్మెల్యే రాజ్ చక్రబోర్తి తెలిపారు. పుణెలోని ఇందిరా స్కూల్ ఆఫ్ బిజినెస్ స్టడీస్(ఐఎస్‌బీఎస్)కు చెందిన 84 మంది విద్యార్థులు ఐదు రోజుల స్టడీ టూర్‌కు దుబాయ్ వెళ్లి ప్రస్తుతం అక్కడ చిక్కుకున్నారు. విద్యార్థులందరినీ ఓ హోటల్‌కు తరలించామని సురక్షితంగా ఉన్నారని కళాశాల ప్రతినిధులు చెబుతున్నారు. కానీ విద్యార్థులను స్వదేశానికి తెచ్చేందుకు సాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దుబాయ్‌లో బళ్లారి, చిత్రదుర్గకు చెందిన 50మందికిపైగా మహిళలు, పురుషులు చిక్కుకున్నారు. బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డితో పాటు 35 మంది బళ్లారి వాసులు, చిత్రదుర్గకు చెందినవారు దుబాయ్ పర్యటనకు వెళ్లారు. యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన సర్వీసులు ఆపేయడంతో వారంతా దుబాయ్‌లో చిక్కుకున్నారు.



దుబాయి ఎయిర్‌పోర్టు వద్ద ప్రయాణికుల పడిగాపులు

ఆ క్షణం భయంతో పరుగులు తీశాం..



ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు బర్మింగ్‌హమ్ బయలుదేరిన స్టార్ షట్లర్ పీవీ సింధు.. తన కోచ్‌తో కలిసి దుబాయ్ విమానాశ్రయంలో ఇరుక్కుపోయారు. " ఇక్కడి భయానక పరిస్థితులు కొనసాగుతున్నాయి. గంటకు గంటకు పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. కొన్ని గంటల ముందు విమానాశ్రయంలో మేమున్న చోటుకి కొద్ది దూరంలో భారీ పేలుడు సంభవించింది. పెద్ద ఎత్తున పొగ వ్యాపించింది. నా కోచ్‌తో సహా అందరం భయంతో పరుగులు తీశాం. అది మా అందరికీ భయానక క్షణం" అంటూ తన అనుభవాన్ని పీవీ సింధు సోషల్ మీడియాలో పంచుకున్నారు. అయితే, ప్రస్తుతం తామంతా సురక్షితంగా ఉన్నామని, దుబాయ్ విమానాశ్రయ సిబ్బంది తమకు తగిన సహకారం అందించారని సింధు పేర్కొన్నారు. పరిస్థితులు సద్దుమణిగే వరకు ఎదురుచూస్తున్నానని తెలిపారు.

యుద్ధం ఎప్పుడు మొదలవుతుంది..?

- పలు ఏఐ మోడళ్లకు ప్రశ్న
- ఫిబ్రవరి 28 అని కచ్చితంగా చెప్పిన 'గ్రోక్'

న్యూఢిల్లీ, మార్చి 1: ఇరాన్‌పై అమెరికా దాడి చేసే తేదీని ఏఐ మోడల్ గ్రోక్ ముందుగానే చెప్పిందని ప్రపంచ వ్యాప్తంగా సోషల్ మీడియాలో ప్రచారాలు వైరల్‌గా మారాయి. అయితే అది అంచనా మాత్రమేనని, దాడుల గురించి దానికి ముందస్తు సమాచారం లేదని పరిశీలనల్లో తేలింది. ఇరాన్‌పై అమెరికా ఎప్పుడు దాడి చేయబోతోందనే విషయంపై ఏఐ మోడళ్ల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడం కోసం 'ది జరుసలేం పోస్ట్' అనే వార్తా సంస్థ ఫిబ్రవరి 25న ప్రముఖ ఏఐ మోడళ్లు ఆంత్రోపిక్ క్లౌడ్, గుగుల్ జెమినీ, ఓపెన్ఏఐ చాట్‌జీపీటీ, ఎక్స్ఏఐ గ్రోక్‌ను ప్రశ్నించింది. కాగా, జెనీవాలో జరుగుతున్న చర్చల దృష్ట్యా ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశం ఉందని గ్రోక్ కచ్చితమైన సమాధానం ఇచ్చింది. ఇతర మోడళ్లు మాత్రం అస్పష్ట తేదీలను పేర్కొన్నాయి. గ్రోక్ చెప్పినట్లుగానే ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్‌పై దాడులు జరపడంతో, యుద్ధ తేదీని గ్రోక్ ముందుగానే అంచనా వేసిందని అందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై ఎక్స్ఏఐ యజమాని ఎలాన్ మస్క్ స్పందించారు. భవిష్యత్తును అంచనా వేయగలగడం మేధస్సుకు ఉత్తమ ప్రమాణం అని పేర్కొన్నారు. అయితే గ్రోక్‌కు ముందస్తు సమాచారం ఉందని కానీ, అది భవిష్యత్తును అంచనా వేయగలదని ఎక్కడా చెప్పలేదు.

ఖమేనీ హత్యపై మౌనం వీడండి

- ప్రపంచ దేశాలకు భారత్‌లోని ఇరాన్ ఎంబసీ పిలుపు

న్యూఢిల్లీ, మార్చి 1: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యపై మౌనం వీడాలని, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులను తీవ్రంగా ఖండించాలని ప్రపంచ దేశాలకు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం పిలుపునిచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో ఖమేనీ మృతి చెందినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం ధ్రువీకరించింది. ఈ ఘటనపై తీవ్ర సంతాపం, దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం.. ఈ ఘోరాన్ని స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కోరుకునే దేశాలు తీవ్రంగా ఖండించాలని, ఈ చట్టవిరుద్ధ దాడులపై మౌనం వీడాలని పేర్కొంది. ఈ క్షమించరాని నేరానికి అమెరికా, ఇజ్రాయెల్‌లు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించింది. ఇదిలా ఉండగా ఆ దేశాలపై ప్రతీకార దాడులు ప్రారంభించినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేపట్టినట్లు తెలిపింది.

గగనతలాల మూసివేత..
భారతీయులకు శాపం

- గల్ఫ్‌తో పాటు అమెరికా, యూరప్ రూట్లపై ప్రభావం
- గల్ఫ్‌లోని 7 విమానాశ్రయాలలో 3,400 విమానాల రద్దు!

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడితో నెలకొన్న యుద్ధ సంక్షోభంతో ఆదివారం కూడా ప్రపంచంలో అత్యంత కీలకమైన విమానయాన మార్గమైన గల్ఫ్ ప్రాంత గగనతలం దాదాపుగా మూసుకుపోయింది. ప్రపంచంలో అత్యంత రద్దీ కలిగిన దుబాయి విమానాశ్రయంతోపాటు అబుధాబి, దోహా, కువైత్, మనామా విమానాశ్రయాలు ఆదివారం కూడా మూసి ఉండడంతో భారతీయులతో సహా అనేక దేశాల అంతర్జాతీయ విమాన ప్రయాణికులు అగమ్యగోచర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సోమవారం వీటిని పునరుద్ధరిస్తామని ఎయిర్‌లైన్స్‌లు ప్రకటించాయి. దుబాయి, అబుదాబి, దోహాలోని కీలకమైన హబ్ విమానాశ్రయాల మూసివేతతో వెయ్యికి పైగా విమానాలను ప్రధాన పశ్చిమాసియా ఎయిర్‌లైన్స్ రద్దు చేయాల్సి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ విమానాశ్రయాల్లో ఎమిరేట్స్, ఖతార్ ఎయిర్‌వేస్, ఎతిహాద్ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. సాధారణంగా వీటి ద్వారా రోజుకు దాదాపు 90వేల మంది ప్రయాణిస్తుంటారని, అనేక మంది పశ్చిమాసియాలోని గమ్యస్థానాలకు వెళ్తుంటారని ఏవియేషన్ ఎనలిటిక్స్ సంస్థ సిరియం పేర్కొంది. కాగా అనేక మంది ఒమాన్ రాజధాని మస్కట్‌కు రోడ్డు మార్గం గుండా చేరుకొని అక్కడి నుంచి విమానంలో భారత్‌కు చేరడానికి ప్రయత్నిస్తున్నా అర్హులైన వారికి మాత్రమే ఒమానీ వీసా లభిస్తుండడంతో అందరికి అవకాశం దక్కడం లేదు. విమానాలు అందుబాటులో లేకపోవడంతో భారత్-గల్ఫ్ దేశాలకు మాత్రమే కాకుండా అమెరికా, ఐరోపా దేశాలకు కూడా భారతీయుల రాకపోకలు తాత్కాలికంగా స్తంభించిపోయాయి. దీంతో ఖండాతరాలన్నీ అల్లకల్లోలమయ్యాయి. హైదరాబాద్ నుంచి న్యూయార్క్‌కు లేదా సింగపూర్ నుంచి ఫ్రాంక్‌ఫర్ట్‌కు, నైరోబీ నుంచి లండన్‌కు వెళ్లాల్సిన ప్రతి విమానంపై ప్రభావం పడింది. భారత్‌తోపాటు ఇతర చోట్ల ప్రయాణాలకు సిద్ధమైన అనేక మంది ఆందోళన చెందుతున్నారు. గల్ఫ్ దేశాలలోని విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన భారతీయ ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చడానికి సంబంధిత అధికారవర్గాలతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం భారతీయ ఎంబసీలు ప్రయత్నిస్తున్నాయి. గల్ఫ్‌దేశాలు, ఇరాన్, ఇరాక్ గగనతలం భారత్‌తో పాటు మిగిలిన ఆసియా దేశాలను అటు ఐరోపా, ఉత్తర అమెరికా, ఆఫ్రికా ఖండాల మధ్యలో కీలక వారధిగా పని చేస్తుంది. భారత్, ఆసియా దేశాలకు అమెరికా, ఐరోపా ఖండాల విమానాలు ఈ మార్గం గుండా వెళ్లాల్సి ఉంటుంది. అకస్మాత్తుగా ఇరాన్, ఇరాక్, కువైత్, జోర్డాన్, ఇజ్రాయిల్, బహ్రెయిన్, ఖతార్ దేశాలు తమ గగనతలాన్ని పూర్తిగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాక్షికంగా మూసివేయగా మిగిలిన దేశాలన్నీ కూడా విమానాల రాకపోకలలో మార్పులను ప్రకటించడంతో వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలింది. ఆదివారం గల్ఫ్‌లోని ఏడు విమానాశ్రయాలలో 3,400 విమానాలను రద్దు చేసినట్లు వార్తలొచ్చాయి. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేయడం ద్వారా ఇరాన్ పరోక్షంగా దుబాయితో గల్ఫ్ ఆర్థిక నాడికి కీలకమైన విమానయాన రంగంపై దాడి చేసిందని భావిస్తున్నారు. గల్ఫ్, ఇరాన్, ఇరాక్ దేశాల మీదుగాకాకుండా ఇతర మార్గాల గుండా వెళ్తే దూరం పెరిగి అదనపు ఇంధనం అవసరం ఉంటుంది. దీనికోసం మార్గమధ్యలోని దేశాల్లో ఇంధనం నింపుకోవాలి లేదా విమానాలలో ప్రయాణికులను తగ్గించి అదనపు ట్యాంకు ఏర్పాటు చేసుకోవాలి. విమానయాన సంస్థలకు ఇది అదనపు ఆర్థిక భారం కాగా, ప్రయాణికులకు లగేజి, అధిక ప్రయాణ గంటలకు సంబంధించిన ఇబ్బందులు ఉంటాయి. ఇక టర్కిష్ ఎయిర్‌లైన్స్ లెబనాన్, సిరియా, ఇరాక్, ఇరాన్, జోర్డాన్‌కు సోమవారం వరకు రద్దు చేసింది. ఖతార్, కువైత్, బహ్రెయిన్, యూఏఈ, ఒమాన్‌కు కూడా విమానాలను నిలిపివేసింది. అమెరికాకు చెందిన డెల్టా ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్.. టెల్ అవీవ్‌కు కనీసం వారాంతం వరకు విమానాలను నిలిపివేశాయి.



ముంబై ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల అవస్థలు

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 100 అంతర్జాతీయ విమానాల రద్దు

న్యూఢిల్లీ, మార్చి 1: పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో విమానయాన కంపెనీలు ఆ ప్రాంతానికే కాకుండా ఇతర ప్రాంతాలకు భారీ స్థాయిలో తమ విమాన సర్వీసులను రద్దు చేశాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకున్నారు. ఎయిర్ ఇండియా పశ్చిమాసియాలోని దేశాలకు అన్ని విమానాలను రద్దు చేసింది. ఎయిర్ ఇండియా 50 అంతర్జాతీయ విమానాలను రద్దు చేసింది. సంస్థ రద్దు చేసిన వాటిలో ముంబై-లండన్, ఢిల్లీ-బర్మింగ్‌హామ్, ఢిల్లీ-అమ్‌స్టర్‌డామ్, ఢిల్లీ-జూరిచ్, ఢిల్లీ-మిలాన్, ఢిల్లీ-వియన్నా, బెంగళూరు-లండన్(హీత్రూ), ఢిల్లీ-కోపెన్‌హెగెన్, ఢిల్లీ-లండన్(హీత్రూ), ఢిల్లీ-ఫ్రాంక్‌ఫర్ట్, ఢిల్లీ-న్యూయార్క్, ముంబై-న్యూయార్క్, ముంబై-నెవార్క్, ఢిల్లీ-చికాగో, ఢిల్లీ-టొరంటో, ముంబై-ఫ్రాంక్‌ఫర్ట్, ఢిల్లీ-పారిస్ మధ్య రాకపోకలు సాగించే విమానాలు కూడా ఉన్నాయి. ఆదివారం ఢిల్లీ విమానాశ్రయంలో కనీసం 100 అంతర్జాతీయ విమానాలు రద్దయ్యాయి. ఇందులో 60 వెళ్లే, 40 వచ్చే విమానాలున్నట్టు తెలుస్తోంది. ఇక చెన్నై, గల్ఫ్ దేశాల మధ్య 18 అంతర్జాతీయ విమానాలు రద్దయినట్టు చెన్నై విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. దుబాయి-తిరుచిరాపల్లి సెక్టార్‌లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఆదివారం రద్దయినట్టు తిరుచిరాపల్లి ఎయిర్‌పోర్ట్ పేర్కొంది. కేరళలోని నాలుగు విమానాశ్రయాల నుంచి గల్ఫ్‌కు వెళ్లాల్సిన మెజారిటీ విమానాలు రద్దయ్యాయి. గల్ఫ్ దేశాలకు తిరువనంతపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లాల్సిన 37 అంతర్జాతీయ విమానాలు శనివారం మధ్యాహ్నం నుంచి రద్దయ్యాయి. ఇందులో ఆదివారానికి సంబంధించిన 26 విమానాలున్నాయి. కన్నూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన ఆరు విమానాలు ఆదివారం రద్దయ్యాయి. కొచ్చిన్ విమానాశ్రయం నుంచి 35, కాలికట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి గల్ఫ్‌కు వెళ్లే దాదాపు 10 విమానాలు రద్దయ్యాయి. కాగా పశ్చిమాసియాలోని పలు దేశాలు తమ గగనతలాలను మూసివేయడం వల్ల ఆదివారం 444 అంతర్జాతీయ విమానాలను దేశీయ విమానయాన సంస్థలు రద్దు చేసే అవకాశం ఉందని పౌర విమానయాన శాఖ వెల్లడించింది.

అమెరికా దాడులను సమర్థిస్తున్నాం

ఆస్ట్రేలియా, కెనడా ప్రకటన.. అగ్రరాజ్యం తీరును ఖండించిన రష్యా, చైనా

బ్రసెల్స్, న్యూఢిల్లీ, మార్చి 1 : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమైన నేపథ్యంలో పలు ప్రపంచ దేశాల అధినేతలు స్పందించారు. తక్షణం చర్చలు జరపాలని ఆయా దేశాలకు సూచించారు. లేని పక్షంలో పశ్చిమాసియా అంతటా ఘర్షణలు చోటు చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటానియో గుటెరెస్ ఈ విషయమై మాట్లాడుతూ.. ఈ దాడులు అంతర్జాతీయ శాంతి, భద్రతకు ముప్పని పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాలను అన్ని దేశాలు గౌరవించాలని సూచించారు. దాడులను వైరి పక్షాలు తక్షణం నిలిపివేయాలని సూచించారు. వెంటనే చర్చలు జరపాలని పలు దేశాల అధినేతలు సూచించారు. ఈ నేపథ్యంలో ఆయా దేశాల అధినేతలు ఏమన్నారో పరిశీలిస్తే..

సమర్థించిన దేశాలు

అమెరికా చర్యలకు మద్దతు : ఆస్ట్రేలియా అధ్యక్షుడు ఆంథోని



ఇరాన్ అణు బాంబును సమకూర్చుకోకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నాం. ఇరాన్‌లో ప్రస్తుతమున్నది ప్రపంచంలో అస్థిరత్వాన్ని పెంచే నాయకత్వం. ఆస్ట్రేలియా గడ్డపై వారి ఆధ్వర్యంలో రెండు దాడులు కూడా జరిగాయి. (గత ఆగస్టులో ఆస్ట్రేలియా ఇరాన్‌తో దౌత్య సంబంధాలను తెంచుకుంది. ఇరాన్ రాయబారిని బహిష్కరించింది.)

ఇరాన్ దాడులు సరికాదు : బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్



పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ విచక్షణారహిత దాడులు సరికాదు. ఇరాన్ ప్రస్తుత పాలకవర్గం అసమ్మతిని అణచివేసేందుకు వేలాది మంది సొంత ప్రజలను హత్య చేసింది. ఆ ప్రాంతంలో అస్థిరత్వానికి కారణమైంది. వారు ఎట్టి పరిస్థితిలోనూ అణు బాంబును సమకూర్చుకోకూడదు. అదే మా, మా మిత్ర పక్షాల ప్రధాన లక్ష్యం.

మిడిల్ ఈస్ట్‌లో ఉగ్రవాదానికి ఇరానే కారణం : కెనడా ప్రధాని

మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న అస్థిరత్వానికి, ఉగ్రవాదానికి ఇరానే కారణం. అమెరికా చేపట్టిన సైనిక చర్యకు మద్దతిస్తున్నాం.

చర్చలతోనే సమస్యకు పరిష్కారం: ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

కేవలం సైనిక చర్యలతో ఇరాన్ అణు కార్యక్రమాన్ని, క్షిపణుల తయారీని, ప్రాంతీయ స్థిరత్వాన్ని సాధించలేం. ఇరాన్‌తో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి గట్టి చొరవ తీసుకోవాల్సి ఉంది. ఈ దాడులతో ఫ్రాన్స్‌కు సంబంధం లేదు.

పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు సరికాదు : 22 దేశాల అరబ్ లీగ్

ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కోరుకుంటున్న పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు వాటి సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమే. విచక్షణారహితమైన ఈ దాడుల వల్ల ఈ ప్రాంతమంతటికీ యుద్ధం విస్తరించే ప్రమాదముంది. తక్షణం సైనిక చర్యలు ఆపి చర్చలు జరపాలి.

వ్యతిరేకించిన దేశాలు

దాడులను ఆపాలి : రష్యా అధ్యక్షుడు పుతిన్



ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్య అన్ని అంతర్జాతీయ చట్టాలను, నైతిక విలువలను ఉల్లంఘించి చేపట్టిన దారుణ చర్య. దీన్ని ఖండిస్తున్నాం. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను వెంటనే ఆపాలి.

ఇరాన్‌పై దాడులు ఆందోళనకరం : చైనా



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. తక్షణం సైనిక చర్యలను నిలిపివేసి చర్చలు జరపాలని కోరుతున్నాం. ఇరాన్ సార్వభౌమత్వం, భద్రత, సమగ్రతను గౌరవించాలి.

దాడులు సరికాదు : స్పెయిన్ ప్రధాని సాంచెజ్


ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ఏకపక్ష దాడులను ఖండిస్తున్నాం. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతాయి. తక్షణం దాడులను నిలిపివేయాలి. అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలి. చర్చలు జరిపి ఆ ప్రాంతంలో సమస్యలకు పరిష్కారం సాధించాలి.

ఖమేనీ హత్యను ఖండిస్తున్నాం : కాంగ్రెస్

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యను ఖండిస్తున్నాం. ఇది కావాలని చేసిన హత్య. ఆయన కుటుంబానికి, ఇరాన్ ప్రజలకు మా సానుభూతి. సైనిక చర్యల ద్వారా కాకుండా.. అంతర్జాతీయ చట్టాలను గౌరవించి చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి. పశ్చిమాసియాలో ఘర్షణలు ఆందోళనకరం.

ఇరాన్‌లో అధికార మార్పిడి బాధ్యతలు తీసుకుంటున్నా

- ఇస్లామిక్ రిపబ్లిక్ శకం ముగిసింది
- ప్రజాస్వామ్యంవైపు అడుగులు పడతాయి
- ఇరాన్ మాజీ యువరాజు రెజా పహ్లవీ వ్యాఖ్య



వాషింగ్టన్, మార్చి 1: ఖమేనీ మృతితో ఇరాన్‌లో ఇస్లామిక్ రిపబ్లిక్ శకం ముగిసి, ప్రజాస్వామ్యం వైపు అడుగులు పడతాయని ఇరాన్ మాజీ యువరాజు రెజా పహ్లవీ పేర్కొన్నారు. ఇరాన్‌లో అధికార మార్పిడి విషయంలో తాను బాధ్యత తీసుకుంటున్నానని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సరైన నాయకత్వం లేకపోతే ఇరాన్ కుప్పకూలిపోతుందని రెజా పహ్లవీ అన్నారు. స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య ఇరాన్‌గా రూపుదిద్దుకునేందుకు దేశంలోని మిలటరీ, న్యాయ, భద్రతా శక్తులన్నీ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఇరాన్ కొత్త రాజ్యాంగాన్ని రూపొందించుకుని, ప్రపంచ దేశాల పర్యవేక్షణలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు వెళ్లాలని.. ఇందుకోసం దేశంలో రెఫరెండం నిర్వహించాలని ప్రతిపాదించారు. ఎన్నికల అనంతరం కొత్త, ప్రజాస్వామ్య ప్రభుత్వానికి బాధ్యతలు అప్పగించాలని పేర్కొన్నారు. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవానికి ముందు రాజు మహమ్మద్ రెజా పహ్లవీ పాలనలో కొనసాగేది. 1979లో విప్లవకారులు రాచరికాన్ని గద్దె దింపి ఇస్లామిక్ రిపబ్లిక్‌ను స్థాపించారు. తండ్రితో కలిసి రెజా పహ్లవీ అమెరికాలో ప్రవాసంలో ఉంటున్నారు. ఇటీవల ఇరాన్‌లో ఆందోళనలు జరిగినప్పుడు.. ఖమేనీ తప్పుకోవాలంటూ, రెజా పహ్లవీ ఇరాన్‌కు రావాలంటూ నినాదాలు నినాదాలు వినిపించడం గమనార్హం.

బిక్కుబిక్కుమంటున్న తెలుగువారు

- కువైత్, ఖతార్‌లో నెల్లూరు వాసుల ఆందోళన
- దుబాయ్‌లో చిక్కుకున్న అనంత వాసులు
- స్వదేశానికి వచ్చే దారిలేక విమానాశ్రయంలోనే
- పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఏపీ ప్రభుత్వం ఆరా
- ఆవేదన వద్దు అండగా ఉంటాం: కొండపల్లి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



కువైత్ విమానాశ్రయంలో బిక్కుబిక్కు మంటున్న ప్రయాణికులు

గల్ఫ్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణంతో ఆయా దేశాల్లో పనుల నిమిత్తం వెళ్లి, అక్కడే నివసిస్తున్న ఏపీ వాసులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ముఖ్యంగా కువైత్, ఖతార్‌లలో ఎమర్జెన్సీ విధించడంతో ఏపీకి చెందిన వారు.. తమ తమ గదులకే పరిమితమయ్యారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో అలమటిస్తున్నారు. కొందరు స్వదేశానికి వచ్చేందుకు ప్రయత్నించినా గగన తలాల మూసివేత, విమానాల రద్దు కారణంగా విమానాశ్రయాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. నెల్లూరు, అనంతపురం, తిరుపతి జిల్లాలకు చెందిన వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, గల్ఫ్ దేశాల్లో ఉన్న ఏపీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎప్పటికప్పుడు విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఏపీ ఎన్నారై హెల్ప్ లైన్ నెంబర్లు 910850027678, 910863234078లలో సంప్రదించాలని మంత్రి సూచించారు.

గదులకే పరిమితం

కువైత్, ఖతార్‌లలో పలుచోట్ల ఎయిర్‌బేస్‌లపై దాడులు జరుగుతున్నాయని, దీంతో భారీ శబ్దాలు వస్తుండడంతో అల్లాడిపోతున్నామని ఆయా దేశాల్లో ఉంటున్న నెల్లూరు జిల్లాకు చెందిన వారు తమ కుటుంబ సభ్యులకు తెలిపారు. ఖతార్‌లో అమెరికాకు సొంత ఎయిర్‌బేస్ ఉండడంతో దాన్ని స్థావరంగా చేసుకుని దాడులు విపరీతంగా సాగుతున్నాయని చెప్పారు. దీంతో తమ వారికి ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఇక్కడున్న వారు ఆందోళన చెందుతున్నారు. కువైత్, ఖతార్ దేశాలు ఎమర్జెన్సీ ప్రకటించడంతో పొట్టచేతపట్టుకుని ఆయా దేశాలకు వెళ్లినవారు గదులకే పరిమితమైనట్లు తెలిపారు. ప్రధానంగా నెల్లూరు జిల్లాలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, అనంతసాగరం, కోవూరు, కావలి, ఏఎస్‌పేట, ఆత్మకూరు, మర్రిపాడు, వింజమూరు, నెల్లూరు తదితర మండలాలకు చెందిన వారు అధికంగా ఆయా దేశాల్లో ఉన్నారు. వారంతా డ్రైవర్లు, ఇంటి, వంటపని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, నర్సులు, బేల్దారి, ఇతరత్రా పనులు చేసేందుకు వెళ్లి అక్కడే జీవనం సాగిస్తున్నారు. యుద్ధం కొనసాగుతుండడంతో కొందరు తమ స్వస్థలాలకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. సామగ్రి, పిల్లాపాపలతో విమానాశ్రయానికి వెళ్లారు. అయితే, అక్కడి ప్రభుత్వాలు విమాన సేవలను రద్దు చేశాయి. దీంతో కొందరు వెనుదిరగగా, మరికొందరు పిల్లాపాపలు, లగేజీతో విమానాశ్రయాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఏ నిమిషానికి ఏ వార్త వినాల్సి వస్తుందోనని నెల్లూలోని వారి బంధువులు తల్లడిల్లుతున్నారు.

దుబాయ్‌లో అనంతవాసులు

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు దుబాయ్‌లో చిక్కుకున్నారు. దీంతో వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఐఐఎఫ్ఎల్ గోల్డ్‌లోన్ సంస్థ తరపున అందులో పనిచేసే 350 మందిని దుబాయ్ టూర్‌కు కొన్నిరోజుల క్రితం తీసుకెళ్లారు. వారిలో కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లికి చెందిన కురుబ ఎర్రిస్వామి, అదే మండలంలోని ఒంటిమిద్దె వాసి తలారి రామాంజనేయులు, కంబదూరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన చిన్నయ్య ఉన్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో విమానం ఎక్కి భారత్‌కు రావాల్సి ఉంది. విమానాశ్రయంపై దాడుల నేపథ్యంలో విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతో యువకులు అక్కడే చిక్కుకుపోయారు. కళ్యాణదుర్గం రెవెన్యూ అధికారులు, పోలీసులు వారి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ప్రస్తుతానికి ఆ ముగ్గురు యువకులు క్షేమంగా ఉన్నారని తెలిసింది.

చర్యలు చేపడుతున్నాం: కొండపల్లి

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న ఏపీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా దేశాల్లో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు, పర్యాటకులు సహా ఇతర పౌరులెవరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు సంయమనం పాటించాలని, త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని మంత్రి తెలిపారు. ఆయా దేశాల్లో ఉన్న రాష్ట్ర పౌరులు ఇండియన్ ఎంబీసీలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇరాన్, ఇజ్రాయెల్‌లలో ఉన్న భారతీయల భద్రతపై కేంద్ర ప్రభుత్వం, భారత విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు సూచనతో ఏపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. మరింత సమాచారం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఏపీఎన్ఆర్‌టిఎస్.ఏపీ.జీవో.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రాణాలు అరచేతిలో..

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ముదరడంతో అక్కడున్న తిరుపతి జిల్లా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడేమి జరుగుతుందోనని.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నామని కువైత్‌లో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న డక్కిలి మండలానికి చెందిన బాలాజి ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి భయాందోళన వ్యక్తం చేశారు. ప్రధాన నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారని చెప్పారు.

ఆదేశాలు పాటిస్తున్నాం

కువైత్‌లోని మిలటరీ, ఎయిర్‌పోర్టు వద్దకు వెళ్లరాదని కువైత్ ప్రభుత్వం, ఇండియన్ ఎంబసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారని, వాటిని పాటిస్తున్నామని కువైత్‌లో ఉంటున్న తిరుపతి జిల్లా రైల్వేకోడూరువాసి పత్తి సుబ్బరాయుడు ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ ద్వారా తెలిపారు. కాగా, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల నుంచి సుమారు లక్ష మందికిపైగా కువైత్, ఖతర్, మస్కట్, సౌదీ, దుబాయ్, బహ్రెయిన్ తదితర దేశాలకు వెళ్లి పనులు చేస్తున్నారు.

ఇంటిపై నుంచే యుద్ధ విమానాలు!

శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండల కేంద్రానికి చెందిన టైలర్ శివశంకర్ కువైత్‌లోని సాహాహిల్ ప్రాంతంలో ఉంటున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇళ్ల నుంచి ఎవ్వరినీ బయటకు రానివ్వట్లేదని, తమ ఇంటి పైనుంచే యుద్ధ విమానాలు వెళ్తున్నాయని తెలిపారు. భయంభయంగా జీవనం సాగిస్తున్నామని సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు.

ఏం జరుగుతుందోనని భయం!


నెల్లూరు జిల్లా కొండాపురం మండలానికి చెందిన షేక్ మీరావలి సుమారు 20 ఏళ్ల నుంచి కువైత్‌లో ఉంటున్నారు. కువైత్‌లో పరిస్థితి ఇబ్బందిగా మారిందని తెలిపారు. విమానాశ్రయంపై బాంబులు పడి సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. స్వదేశానికి తిరిగి వద్దామనుకున్నా, విమాన సర్వీసులు ఆపివేయడంతో ఇబ్బందికర వాతావరణం నెలకొందని తెలిపారు. ఏం జరుగుతుందోనని భయంగా ఉన్నట్టు తన కుటుంబసభ్యులకు ఫోన్‌లో తెలిపారు.

కుప్పకూలనున్న అమెరికా సామ్రాజ్యం

» సగం మంది అమెరికన్లకు ట్రంప్ అంటే ఇష్టమే లేదు

» ఇరాన్‌ను ఏమీ చేయలేరు.. చివరి ప్రసంగంలో ఖమేనీ

టెహ్రాన్, మార్చి 1: అమెరికా సామ్రాజ్యం పతనం దిశగా పయనిస్తోందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ చివరిసారిగా వ్యాఖ్యానించారు. జీవితంలో చివరి సారిగా చేసిన బహిరంగ ప్రసంగంలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఆయన మరణించిన అనంతరం చివరి ప్రసంగానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 1978లో జరిగిన తబ్రిజ్ విప్లవం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 17న తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లో ఆయన చివరిసారిగా ప్రసంగించారు. ఈ ప్రసంగంలో అమెరికాను, ట్రంప్‌ను ఘాటుగా విమర్శించారు. "అమెరికా గురించి కొన్ని మాటలు చెప్పాలి. ఆ దేశ వ్యవస్థ నిజంగా పతనమవుతోంది. కుప్పకూలే దిశగా ఆ సామ్రాజ్యం పయనిస్తోంది. నిజంగా ఆ సామ్రాజ్యం కుప్పకూలుతుంది. వారి ఆర్థిక వ్యవస్థలో చాలా సమస్యలు ఉన్నాయి. విధానాల పరంగా, సమాజంలోనూ సమస్యలు ఉన్నాయి. ప్రస్తుత అధ్యక్షుడిని సగం మంది అమెరికన్లు ఆమోదించడం లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్-అమెరికా సంబంధాలపై ఖమేనీ మాట్లాడుతూ "ఇరాన్‌ను మింగేయాలని అమెరికా భావిస్తోంది. అది జరగకుండా ఇస్లామిక్ రిపబ్లిక్ అడ్డుపడుతోంది. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను గత 47 ఏళ్లుగా అమెరికా నిర్మూలించలేకపోయిందని సాక్షాత్తూ అధ్యక్షుడే అన్నారు. అమెరికా నాయకులు ఏమీ చేయలేకపోయారని ఆయనే ఫిర్యాదు చేస్తున్నారు. ఆ అంగీకారం వాస్తవమైనదే. నేనొక మాట చెబుతున్నా.. 'మీరు కూడా ఏమీ చేయలేరు'. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌ను నిర్మూలించలేరు" అని అన్నారు. దీర్ఘకాలిక యుద్ధం సంభవిస్తే నిలబడే సామర్థ్యం అమెరికాకు లేదని ఖమేనీ చెప్పారు. "ప్రపంచంలో అత్యంత బలమైన మిలటరీ శక్తి అని చెప్పుకొంటున్నప్పటికీ కొన్ని సార్లు కిందపడితే తిరిగి లేవలేదు" అని విమర్శించారు. సుప్రీం లీడర్ మరణించినట్టు ట్రంప్ ప్రకటించిన అనంతరం ఖమేనీ అధికారిక ఎక్స్ ఖాతాలో పర్షియన్ భాషలో మెసేజ్ దర్శనమిచ్చింది. ఆయనను హైదర్ అని కీర్తించారు. షియా ఇస్లాంలో మొదటి ఇమామ్.. హైదర్ కావడం గమనార్హం.



ఫిబ్రవరి 17న ఇరాన్ ప్రజలను ఉద్దేశించి ఖమేనీ ప్రసంగించినప్పటి చిత్రం. ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే చివరిసారి

ఖమేనీ మృతితో అలీపుర శోకసంద్రం

» 1986లో కర్ణాటకలోని అలీపురను సందర్శించిన ఖమేనీ

బెంగళూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణ వార్తతో కర్ణాటకలోని చిక్కబళ్ళాపుర జిల్లా గౌరీబిదనూరు తాలూకా అలీపుర గ్రామం శోకసంద్రంగా మారింది. 'మినీ ఇరాన్'గా పిలిచే అలీపుర గ్రామంలో స్థానికులు ఆదివారం స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి ర్యాలీ చేపట్టారు. షియాలు అధికంగా ఉండే ఈ గ్రామంలో.. ఇరాన్ సుప్రీం నాయకుడికి నివాళిగా మూడు రోజులు సంతాప దినాలు ప్రకటించారు. 1986లో ఖమేనీ అలీపుర గ్రామానికి వచ్చారు. స్థానిక మసీదులో నమాజ్ చదివారు. ఆయన పర్యటన తర్వాత అలీపుర, ఇరాన్ మధ్య బంధం మరింత బలపడింది. అలీపురలోని 20 వేల మంది ఖమేనీని మత గురువుగా భావిస్తారు. ఆయన పేరుతోనే స్థానికంగా ఓ ఆస్పత్రి కూడా ఉంది. ఖమేనీ మరణ వార్తతో ఈ గ్రామంలో విషాదం నెలకొంది. అలీపురలోని అనేక కుటుంబాలకు ఇరాన్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి. కొంతమంది ఉన్నత విద్య ఉపాధి కోసం ఇరాన్‌లోనే నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో యుద్ధ సమయంలో ఇరాన్‌లో చిక్కుకున్న తమ బంధువుల కోసం గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఖమేనీ మృతిపై సీఎం సిద్దరామయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఖమేనీ ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

అరబ్ దేశాలు అతలాకుతలం!

ఇరాన్ క్షిపణి దాడులతో ప్రజల్లో తీవ్ర ఆందోళన.. దాడుల వల్ల నష్టం తీవ్రంగా లేకున్నా ఉద్రిక్తంగా పరిస్థితి

» ఆయా దేశాల్లోని భారతీయుల క్షేమంపై మనదేశంలో ఆందోళన

హైదరాబాద్ సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియా దేశాలు దద్దరిల్లుతున్నాయి. తమ దేశ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్యతో ప్రతీకారంతో రగిలిపోతున్న ఇరాన్.. సౌదీ, ఖతార్, కువైట్, యూఏఈ, ఇరాక్, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై విచక్షణా రహితంగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది. దాడులు ఆపాలని ఆయా దేశాలతోపాటు అమెరికా, ఇజ్రాయెల్ హెచ్చరించినా ఇరాన్ వెనక్కు తగ్గటం లేదు. ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు జనావాసాలపై కూడా పడుతుండటంతో ప్రజలు వణికిపోతున్నారు. చాలా ప్రాంతాల్లో జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. తమకు సంబంధంలేని యుద్ధాన్ని తమపై రుద్దారని యూఏఈ, ఖతార్, సౌదీ తదితర దేశాల ప్రజలు అసహనంతో ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి.

భారతీయుల్లో ఆందోళన

ఈ దేశాల్లో భారతీయులు భారీగా ఉన్నారు. యుద్ధం నేపథ్యంలో అక్కడి తమ బంధుమిత్రుల యోగక్షేమాలపై మనదేశంలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణాన ఏ వార్త వినాల్సి వస్తుందో అన్న భయంతో గడుపుతున్నారు. ఎప్పటికప్పుడు అక్కడి వాళ్ల క్షేమ సమాచారం తెలుసుకుంటున్నారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన భారతీయుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు కూడా భారీగా ఉన్నారు. యూఏఈలో 4 లక్షల మంది తెలుగు వారున్నారని అంచనా. సౌదీ అరేబియాలో 3.9 లక్షలు, బహ్రెయిన్‌లో 50 వేలు, కువైట్‌లో రెండు లక్షల మంది తెలుగువారు నివసిస్తున్నారు. రంజాన్ మాసం కావడంతో వీరిలో కొంతమంది స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. అమెరికా, యూరప్ తదితర దేశాల నుంచి స్వదేశానికి వస్తూ కనెక్టింగ్ ఫ్లైట్స్ కోసం దుబాయి, అబుదాబీ, షార్జా తదితర విమానాశ్రయాల్లో కొందరు ఆగిపోయారు. ఈ దేశాల్లో విమాన సర్వీసులన్నీ రద్దు కావటంతో వీరంతా ఆయా చోట్ల చిక్కుకుపోయారు. కువైట్‌లోని తమ బంధువులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని హైదరాబాద్‌లోని పురానా హవేలీకి చెందిన మొహమ్మద్ సైఫుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. బహ్రెయిన్‌లోని తన తమ్ముడి పరిస్థితి కూడా అలాగే ఉందని చాంద్రాయణగుట్టకు చెందిన షకీల్ మొహియుద్దీన్ చెప్పారు.



ఖతార్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌పై దాడితో దట్టంగా వెలువడుతున్న పొగ, ఇరాన్ దాడితో బహ్రెయిన్‌లో దెబ్బతిన్న భవనం

ఇరాన్-అమెరికా దౌత్యవేత్తల మధ్య తీవ్ర వాగ్వాదం

» దాడులను నిలిపివేయాలని యూఎన్‌వో విజ్ఞప్తి

న్యూయార్క్, మార్చి 1: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో శనివారం జరిగిన ఐక్యరాజ్యసమితి భద్రతామండలి అత్యవసర సమావేశం ఆయా దేశాల ప్రతినిధుల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ప్రాంతీయ యుద్ధ భయాల దృష్ట్యా తక్షణమే దాడులు ఆపి చర్చల దిశగా అడుగులు వేయాలని ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ విజ్ఞప్తి చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంటూనే, అరబ్ దేశాల సార్వభౌమత్వానికి భంగం కలిగించిన ఇరాన్ ప్రతీకార చర్యలను కూడా ఖండించారు. అయితే, అమెరికా రాయబారి మైక్ వాల్జ్ తమ సైనిక చర్యలను గట్టిగా సమర్థించుకున్నారు. "ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదనేది కేవలం రాజకీయ నిర్ణయం కాదు. ప్రపంచ భద్రతకు సంబంధించిన విషయం."అని ఆయన స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ రాయబారి సైతం దాడులు అనివార్యమని పేర్కొన్నారు. అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులతో ప్రపంచాన్ని బెదిరించే ఏ శక్తినైనా అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. చర్చలు ముగిసే సమయంలో అమెరికా, ఇరాన్ రాయబారుల మధ్య వ్యక్తిగత విమర్శలు సాగాయి. "అమెరికా ప్రతినిధి మర్యాదగా మాట్లాడటం నేర్చుకోవాలి" అని ఇరాన్ ప్రతినిధి అమీర్ ఇరవానీ హెచ్చరించారు. దీనికి మైక్ వాల్జ్ బదులిస్తూ, "వేలమంది సొంత ప్రజలనే పొట్టన బెట్టుకుని, నియంతృత్వంతో పాలించే దేశ ప్రతినిధి మాటలకు నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు." అన్నారు.

పాక్‌లో అమెరికా కాన్సులేట్ ముట్టడి

» పోలీసుల కాల్పుల్లో పది మంది మృతి

» ప్రధాన నగరాల్లో వెల్లువెత్తిన నిరసనలు

» ఇస్లామాబాద్‌లో 144 సెక్షన్ అమలు

కరాచీ, మార్చి 1: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి నిరసనగా పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. కరాచీలోని అమెరికా కాన్సులేట్ ముట్టడికి నిరసనకారులు ప్రయత్నించారు. రాళ్లు, కర్రలతో వందలాది మంది విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులకు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో పదిమంది మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నలుగురు పోలీసులు ఉన్నారు. నిరసనకారులు పోలీసులపై దాడికి దిగడంతో పరిస్థితిని అదుపు చేయడానికి టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లను ఉపయోగించాల్సి వచ్చిందని సీనియర్ పోలీసు అధికారి ఎస్ఎస్‌పీ ఆసద్ రెజా వెల్లడించారు. సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను పెంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిరసనల నేపథ్యంలో కాన్సులేట్‌కు వెళ్లే అన్ని దారులను మూసేశారు. నిరసనకారులపై కాన్సులేట్‌కు కాపలా ఉన్న అమెరికా భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారన్న వార్తలను పాక్ ప్రభుత్వం ఖండించింది. మరోవైపు ఇస్లామాబాద్, లాహోర్‌ల్లోనూ నిరసనకారులు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో 144 సెక్షన్ విధించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులకు వ్యతిరేకంగా లాహోర్‌లోని ప్రెస్ క్లబ్ వద్ద నిరసనలు చేపట్టారు. లాహోర్, ఇస్లామాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కరాచీ, లహోర్, పెషావర్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలను, అలాగే ఇస్లామాబాద్‌లోని యూఎస్ ఎంబసీ వద్ద నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ తెలిపింది.



కరాచీలోని అమెరికా కాన్సులేట్ వద్ద భద్రత

చెన్నైలోనూ ముట్టడికి యత్నం

ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ హత్య, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా చెన్నైలో ఆదివారం పలు ముస్లిం సంస్థలు తీవ్ర నిరసన తెలిపాయి. ఈ నిరసనలో పాల్గొన్న వందలాది మంది ఆందోళనకారులు స్థానిక అన్నాసాలైలోని అమెరికా రాయబార కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. అయితే పోలీసులు.. నిరసనకారులను స్థానిక రాయపేటలోనే అడ్డుకుని శాంతింపజేశారు.

జమ్ముకశ్మీర్‌లో వెల్లువెత్తిన నిరసన

» ఖమేనీ హత్యను ఖండిస్తూ రోడ్డెక్కిన నిరసనకారులు

శ్రీనగర్, మార్చి 1: ఖమేనీ హత్యకు వ్యతిరేకంగా జమ్ముకశ్మీర్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. శ్రీనగర్ సహా కశ్మీర్‌లోని అనేక ప్రాంతాల్లో వేలాది మంది నిరసనకారులు ఆదివారం వీధుల్లోకి వచ్చి అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో తమ నాయకుడు ఖమీనే మృతిచెందారని ఇరాన్ అధికారిక మీడియా ఆదివారం తెల్లవారుజామున ధ్రువీకరించింది. దీంతో షియాల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో నిరసనలు చెలరేగాయని జమ్ముకశ్మీర్ అధికారులు వెల్లడించారు. కశ్మీర్ లోయలో సుమారు 15లక్షల మంది షియాలు ఉన్నారు. ఈ నేపథ్యంలో లోయలోని లాల్ చౌక్, సైదాకదల్, బుద్గాం, బండిపోరా, అనంతనాగ్, పుల్వామా ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. కశ్మీర్‌కు చెందిన కీలక నాయకుడు మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్.. ఖమేనీ హత్యపట్ల తీవ్ర విచారం, ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఖమేనీ మరణం ముస్లిం ప్రపంచాన్ని కుదిపేసింది. అమెరికా, ఇజ్రాయెల్ ఆయనను దారుణంగా హత్య చేశాయి. ఈ క్రూరత్వాన్ని, ఇరాన్‌పై కొనసాగుతున్న దురాక్రమణను, అలాగే మినాబ్‌లో అమాయక బాలికలపై ఊచకోతను జమ్ముకశ్మీర్ ప్రజలు సమష్టిగా ఖండిస్తున్నారు" అని మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కశ్మీర్ ప్రజల తరఫున ఇరాన్ ప్రజలకు సంఘీభావం తెలుపుతున్నట్టు వెల్లడించారు. "ఈ విషాద సమయంలో మేం ఇరాన్ ప్రజలకు అండగా నిలుస్తున్నాం. ఈ మారణకాండలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకోవాలని, దీనికి కారణమైన వారికి తక్షణమే శిక్షపడేలా చూడాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నాం" అని ఫరూక్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇరాన్‌లో కొనసాగుతున్న దురాక్రమణకు వ్యతిరేకంగా తమ నిరసన, సంఘీభావాన్ని తెలిపేందుకు ముస్లింలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమేనీ హత్యకు నిరసనగా ముతాహిదా మజ్లిస్-ఎ-ఉలమా (ఎంఎంయూ) సోమవారం బంద్‌కు పిలుపునిచ్చిందని తెలిపారు.



శ్రీనగర్‌లో ముస్లింల భారీ నిరసన ప్రదర్శన

డీఎంకే పాలన అవినీతిమయం

» అక్రమాల్లో మంత్రుల మధ్య పోటీ

» అన్ని రంగాల్లోనూ రూ.వేల కోట్ల దోపిడీ

» మేమొస్తే స్వచ్ఛమైన పాలన అందిస్తాం

» తమిళనాడులోని మదురై సభలో మోదీ

చెన్నై, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో డీఎంకే పాలన అవినీతిమయం అయిపోయిందని, రాష్ట్రంలో మాదకద్రవ్యాల మాఫియా చెలరేగిపోతోందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఆదివారం ఆయన తమిళనాడు, పుదుచ్చేరిలలో పర్యటించారు. ఆదివారం సాయంత్రం మదురైలో జరిగిన ఎన్డీయే బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. ఎక్కడైనా పారదర్శక పాలన అందించేందుకు మంత్రుల మధ్య పోటీ ఉంటుందని, కానీ డీఎంకే ప్రభుత్వంలోని మంత్రులు మాత్రం అవినీతిలో పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యోగుల బదిలీల్లో రూ.365 కోట్లు, ఉద్యోగ అవకాశాల పేరుతో రూ.900కోట్లు, కాంట్రాక్టర్ల పేరుతో రూ.1000 కోట్లు, ఇసుక కుంభకోణంలో రూ.4700 కోట్లు, టాస్మాక్ స్కామ్‌లో రూ.40 వేల కోట్లు.. ఇలా ప్రతి విషయంలోనూ డీఎంకే భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితే ప్రజలకు స్వచ్ఛమైన, పారదర్శకమైన పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికలు రాష్ట్రానికి టర్నింగ్ పాయింట్ వంటివని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని గెలిపించేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని ప్రధాని వ్యాఖ్యానించారు.



అరుళ్‌మిగు సుబ్రమణ్యస్వామి ఆలయంలో ప్రధాని మోదీ సాష్టాంగ నమస్కారం

కాంగ్రెస్ స్పీడ్ బ్రేకర్!

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పుదుచ్చేరి.. ఢిల్లీలోని ఓ కుటుంబానికి ఏటీఎంలా ఉండేదని మోదీ ఆరోపించారు. పుదుచ్చేరిలో ఆదివారం ఉదయం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించిన అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. పుదుచ్చేరి అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ స్పీడ్‌బ్రేకర్‌లా వ్యవహరించిందని విమర్శించారు. ఆ పార్టీ పాలన అవినీతి, నేరాలమయంగా మారిందని, పేదలకు కష్టాలను మిగిల్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుదుచ్చేరి సీఎం ఎన్. రంగస్వామి మాట్లాడుతూ.. కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

తిరుప్పరంగుండ్రంలో ప్రధాని పూజలు

మదురై జిల్లా తిరుప్పరంగుండ్రంలోని అరుళ్‌మిగు సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. 15 నిముషాల పాటు ప్రధాని ఆలయంలో గడిపారు. అర్చకులు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందించారు. ప్రధాని వెంట తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి, కేంద్ర మంత్రి ఎల్. మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఉన్నారు. ఇటీవల తమిళనాట తీవ్ర వివాదం రేపిన ఆలయానికి ప్రధాని రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

అమెరికా బార్‌లో కాల్పులు.. ముగ్గురి మృతి

ఆస్టిన్, మార్చి 1: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్‌లో ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు మరణించగా, 14 మంది గాయపడ్డట్టు అధికారవర్గాలు తెలిపాయి. పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో నిందితుడు కూడా మరణించాడు. బీర్ గార్డెన్‌గా పేరుపొందిన బఫోర్డ్ బార్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. బార్‌లో ఓ వ్యక్తి కాల్పులు జరుపుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వెళ్లగా చేతిలో తుపాకీ ఉన్న ఆ వ్యక్తి ఎదురుపడ్డాడు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఆ అనుమానితుడు మరణించాడు. గాయపడ్డ వారిని ఆస్పత్రులకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

బీజేపీ పతనానికి కౌంట్‌డౌన్ మొదలు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మార్చి 1: బీజేపీని అధికారం నుంచి తొలగించేందుకు కౌంట్‌డౌన్ మొదలయిందని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ ఘాటుగా విమర్శించారు. అందర్నీ భయపట్టే నియంత తానే భయపడితే అది పరిపాలన అంతానికి సూచికలాంటిదని వ్యాఖ్యానించారు. మద్యం విధానం కుంభకోణం కేసును కోర్టు కొట్టివేయడాన్ని పురస్కరించుకొని ఆదివారం జంతర్‌మంతర్ వద్ద జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మోదీ, అమిత్ షాలు కుట్ర పన్ని తనను మద్యం కేసులో ఇరికించారని ఆరోపించారు. అందర్నీ భయపెట్టిన మోదీ ఇప్పుడు తానే భయపడుతున్నారని అన్నారు. '

మహారాష్ట్రలో 17 మంది సజీవ దహనం

» మైనింగ్-పారిశ్రామిక పేలుడు పదార్థాల ఫ్యాక్టరీలో విస్ఫోటం

నాగ్‌పూర్, మార్చి 1: మైనింగ్-పారిశ్రామిక పేలుడు పదార్థాలు తయారు చేసే ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 17 మంది సజీవ దహనమయ్యారు. గుర్తుపట్టడానికి వీలులేని విధంగా మృతదేహాలు కాలిపోవడంతో మృతుల గుర్తింపు కోసం కుటుంబసభ్యుల నుంచి డీఎన్ఏ శాంపిళ్లను అధికారులు సేకరిస్తున్నారు. ఘటనలో మరో 18 మందికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా కాటోల్ మండలం రావుల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో ఆదివారం ఉదయం ఈ పేలుడు సంభవించింది. ఘటన స్థలంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌తోపాటు పీఈఎస్‌వో(పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫిటీ ఆర్గనైజేషన్), డీఐఎస్ఎస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ సెక్యూరిటీ) బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి, వైద్యం అందిస్తున్నామన్నారు. స్థానిక అధికారుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నామని వెల్లడించారు. కాగా, కంపెనీకి చెందిన ప్యాకింగ్ యూనిట్‌లో ఉదయం 7 గంటల నుంచి 7.15 గంటల మధ్యలో ఈ పేలుడు సంభవించిందని ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఆ సమయంలో పేలుడు పదార్థాల తయారీ ప్రక్రియలేమీ జరగడం లేదు. పేలుడుకు కారణం ఏమిటనేదానిపై దర్యాప్తు కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నాం' అని పేర్కొంది. తక్షణమే అత్యవసర స్పందన ప్రొటోకాల్స్‌ను అమలు చేశామని, పరిస్థితి నియంత్రణలోకి వచ్చిందని తెలిపింది. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది.

ఆ తీర్పు చట్టవిరుద్ధం!

» ఢిల్లీ మద్యం కేసులో ట్రయల్ కోర్టు తీర్పు అహేతుకం

» తీర్పుపై హైకోర్టులో సవాల్ చేసిన దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ.. ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. 974 పేజీలతో రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది. ట్రయల్ కోర్టు తీర్పు అత్యంత విస్తుగొలిపేలా ఉందని, అది చట్టపరమైన తప్పిదాలతో కూడుకున్నదని పిటిషన్‌లో సీబీఐ పేర్కొంది. "చట్టవిరుద్ధం, అహేతుకం, ప్రాథమికంగానే లోపభూయిష్టం" అంటూ తీవ్రంగా స్పందించింది. 2021-2022 ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు జరిగాయంటూ సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అప్పటి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సహా 23 మందిని నిందితులుగా చేర్చారు. ఈ కేసుకు సంబంధించి రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక తీర్పునిచ్చింది. అందరూ నిర్దోషులేనని తీర్పునిస్తూ జడ్జి జితేంద్రసింగ్.. సీబీఐ తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. దర్యాప్తు సంస్థ ఏ దశలోనూ తన విధిని సరిగా నిర్వర్తించలేదని, దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తన తీర్పులో పేర్కొన్నారు. అయితే ఈ తీర్పుపై సీబీఐ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. తీర్పునిచ్చే సమయంలో అసలు కుట్ర కోణాన్ని ట్రయల్ కోర్టు విస్మరించిందని పేర్కొంది. "ప్రాసిక్యూషన్ సమర్పించిన బలమైన సాక్ష్యాధారాలను ట్రయల్ కోర్టు పక్కనబెట్టింది. తీర్పునిచ్చే సందర్భంలో జడ్జి చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థ నిబద్ధతపై ప్రభావం చూపే ప్రమాదముంది" అని పేర్కొంది.

విడి విడి అంశాలుగా చూసినందునే..: నిందితులు నిర్దోషులంటూ తీర్పు వెలువరించే సమయం లో ట్రయల్ కోర్టు జడ్జి చేసిన మౌఖిక వ్యాఖ్యలను కూడా సీబీఐ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. 4 నెలలుగా తాను కేవలం ఈ కేసు ఫైళ్లను చదవడానికే వెచ్చించానని జడ్జి పేర్కొన్నారని, దీనిని బట్టి ఆయన సాక్ష్యాధారాలను అత్యంత లోతుగా విశ్లేషించినట్లు అర్థమవుతోందని తెలిపింది. అయితే, కేసులో అభియోగాలు ఖరారు చేసే ప్రాథమిక దశలో సాక్ష్యాధారాలను అంత సుదీర్ఘంగా, లోతుగా విశ్లేషించడానికి చట్టరీత్యా అనుమతి లేదని గుర్తుచేసింది . మద్యం పాలసీ వెనుక ఉన్న భారీ కుట్రను మొత్తంగా చూడకుండా, విడి విడి అంశాలుగా పరిగణించడం వల్ల కేసు నీరుగారిందని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే, దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై సీబీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ఈ నెల 9న జస్టిస్ స్వరణకాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం విచారించనుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.